పాఠకులకు, ప్రకటనకర్తలకు ఉగాది శుభాకాంక్షలు

సంపుటి : 11

సంచిక : 1,2

పుటలు : 52

రూ. 25 లు

ISSN No.
2582-8738

యు.జి.సి. గుర్తింపు పొందినది

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

నుడి నాడు నెనరు

మార్చి, ఏప్రిల్ 2025

అర్థం కాని భాషలో చదువుల వలన ప్రపంచంలో 40 - 90 శాతం పిల్లల తెలివిపై చెడు ప్రభావం













ఎల్లనాడుల
అమ్మనుడుల
పండుగ





అమ్మనుడులలోనే
విద్యాబోధన జరగాలి
–యునెస్కో

కృత్రిమ మేధ తోడ్పాటుతో అమ్మనుడితోనే ఆర్థికాభివృద్ధి



21 ఫిబ్రవరి 2025న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా యునెస్కో డైరెక్టర్ జనరల్ ఓడ్రే అజులే గారి సందేశం

భాష కేవలం సమాచార మార్పిడి సాధనమే కాదు, అంతకంటే ఆలోచనలకు ఆకారం ఇచ్చేదిగానూ, జ్ఞానాన్ని ప్రసారం చేసేదిగానూ, వ్యక్తిత్వాన్నీ, వ్యక్తి అస్తిత్వాన్నీ పరిరక్షించేది కూడా. ప్రతి భాష తనలో ఒక విశ్వాన్ని ఇముడ్చుకుని ఉంటుంది. భాష మానవ వారసత్వపు వ్యక్తీకరణ. అయితే, ఈ వారసత్వం ప్రమాదంలో ఉంది; ప్రస్తుత పరిస్థితుల్లో మాట్లాడుతున్న భాషలలో కనీసం 40% భాషలు కనుమరుగయ్యే ప్రమాదంలో ఉన్నాయి. ఒక భాష కనుమరుగైనప్పుడు, ఆ భాష ద్వారా ఆవిష్కృతమయ్యే ప్రపంచ దృక్పథం కూడా అసమగ్రం అయిపోతుంది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం 25వ (రజతోత్సవ) వార్షికోత్సవం సందర్భంగా, ఐక్యరాజ్యసమితి విద్యా,వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ (యునెస్కో) ప్రపంచవ్యాప్తంగా మాట్లాడే సుమారు 7,000 భాషల పరిరక్షణకు కట్టుబడి ఉన్నట్లు మరింత దృఢంగా ప్రకటిస్తోంది. భాషలలోని ఈ వైరుధ్యాలూ, వైవిధ్యాలూ బోధనకు, అవగాహనకు అడ్డంకిగా కాకుండా, వాటి సాంస్కృతిక, బౌద్ధిక ప్రయోజనాలను మనం గుర్తించాలి. ప్రపంచ భాషల ప్రయోజనాలను గుర్తించడమంటే, ముందుగా ప్రతి వ్యక్తికీ తమ మాతృభాషలోనే విద్యను అందించడానికి అవకాశం కల్పించాలి. ఇది ముఖ్యంగా పాఠశాల ప్రాథమిక దశలో అత్యంత కీలకం, ఎందుకంటే అదే సమయంలో పఠన, లేఖన నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. ఆపై ఇతర భాషల ప్రవేశం సహజంగా జరుగుతుంది. ఈ విషయంపై పరిశోధన స్పష్టంగా ఉంది. ఈ దినోత్సవం సందర్భంగా యునెస్కో విడుదల చేసిన తాజా నివేదిక – "భాషలు ముఖ్యం: బహుభాషా మాధ్యమ విద్యకు విశ్వవ్యాప్త మార్గదర్శనం (**Languages Matter: Global Guidance on Multilingual Education**)" అనేక మార్గాల్లో బహుభాషాత్మక విద్యను మౌలికంగా అభివృద్ధి చేస్తుందని సూచిస్తోంది. మాతృభాషలో విద్యను అందించేటట్లయితే, పిల్లలు ఎక్కువగా పాఠశాలకు హాజరై, మెరుగైన ఫలితాలను కనబరుస్తారు. పాఠశాలలో వారితో వారి మాతృభాషలో మాట్లాడినప్పుడు, వారు పూర్తిగా తమదైనంతగా అనుభూతి పొందుతారు. అదనంగా, తల్లిదండ్రులు కూడా ఉపాధ్యాయులతో సులభంగా సంభాషించగలిగేలా, తమ పిల్లలు ఇంటిపనిని సమర్థవంతంగా పర్యవేక్షించగలుగుతారు. అయితే, ప్రపంచ జనాభాలో 40% పైగా పాఠశాలలలో తమ ఇంటి భాష కాకుండా తమకు అర్థం కాని/పరిమిత అవగాహన ఉన్న భాషలో విద్యను అభ్యసిస్తున్నారు. ఆఫ్రికాలో 22 దేశాలలో నిర్వహించిన అధ్యయనం ప్రకారం, 20% కన్నా తక్కువ మంది పిల్లలు తమ సొంత భాషలో మాత్రమే విద్యను పొందుతున్నారు. మిగతా విద్యార్థులు తమకు అర్థం కాని పరాయి భాషలో చదువుకుంటున్నారు. అందుకే, యునెస్కో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలతో కలిసి, గుణాత్మక విద్యకూ బహుభాషా బోధనకూ ప్రాధాన్యత ఇవ్వడానికి కృషి చేస్తోంది. బడులూ పాఠశాలలూ భాషల మధ్యా, సంస్కృతుల మధ్యా వేర్పాటు వాదాలకు తావు కాకుండా, ప్రతీ విద్యార్థికి ప్రపంచాన్ని అవగాహన చేసుకునే ప్రదేశంగా మారాలి.

యునెస్కో స్థానిక భాషలను పాఠ్యప్రణాళికలో చేర్చేలా మద్దతు అందిస్తోంది. బహుభాషా బోధన కోసం ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సాంప్రదాయ ఉపాధ్యాయుల నైపుణ్యాలను పెంపొందించేందుకు, స్థానిక భాషలనూ ఆదివాసీ సంస్కృతులనూ బోధించేందుకు సహాయం చేస్తోంది. ఈ ప్రయత్నాలన్నీ వేలాది మంది విద్యార్థులకు అద్భుతమైన బహుభాషా విద్యను అందించేందుకు దోహదపడుతున్నాయి.

"జనభాషల (మూలవాసుల) అంతర్జాతీయ దశాబ్దం (2022-2032)"ను అమలు చేయడంలో ఐక్యరాజ్యసమితి వ్యవస్థలో ప్రధాన సంస్థగా ఉన్న యునెస్కో, భాషా వారసత్వపు వైవిధ్యాన్నీ సంపదనూ ప్రోత్సహిస్తూ, దీర్ఘకాలిక శాంతి కోసం సాధనంగా మలచడానికి అంతర్జాతీయ సమాజానికి పిలుపునిస్తోంది.

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం.
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర,తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ వున్న తెలుగువారి కోసం

తెలుగుజాతి పత్రిక

అమ్మనుడి

సంపాదకుడు:
డా.సామల రమేష్‌బాబు 9848016136

సహసంపాదకుడు:
డా. గారపాటి ఉమామహేశ్వరరావు, 9866128846

తోడ్పాటు డా. వెన్నిసెట్టి సింగారావు, డా. సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్



మార్చి 2025
ఏప్రిల్ 2025

రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం, సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. రచనలను వ్యాసం, కథ, వచన కవిత, పాట– ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1.వ్యాసాలు,కథలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుండి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి.వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో పంపాలి. అనుఫాంట్‌లో టైప్ చేసినట్లయితే పి.యండి, మరియు పిడిఎఫ్‌లలో కూడా పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి,స్కాన్ చేసి పంపాలి editorammanudi@gmail.comకు మాత్రమే పంపాలి. కొరియర్‌లో గాని, రిజిష్టర్ పోస్టులో గాని పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నెంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనలను తీసుకోలేము

4.హామీ పత్రం తప్పనిసరి: రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగా రచనతో జోడించాలి. హామీ పత్రం లేని రచనలను ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము

5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను,వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం వీలుకాదు. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం1–2 నెలల వ్యవధి పట్టవచ్చు.

లోపలి పుటలలో

ముఖచిత్రం, ఫొటోలు	కంప్యూటర్
చిదంబరం రావు	యస్. రాజారావు, టి. సీతారామి రెడ్డి

ammanudi.org వెబ్‌సైటులో అమ్మనుడి పాత సంచికలను చదువగలరు.

రచనలను, వార్తలను, ఫొటోలను 'అమ్మనుడి'లో ప్రచురణకై వాట్సాప్‌కు పంపవద్దు: వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్/ రిజిష్టర్డ్ పోస్టులో లేదా editorammanudi@gmail.comకు పంపించండి. – సంపాదకుడు

రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా
సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ–520004.
సంపాదకుడు : *9848016136*, ***e-mail*** : editorammanudi@gmail.com

ఇవీ సంగతులు ...

1. ఆంగ్ల మాధ్యమ బోధనతో మూలాలు, సంస్కృతి నుండి దూరం: ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన మాతృభాషా మాధ్యమ విద్యను అందిస్తున్నప్పటికీ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు లేకపోయినా తల్లిదండ్రులు ప్రైవేటు ఆంగ్ల మాధ్యమ పాఠశాలల పట్ల ఆకర్షితులవుతున్నారని, ఇది 'ఆత్మహత్యకు తక్కువ కాదు' అని NCERT డైరెక్టర్ డి పి సక్లానీ వాపోయారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి) సంస్థ అధినేత మాట్లాడుతూ ప్రైవేట్ ఆంగ్ల మాధ్యమ బడుల్లో తరగతిలో చెప్పాల్సిన సమాచారాన్నంతా విద్యార్థులకు దిండులో దూది కుక్కేసినట్టు కుక్కేస్తున్నారని, ఇలా అభ్యాసం చేయడం వలన పిల్లలు జ్ఞానాన్ని కోల్పోతున్నారని, ఇంకా వారి మూలాలు, సంస్కృతి నుండి ఈ ఆంగ్ల మాధ్యమ బోధన వారిని దూరం చేస్తోందని అన్నారు.

2. కన్నడ అభివృద్ధి ప్రాధికార సంస్థ ఆదరణ: 'మాతృభాషా విద్య యొక్క ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు మరియు పౌరులకు తెలియజేయడంలో మనము పూర్తిగా విఫలమయ్యాము' అని కన్నడ అభివృద్ధి ప్రాధికార సంస్థ అధినేత ఆచార్య పురుషోత్తమ బిళిమలె అన్నారు. ఆయన ప్రణాళికలలో శతాబ్దాల నాటి పాత అనవసర పద్ధతులతో నడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక బోధనా పద్ధతులతో సక్రమం చేస్తూ మోడల్ పాఠశాలలుగా అభివృద్ధి చేయడం, కన్నడ మాట్లాడని వారికి కన్నడను బోధించే వ్యవస్థలను అభివృద్ధి చేయడం మరియు కర్ణాటకలోని చిన్న భాషలను రక్షించడం వంటివి ఉన్నాయి.

3. పాఠశాలల్లో కన్నడను ప్రథమ లేదా రెండవ భాషగా బోధించడం తప్పనిసరి: కర్నాటక రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ద్వారా జారీ చేసిన కొత్త నిబంధనల ప్రకారం CBSE మరియు ICSE పాఠ్యాంశాలను అనుసరించే అన్ని ప్రైవేట్ పాఠశాలలు కన్నడను మొదటి లేదా రెండవ భాషగా బోధించవలసి ఉంటుంది. ప్రభుత్వం కర్ణాటక విద్యా సంస్థల (నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ మరియు నియంత్రణ జారీ) నిబంధనలను నోటిఫై చేసినప్పటికీ పాఠశాలలు దీనిని వ్యతిరేకించడానికి సిద్ధంగా ఉన్నాయి. కొత్త నియమాలు కన్నడ భాషా అభ్యాస చట్టం, 2015కి అనుగుణంగా ఉన్నాయి, ఇది కర్నాటకలోని అన్ని పాఠశాలల్లో కన్నడను ప్రథమ లేదా రెండవ భాషగా బోధించడం తప్పనిసరి చేసింది.

4. ఇంటిభాష లేదా స్థానిక భాష నేర్చుకునేందుకు సూచన: మహారాష్ట్ర కరికులం ఫ్రేమ్‌వర్క్-ఫౌండేషన్ స్థాయి SCF-FL 3-8 సంవత్సరాల వయస్సు గల పిల్లల కోసం రోజూ ఎక్కువ సమయం రోజుకు 30 నుండి 90 నిమిషాల వరకు మొదటి భాష, అది మాతృభాష, ఇంటిభాష లేదా స్థానిక భాష నేర్చుకునేందుకు కేటాయించాలని సూచన చేసింది. ప్రీ-స్కూల్, ప్రైమరీ స్థాయిలలో రెండు భాషలకు ప్రాధాన్యతనిస్తూ, పిల్లలు 3వ తరగతి నాటికి మొదటి భాషలో చదవడం,వ్రాయడం నేర్చుకోవాలని ఈ ప్రభుత్వ సూచనాత్మక ఉత్తర్వు తెలుపుతోంది.

5. మాండలిక భాషలలో నిఘంటువులు, వాచకాల తయారీ: బోధనలో స్థానిక భాషలను ప్రవేశ పెట్టడం ద్వారా రాజస్థాన్ ప్రభుత్వం చదువుల పట్ల విద్యార్థులలో విశ్వాసాన్ని పెంపొందిస్తోంది. రాజస్థాన్ ప్రభుత్వం జారీ చేసిన బోధనా సామగ్రిలో పద్యాలు, ప్రహేళికలు, సామెతలు, చదువుకు సంబంధించిన గోడపత్రాలు, జానపద కథలు, స్థానిక హీరోల కథలు మరియు మాతృభాషలో అభ్యాసపుస్తకాలు ఉన్నాయి. రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వ విద్యా సంస్థ నిర్వహించిన భాషా మ్యాపింగ్ సర్వేలో తొమ్మిది జిల్లాలలో దాదాపు 20% మంది ఉపాధ్యాయులు తాము పనిచేసే ప్రాంతాలకు చెందినవారు కాదని, స్థానిక భాష మాట్లాడరని వెల్లడైంది. తరగతి గది సూచనలలో మాతృభాషను చేర్చడం ద్వారా, విద్యార్థులకు ఇంటి లేక పాఠశాల పరిసరాల మధ్య అంతరాన్ని తగ్గించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రయత్నానికి దోహదమయ్యేలా మార్వాడీ, గరాసియా, మేవారీ, వాగ్డి, గొడ్‌వాడి మరియు ధుందారి వంటి భాషలను పరిచయం చేయడానికి తొమ్మిది జిల్లాలకు నిఘంటువులు ఇంకా ఆయా భాషల ప్రాథమిక వాచకాలను సంస్థ అభివృద్ధి చేసింది. మిగిలిన జిల్లాలకు ఈ ఏడాది చివరి నాటికి బోధనా సామగ్రిని ఆయా జిల్లాల ప్రాంతీయుల మాతృభాషలలోనే త్వరలో విడుదల చేయనున్నారు.

6. కాశ్మీరీ భాష కోసం పోరాటం: కాశ్మీరీ భాష ఉర్దూ, హిందీ వంటి ఆధిపత్య భాషలచే మింగివేయబడుతోందని, రోజువారీ పనులలో భర్తీ చేయబడుతోందని బిలాల్ అహ్మద్ దార్ అనే రచయిత భావిస్తున్నారు. ఇలా ఒక పెద్ద భాష చిన్న భాషను మింగేసి భర్తీ చేసే ప్రక్రియను గ్లోటోఫాజీ అంటారు. కాశ్మీరీ ప్రజల ప్రాచీన కథలకు, సంప్రదాయాలకు మాతృభాష కాశ్మీరీ భాష ఆధిపత్య భాషల నేపథ్యంలో మనుగడ కోసం పోరాడుతోందని రచయిత అన్నారు.

7. ఛత్తీస్‌గఢ్ ఆదర్శం: ఛత్తీస్‌గఢ్ త్వరలో 18 స్థానిక మాండలికాలలో ప్రాథమిక విద్యను అందించనుంది, ఈ చర్య గిరిజన సమాజానికి చెందిన విద్యార్థులు వారి మాతృభాషలో నాణ్యమైన విద్యను పొందేందుకు సహాయపడుతుంది.

8. గోవాలో కొత్త ఇంగ్లీషు మీడియం పాఠశాలలకు అనుమతి నిరాకరణ: గోవాలో కొత్త ఇంగ్లీషు మీడియం పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వబోదని ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ సోమవారం తెలిపారు. కొంకణి మాధ్యమంలో బోధన ప్రారంభించేందుకు అనుమతి తీసుకుని, అనుమతి వచ్చిన తర్వాత ఇంగ్లీషు మాధ్యమానికి మారిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు.

9. కృత్రిమ మేధస్సు సహాయంతో మైనారిటీ భాషలకు అనువాద సేవలు: బష్కిర్, బుర్యాత్, చెచెన్, చువాష్, మేడో మారి, కోమి, ఒస్సేటియన్, సామీ, తువాన్ మరియు యాకుత్లతో సహా రష్యన్ ఫెడరేషన్‌లోని బహుళ జాతులతో సహా ఒకే రోజులో 110 భాషలను గూగుల్ అనువాద సేవలకు జోడించినట్లు గూగుల్ సంస్థ జూన్ 27న తెలిపింది. గూగుల్ అనువాద సేవా వ్యవస్థలో ఇంత పెద్ద సంఖ్యలో భాషలను చేర్చడం కృత్రిమ మేధస్సు వల్ల సాధ్యమైందని అమెరికాకు చెందిన ఇంటర్నెట్ దిగ్గజం తెలిపింది. రష్యన్ ఫెడరేషన్ భాషలతో పాటు, ఇతర భాషలలో ఆఫ్రికాలోని జాతి సమూహాల మాతృభాషలూ

దక్షిణ అమెరికాలోని స్థానిక ప్రజల మాతృభాషలూ ఉన్నాయి, వాటిలో కొన్ని చనిపోయిన భాషలు. భారతీయ భాషల్లో ఈ జోడింపు వలన మేఘాలయకు చెందిన ఖాసీ భాష చేరింది.

10. భూసేకరణ నిబంధనలను తెలుగులో ప్రచురించండి: ఏపీ సర్కారుకు స్పష్టం చేసిన హైకోర్టు. భూసేకరణ చట్ట నిబంధనలను తెలుగులో ప్రచురించాలని ఆం.ప్ర. ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. ఆ తర్వాతే ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి తుది ప్రకటనను ఇవ్వాలని పేర్కొంది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎమ్మెస్ రామచంద్రరావు ఇటీవల ఈమేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. ఏపీ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పునరావాస, పునర్నిర్మాణ కమిషనరు ఈమేరకు నోటీసులు జారీచేశారు. పూర్తి వివరాలతో ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని ఆదేశించారు. భూ సేకరణ ప్రకటనలూ, భూసేకరణ నిబంధనలూ (2014), తాజాగా తీసుకొచ్చిన 2018 భూసేకరణ నిబంధనలను తెలుగులో ప్రచురించకపోవడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడి గ్రామానికి చెందిన ఎం. శ్రీనివాసరావుతో పాటు మరో పది మంది హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయమూర్తి ఈమేరకు ఉత్తర్వులు జారీచేశారు (ఈనాడు సౌజన్యంతో).

11. హిందీ సహా భారతీయ భాషల్లో వైద్యవిద్య: త్వరలోనే హిందీ సహా అనేక భారతీయ భాషల్లో వైద్య విద్య అందుబాటులోకి వస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా లక్ష మెడికల్ సీట్లు అదనంగా ఇచ్చామని, రాబోయే ఐదేళ్లలో మరో 75 వేల మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకొస్తామని వైద్య విద్యార్థులకు ప్రధాని హామీ ఇచ్చారు. దేశంలో లక్షన్నరకు పైగా ఉన్న 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు' బడుగు బలహీనవర్గాలకు మెరుగైన సేవలందిస్తున్నాయని తెలిపారు. దేశంలో దాదాపు నాలుగు కోట్ల మంది ప్రజలు దీని ద్వారా ప్రయోజనం పొందుతున్నారని అన్నారు.

12. అమెరికాలోని భారతీయ విద్యార్థులలో సగానికి పైగా తెలుగు రాష్ట్రాలవారే: అమెరికాలో చదువుతున్న భారతీయులలో అత్యధికంగా దేశంలోనే తెలంగాణ నుంచీ 34%, ఆంధ్రప్రదేశ్ నుంచీ 22% మంది కలిపి తెలుగు విద్యార్థులే సగానికి పైగా ఉన్నారని హైదరాబాద్ లోని అమెరికన్ రాయబార కార్యాలయం తెలుపుతోంది. అంటే, ఇప్పుడు యునైటెడ్ స్టేట్స్‌లోని మొత్తం భారతీయ విద్యార్థులలో సగానికి పైగా ఆంధ్ర, తెలంగాణకు చెందిన విద్యార్థులే ఉన్నారు. గత ఏడాది భారతీయ విద్యార్థుల కోసం జారీ చేసిన వీసాల ఆధారంగా అంతర్జాతీయ విద్యా వారం సందర్భంగా ఈ విషయం వెల్లడైంది. ఈ రాష్ట్రాల నుండి 56 శాతం మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం, తెలుగు విద్యార్థుల ఆధిపత్యం నెరపుతున్నారు. హైదరాబాద్‌లోని రాయబారి కాన్సలేట్ జనరల్, రెబెకా డ్రేమ్, కాన్సలేట్ అలెగ్జాండర్ మెక్‌లారెన్ ప్రజా వ్యవహారాల అధికారి నవంబరు 19, మంగళవారం నాడు ఇక్కడ మీడియా సమావేశంలో గణాంకాలను పంచుకున్నారు.

13. జీవోలు తెలుగులో ఇవ్వకపోవడంపై హైకోర్టు నోటీసులు: రాష్ట్రంలో జీవోలు, ఆర్డినెన్సును తెలుగులో జారీ చేయకపోవడంపై బుధవారం హైకోర్టు తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జీవోలను, ఆర్డినెన్స్‌లను తెలుగులో జారీ చేయకపోవడం అధికార భాషల చట్టం 1956తో పాటు పలు జీవోలకు విరుద్ధ మంటూ శేరిలింగంపల్లికి చెందిన జి.ఉమామహేశ్వరరావు, తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు, తెలంగాణా హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధ్యే, జస్టిస్ జె. శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ప్రభుత్వ ఉత్తర్వులు ఆంగ్లంలో వెలువడుతుండటంతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అన్నారు. ఈ వాదనలపై ప్రభుత్వం తరపు న్యాయవాది స్పందిస్తూ, గత 30 ఏళ్లుగా ఆంగ్లంలో వెలువడుతున్న జీవోలపై ఇబ్బందులు పడుతున్నట్టు ఎవరూ కోర్టును ఆశ్రయించలేదంది. పిటిషన్ను విచారణకు స్వీకరించడంపై ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.

(ఈనాడు, హైదరాబాద్ సౌజన్యంతో)



శ్రద్ధాంజలి

ప్రముఖ నాస్తికోద్యమ నిర్మాత, హేతువాది గోరా కుమార్తె, ప్రముఖ వైద్యురాలు, "నాస్తిక మార్గం" పత్రిక సంపాదకురాలు మారు 06 ఫిబ్రవరి 2025, మధ్యాహ్నం 12గంటలకు కన్నుమూశారు. సమాజసేవలో అంకితభావంతో పనిచేసిన ఆవిడ 14 ఏప్రిల్ 1944లో గోరా, సరస్వతి గోరా దంపతులకు జన్మించారు. క్విట్ ఇండియా సమయంలో గర్భవతిగా ఉన్న సరస్వతి గోరా, తన మూడేళ్ళ కుమారుడు నియంతతో కలసి రాయవెల్లూరు జైలులో ఆరునెలల పాటు నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. విడుదలైన అనంతరం ఆమె డా. మారుకు జన్మనిచ్చారు. "మారు" అనే పేరు రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత భారత దేశం స్వాతంత్ర్యం పొందుతున్న తరుణంలో మార్పును సూచిస్తూ పెట్టారు. వృత్తిని సామాజిక బాధ్యతగా స్వీకరించిన మారు ఆరోగ్య హక్కును ప్రజల హక్కుగా పరిగణించి, 60 ఏళ్లకు పైగా నిబద్ధతతో పని చేశారు. నిస్వార్థమైన ఆమె కృషి అనేక మంది మహిళలకు స్ఫూర్తిగా నిలిచింది. ఆమె కనుమరుగుకు అమ్మనుడి నివాళులు అర్పిస్తోంది.

తెలుగు భాషోద్యమ సమాఖ్య

(ప్రభుత్వ నమోదు సంఖ్య 1288-2003)

20 కోట్ల తెలుగువారి భాషోద్యమ వేదిక

కేంద్రకార్యాలయం: ఇంటి నం. 52-1-4, 1ఎ. వెటర్నరీ కాలనీ, 2-2 వీధి, విజయవాడ.

గౌరవాధ్యక్షులు:
డా. చుక్కా రామయ్య
డా. సామల రమేష్‌బాబు
9848016136

అధ్యక్షులు:
ప్రొ. గారపాటి ఉమామహేశ్వరరావు
9866128846

ప్రధాన కార్యదర్శి:
డా. మొవ్వా శ్రీనివాసరెడ్డి
9490333488

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి లేఖ

నమస్కారాలు,

సమైక్య తెలుగురాష్ట్రం రెండుగా చీలిపోగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా మీరు, విభజన వల్ల ఏర్పడిన సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నిస్తూనే, శక్తివంతమైన తెలుగు రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మించడానికి కృషి చేశారు. అయినా ఎన్నికల రాజకీయాల దుష్ఫలితాలకు గురై తాము అధికారాన్ని కోల్పోవడం ప్రజల దురదృష్టం. రెండవ ఐదేళ్లలో ఎదురైన వినాశకర పాలనను వ్యతిరేకించిన ప్రజలు ఇటీవల ఎన్నికలలో ఇచ్చిన తీర్పు ఫలితంగా మీ నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడటం మన రాష్ట్ర ప్రజలు చేసుకున్న పుణ్యం. మీరు ముఖ్యమంత్రిగా, శ్రీ పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రిగా నవ చైతన్యంతో సరికొత్త ప్రభుత్వం ఏర్పడటంతో తెలుగు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా తమకూ, తమకు తోడుగా నడుస్తున్న ఉపముఖ్యమంత్రి గారికీ, సహచర మంత్రిమండలికీ తెలుగు భాషోద్యమ సమాఖ్య తరపున హృదయపూర్వకమైన అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుకుంటున్నాం.

అయ్యా,

ఆగష్టు 29న తెలుగు భాషాదినోత్సవం. ప్రజల వాడుక భాషగా తెలుగును అన్ని రంగాల్లో వికసింపజేసి, ఉన్నత విద్యాస్థాయి వరకూ తెలుగును తీర్చిదిద్దేందుకు అవిరళ కృషిచేసిన మహా పండితులు, సంస్కర్త, గిడుగు వెంకట రామ్మూర్తి గారు మన దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు నుండే అవిరళ కృషి చేశారు. తెలుగుజాతి స్వాభిమానాన్ని పెంచుకొని, తెలుగు భాషారాష్ట్రం కోసం పోరాటం చేయడానికి కావలసిన శాస్త్రీయ నేపథ్యాన్ని సమకూర్చిన మహావ్యక్తి గిడుగు రామ్మూర్తి గారు. సుమారు 25 ఏళ్లుగా ఆయన జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకొనడం సాంప్రదాయంగా వస్తున్నది. సమైక్య తెలుగు రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే తెలుగు భాషోద్యమకారుల కోరిక మేరకు తెలుగు భాషా దినోత్సవాన్ని ఆగష్టు 29న అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం జరుపుతున్నది. మన దేశ స్వాతంత్ర్యం అనంతరం ఎంతో పోరాట ఫలితంగా- ముఖ్యంగా తెలుగువారు ముందుండి నడిపిన ఉద్యమాలు, చేసిన త్యాగాల ఫలితంగా భాషా రాష్ట్రాలు ఏర్పడినవన్నది జగద్విదితం. ఈ సందర్భంగా ముఖ్యమైన కొన్ని విషయాలను తమకు మనవి చేస్తున్నాం.

రాజ్యాంగం గుర్తించిన 22 భాషలకూ సమాన ప్రతిపత్తి ఉన్నదనీ, ప్రత్యేకంగా గుర్తించిన జాతీయ భాష అంటూ ఏమీ లేదని మనకు తెలుసు. కనుక ఒక జాతీయ భాషగా తెలుగును అన్ని రంగాలలో వికసింప చేసుకుంటూ ఒక భాషాజాతిగా ఎదగడం కోసమే మన రాష్ట్రం ఏర్పడిందన్నది స్పష్టం. అయితే, కాలక్రమంలో జాతీయ పార్టీలు ఈ విషయాన్ని విస్మరించి సాగించిన ఆధిపత్య పాలనను ప్రతిభావంతంగా నిలువరించడం కోసం తెలుగుదేశం తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఘనత నందమూరి తారక రామారావు గారికే దక్కింది.

1982 మే 28వ తేదీన తెలుగుదేశం పార్టీ తిరుపతిలో జరిపిన సభలో ఎన్. టి. ఆర్ చేసిన విధాన ప్రకటన ఇలా ఉంది. "రాజ్య భాషగా పరిగణించబడి ప్రభుత్వంచే అధికారయుతంగా ఆదరించబడని ఏ భాషా పరిపుష్టి చెందదు, వికసించదు. ప్రభుత్వ కార్యాలయాల్లో, కోర్టులలో, విద్యాలయాల్లో అన్ని స్థాయిల్లో ఉపయోగించవలసిన రాష్ట్రంలో తెలుగుకు స్థానం లేకుండా చేయడానికి ప్రజా వ్యతిరేకులైన పాలకవర్గాలవారు ఇంత కాలంగా సాగిస్తూ వచ్చిన

మోసపూరిత విధానాలు ఇకముందు సాగనివ్వమని తెలుగుదేశం పార్టీ తీవ్ర హెచ్చరిక చేస్తున్నది.” ఇదీ, స్పష్టంగా పార్టీ ప్రకటించిన విధానం. ఆ సందర్భంగా 10 తీర్మానాలతో పార్టీ భాషా విధానాన్ని కూడా స్పష్టంగా ప్రకటించారు. నాటికీ నేటికీ తమ భాషా విధానాన్ని ప్రకటించిన ఏకైక పార్టీ తెలుగు నేలపై తెలుగుదేశం పార్టీయే అని ఈ సందర్భంగా మళ్లీ అన్ని వేదికల పైన ప్రకటించాల్సిన సమయం వచ్చింది.

సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో రెండు విడతలూ, తర్వాత విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్లు ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధి కోసం మీరు చేసిన కృషి చిరస్మరణీయం. గెలుపోటముల ఆటుపోట్లను తట్టుకొని, కీలక సమయంలో మళ్లీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా మీరు పాలనా పగ్గాలు చేపట్టడం మా బోటివారికి ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నది. పక్కదారి పట్టించి, ప్రగతి నిరోధకంగా వ్యవహరించిన గత పాలకులను ఓడించి, తిరుగులేని మెజారిటీతో ఎన్డీఏ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించడంతో ప్రజల్లో పాలకుల విధానాల పట్ల ఆసక్తి కొత్త ఆశలు రేకెత్తుతున్నాయి. కీ. శే. ఎన్టీ రామారావు గారు ఆశించిన నిజమైన తెలుగు రాష్ట్రంగా ఈ తెలుగు నేలను తీర్చిదిద్దడానికి మీకు అద్భుతమైన అవకాశంగా దీనిని మీరు స్వీకరిస్తారని మేము ఆశిస్తున్నాం. తెలుగుదేశం పార్టీ నేతగా మీరు ఎన్టీ రామారావు గారి వారసులు. పైగా ఇప్పుడు ప్రభుత్వంలో, అసంఖ్యాక ప్రజానీకంతోపాటు, యువత నుండి అపారమైన ఆదరణ మన్నన పొందుతున్న మీ సహచరుడు ఉపముఖ్యమంత్రి తెలుగుభాషా ప్రియుడు అయిన శ్రీ పవన్ కళ్యాణ్ మీకు తోడుగా ఉన్నారు. దేశీయ మాతృభాషలను ప్రోత్సహించడాన్ని ఒక విధానంగా పెట్టుకున్న కేంద్రంలో పాలనలో ఉన్న భారతీయ జనతా పార్టీతో కలిసి ఉండటంతో రానున్న ఐదేళ్లలో అన్ని రంగాలతో పాటు ఒక జాతిగా తెలుగు ప్రజలను తీర్చిదిద్దగల గొప్ప శక్తిని తాము కలిగి ఉన్నారు.

భాషా ప్రాతిపదికన ఏర్పడిన మన పొరుగు రాష్ట్రాలు వారి స్వాభిమానాన్ని చాటుకుంటూ ముందుకు సాగుతున్నాయి. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు ఈ విషయంలో పోటీ పడుతున్నాయి. కానీ మన రాష్ట్ర ప్రభుత్వాలు తెలుగులో పాలన, తెలుగులో విద్య వంటి ప్రాణసమమైన అంశాలను పట్టించుకోకపోవడంతో పాటు ఆత్మహత్యా సదృశమైన విధానాలను అవలంబించడం వల్ల మనం జాతి మౌలిక అంశాలను అలక్ష్యం చేసినట్లయింది. గతాన్ని పక్కనపెట్టి, జరిగిన లోపాలను సరిచేసుకుంటూ ముందుకు సాగడానికి తగిన ప్రభుత్వం, ఎంతో అనుభవజ్ఞులైన మీ నాయకత్వాన ఏర్పడినందుకు సంతోషిస్తూ వెంటనే తమరు చూపు సారించి, తగు చర్యలు గైకొనవలసిన అంశాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి అత్యవసరమైనవి అయిన 5 అంశాలను మాత్రమే ఇక్కడ ఇప్పుడు తమకు మనవి చేస్తున్నాం.

1. అధికార భాషగా తెలుగు అమలుకై ముఖ్యమంత్రి స్థాయిలో రాజకీయ సంకల్పం కావాలి: రాష్ట్ర సచివాలయం మొదలుకొని, గ్రామ సచివాలయాల వరకూ రాష్ట్ర పరిపాలన పూర్తిగా ప్రజల భాష తెలుగులో నిర్వహించటానికి వెంటనే తగు చర్యలను చేపట్టాలని కోరుతున్నాం. మీరు, మీ మంత్రివర్గం ఈ అంశాలపై ఒక రాజకీయ సంకల్పం చేస్తే ఇది సాధ్యమే. ఇది అసాధ్యమేమీ కాదు. ఎన్టీ రామారావు గారి పాలనా కాలంలో ఒక్క వారం రోజుల వ్యవధితో 1988 నవంబరు 1నుండి మార్పు మొదలైంది. కేవలం ఆ తర్వాత పాలకుల రాజకీయ సంకల్పం కొరవడడం వల్లనే ఇది కొనసాగలేదు. దీనిని ఇప్పుడు మీ హయాంలో సాధించి, తెలుగు ప్రజల మన్ననలను పొందాలని కోరుతున్నాం.

2. నిర్బంధ ఆంగ్ల విద్యా బోధన చట్ట విరుద్ధం: బోధనలో తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా రద్దు చేయడంతో పాటు, పనిగట్టుకుని గత వైయస్ఆర్సీపీ ప్రభుత్వం తెలుగు వ్యతిరేక విధానాలు కొనసాగించడం వల్ల రాష్ట్రంలో విద్యారంగం బాగా దెబ్బతిన్నది. ఈ విషయమై ఆ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. ఆ తీర్పును కాదని గత ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. ఇప్పుడు, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవలసిందిగా తమను కోరుతున్నాం. జాతీయ విద్యా విధానం, విద్యాహక్కు చట్టం, రాజ్యాంగం మాతృభాషలో విద్యాబోధనకు పెద్దపీటవేశాయి. వాటిని పరిశీలించడంతోపాటు, ఇంతవరకు అందుకు వ్యతిరేకంగా గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాలవల్ల మన పిల్లలు ఎంత నష్టపోయారో తేల్చిచెప్పిన సర్వే సంస్థల నివేదికలను, ప్రకటనలను పరిశీలించ వలసినదిగా కోరుతున్నాము. మేము ఆంగ్ల భాషా బోధనకు వ్యతిరేకం కాదు. నేటి అవసరాలకు తగ్గట్టు విధాన నిర్ణయం చేసి, శాస్త్రీయ విధానాలను

అవలంబించండి. తెలుగు వ్యతిరేక విధానాలంటే తెలుగు ప్రజల మాతృభాషనూ ప్రజల అస్తిత్వాన్నీ ప్రశ్నిస్తున్నట్లే. వివరంగా పరిశీలించి తగు చర్యలు గైకొనండి.

3. ప్రభుత్వ ఉద్యోగాలలో 20 శాతం రిజర్వేషన్: తెలుగు మాధ్యమంలో చదువుకున్న అభ్యర్థులకు ప్రభుత్వ ఉద్యోగాలలో 20 శాతం కేటాయింపు (రిజర్వేషన్) ఇస్తూ వెంటనే నిర్ణయం చేయాలని తమను కోరుతున్నాం. మన పొరుగున ఉన్న తమిళనాడు రాష్ట్రంలో 14 సంవత్సరాలుగా ఇటువంటి ఉత్తర్వులు అమలులో ఉన్నాయి. ఆ రాష్ట్ర హైకోర్టు ఈ విధానాన్ని పూర్తిగా అంగీకరించి, వ్యతిరేకంగా వచ్చిన వ్యాజ్యాలను కొట్టివేసింది. జి.ఓ. నం. 145/ 3009.2010) తమిళనాడు ఆర్డర్ 30:3/2010).

4. తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ: తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను పూర్తి స్థాయిలో వ్యవస్థీకృతం చేయాలి: 2018లో మీరు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటుచేయడానికి ఉత్తర్వు జీ.ఓ.ఎమ్.ఎస్.నం.40/10-07-2018 ఇచ్చి ఉన్నారు. దానిని తెలుగు ప్రజలందరూ స్వాగతించారు. 2009నుంచి తెలుగు భాషోద్యమ సమాఖ్య నిరంతర ఉద్యమ ఫలితమే ఇది. అయితే ఇప్పటివరకూ దానికి సరైన పాలక మండలి నిర్మాణం, ప్రత్యేక బడ్జెటు, వ్యవస్థాత్మక నిర్వహణ జరగలేదు. తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను పూర్తిస్థాయిలో వ్యవస్థీకృతం చేయాలని కోరుతున్నాం.

5. తెలుగు అకాడమీ పునరుద్ధరణ: తెలుగు అకాడమీ 1968 నుండి ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో కృషి చేసిన సంగతి తమకు తెలిసిందే. కీ. శే. పీ. వీ. నరసింహారావు గారు చేసిన పుణ్యం అది. రాష్ట్రం చీలిపోయే నాటికే కావలసినన్ని నిధులతో ఉన్నది. రాష్ట్ర విభజనలో అపరిష్కృతంగా ఉండిపోయిన సమస్య అది. కాగా, గత ప్రభుత్వం దీనిని పరిష్కరించక పోగా, విభజిత రాష్ట్రంలో కొత్తగా తెలుగు అకాడమీని పెట్టడానికి జీ.వో 21/16.6.2020ని ఇచ్చింది. పైగా తెలుగు అకాడమీని తెలుగు, సంస్కృత అకాడమీగా మార్చి తెలుగు వ్యతిరేక చర్యకు పాల్పడింది. అందులో నుంచి సంస్కృతాన్ని తొలగించి దానిని కేవలం తెలుగు అకాడమీ గానే ఉంచాలి. అంతేగాదు - అసలు సమైక్య రాష్ట్రంలోని తెలుగు అకాడమీ మన ఉమ్మడి ఆస్తి గనుక దాని నుంచి రావాల్సిన సొమ్ము, సంపద, మేధోహక్కులు వంటి సమస్యలను పరిష్కరించడం అవసరం. దీనిపై నిపుణుల సలహాతో ముందుకు సాగవలసిందిగా కోరుతున్నాం.

గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారూ, ఆంధ్రప్రదేశ్‌ను అన్నివిధాలుగా ఆత్మగౌరవంతో, చారిత్రాత్మకంగా, సంపన్నంగా, ఆధునికంగా ముందుకు తీసుకుపోగల సత్తా ఉన్న ప్రభుత్వం మీది. మన ప్రజలు మేధా సంపన్నులు. మన యువత ప్రపంచాన్నే చుట్టివేస్తున్నారు. పాలకుల పాలనలోనే లోటుపాట్లు ఉన్నాయి. వీటిని సవరించాలి. తెలుగుజాతి తన భాషాసంస్కృతులను కాపాడుకుంటూ ముందు అడుగు వేయాలి. ఇందుకు స్వభాష ఆటంకం కాదు. అది మన బలం, అది శక్తి హీనం కాదు. భాష నశిస్తే జాతి నశిస్తుంది. గాంధీ గారి నుండి గిడుగు దాకా అందరూ మాతృభాషలతోనే అభివృద్ధి అని చెప్పారు. ప్రపంచంలోని ఏ మేధావీ మాతృభాషలతో జ్ఞానం రాదని చెప్పలేదు. ఆత్మగౌరవం లేని పరాయీకరణకు ప్రభుత్వాలు తోడ్పడకూడదు. మీకు తెలియనిది ఏమీ లేదు. ఈ దిశగా తమ ఆలోచనను సాగించండి. తేలికగా మాతృభాష తోనే మనోవికాసం. పరభాషలతో అదనపు అభివృద్ధి అని తమకు తెలియనిది కాదు.

తమరు మా కోరికలను పరిశీలించి తగు చర్యలను గైకొనగలరని ఆశిస్తున్నాం. ఏ వివరాలకైనా, తోడ్పాటుకైనా తెలుగు భాషోద్యమ సమాఖ్య ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని మనవి చేస్తున్నాం.

ధన్యవాదాలతో ...

భవదీయుడు,
ప్రొ. గారపాటి ఉమామహేశ్వరరావు

ఈ లేఖ ప్రతులను వీరికి పంపడమైనది:

1. గౌ. శ్రీ చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసన సభాపతి (స్పీకర్), ఆంధ్రప్రదేశ్
2. గౌ. శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్, ఉపముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
3. గౌ. శ్రీ నారా లోకేష్, మానవ వనరులు, సమాచార సాంకేతిక శాఖామంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
4. గౌ. శ్రీ కందుల లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్, సాంస్కృతిక శాఖామంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
5. గౌ. శ్రీ నీరభ్ కుమార్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

• • •

సంపుటి 11 సంచిక 1,2
అమ్మనుడి
మార్చి, ఏప్రిల్ 2025

సంపాదకీయం

కృత్రిమ మేధ తోడ్పాటుతో అమ్మనుడితోనే ఆర్థికాభివృద్ధి

ఈ యేడాదితో 25 ఏండ్లు నిండిన సందర్భంగా ఫిబ్రవరి 21వ తేదీన ఐరాసవారి విద్యా వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాల వెండి పండుగ జరుపుకొంది. ఈ సంస్థ అధ్యక్షురాలు ఒడ్రే అజులే తమ ఉపన్యాసంలో ప్రపంచ దేశాధినేతలనూ మేధావులనూ ఉద్దేశించి ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలూ రాష్ట్రాలు అక్షరాస్యతా పరంగానూ ఆర్థికపరంగానూ వారి వెనుకబాటుకు ముఖ్యకారణం ఆయా దేశాలలో 40 నుంచి 90 శాతంపైగా పిల్లలు తమ సొంత భాషలో చదువుకోలేకపోవడమేనని పేర్కొనడం గమనించాలి. ప్రత్యేకంగా ఉన్నతాధికారులూ శాసన కర్తలూ ఈ విషయాన్ని తప్పనిసరిగా గుర్తించాలి.

ఆంగ్లభాషను నేర్చుకోవడానికీ ఆంగ్ల మాధ్యమంలో నేర్చుకోవడానికి తేడాని గుర్తించి పిల్లలు ఎవరి సొంత భాషలో వారు నేర్చుకోవడం అవసరమని యునెస్కో చెబుతోంది.ఆంగ్లాన్నిగానీ మరి కొన్ని ఇతర భాషలను గానీ భాషా విషయాలుగా నేర్చుకోవచ్చని తాత్పర్యం.

యునెస్కో గడిచిన 70 ఏండ్లుగా మాతృభాషలో విద్యా బోధనను ప్రోత్సహిస్తోంది. కొన్ని అల్పసంఖ్యాక వర్గాలకోసం బహుభాషా మాధ్యమ విద్యను కూడా ప్రోత్సహిస్తోంది. 1953లోనే, విద్యలో స్థానిక భాషల వాడుక గురించి ఒక పుస్తకాన్నే ప్రచురించి ప్రపంచ దేశాధినేతలకు అందచేసింది. అవసరమైతే, బహుభాషా విద్యలో విద్యార్థుల మాతృభాషతోపాటు మరో రెండు భాషలను వాడుకోవచ్చని 1999లో జనరల్ కౌన్సిల్ లో తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సందర్భంలోనే, యునెస్కో ఫిబ్రవరి 21ని అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించింది. 2022 నుండి పదేండ్లపాటు మాతృభాషల దశాబ్దానికి యునెస్కో నాయకత్వం వహిస్తుందని ప్రకటించింది. ఈ ప్రకటన వెనుక ప్రపంచవ్యాప్తంగా భాషాశాస్త్రజ్ఞులూ, సామాజిక శాస్త్రజ్ఞులూ, ఇతర మానవీయశాస్త్రాలలో నిపుణులూ చేసిన పరిశోధనల ఆధారంగా మాతృభాషలో బోధన ఎన్నో ప్రయోజనాలతో కూడినది అనే శాస్త్రీయ నిరూపణ ఉంది. ముఖ్యంగా, బడివదిలేసే పిల్లల తగ్గుదల, పిల్లల చదువులపై తల్లిదండ్రుల అజమాయిషీకి అవకాశం, పిల్లలు మెరుగైన ఆలోచనా నైపుణ్యాలను అలవరుచుకోవడం జరుగుతుందని నిక్కచ్చిగా తేలిన పరిశోధనా ఫలితాలు. దేశాల ఆర్థిక స్థితిగతులనుమెరుగుపరుచుకోడానికి బహుభాషా విద్య ఒక మార్గమని యునెస్కో కూడా విశ్వసిస్తోంది. ఇది ప్రపంచ భాషా వైవిధ్యాన్ని సంరక్షించడానికీ, పునరుజ్జీవింపజేయడానికీ సహాయపడుతుంది.

ప్రపంచంలో మాతృభాషలలో చదువుకున్న దేశాలే ఆర్థిక, సాంకేతిక ప్రగతిని సాధించాయి అనేందుకు రోజూ వార్తా పత్రికలు తిరగేయనక్కరలేదు, అంతర్జాలంలో సామాజిక మాధ్యమాలను జొపోసన పట్టాల్సిన పనీ లేదు. చుట్టూతా ఉన్న ప్రపంచాన్ని చూసైనా తెలుసుకోవచ్చు. ప్రపంచంలోని ఆధునిక వస్తువుల ఉత్పాదనకూ వాటిద్వారా సంపదసృష్టికీ కారణమైన మేధా సంపత్తిని సృష్టిస్తోన్న ప్రధాన దేశాలలో మొదటి ఐదింటిలో దక్షిణకొరియా, జపాను, అ.సం.రా, చైనా, ఇజ్రాయేలు ఉండటం దీనికి నిదర్శనం. ఇవన్నీ స్థానిక భాషలలో చదువు నేర్పే దేశాలు కావడం మనకు కనువిప్పు కావాలి.

వేల ఏండ్ల సామాజిక సాంస్కృతిక సాహిత్య చరిత్ర కలిగి, ప్రపంచంలో ఎక్కువ మంది మాట్లాడే మొదటి 12 భాషల్లో ఒకటిగా, కోట్ల మందికి మాతృభాషగా ఉన్న తెలుగును బోధనా భాషగా తొలగించడం దూరదృష్టి లేని దుశ్చర్యగానూ తెలుగువారిమీద దాడిగానూ భావించాల్సివుంటుంది. మరే రాష్ట్రంలోనూ దేశంలోనూ మాతృభాషకు జరగనటువంటి అవమానం ఇది. కోట్లాదిమంది మాట్లాడేమాతృభాషను చదువులకు అక్కర్లేదనడం రేపటి తెలుగు ప్రజల భవిష్యత్తును మరో తడవు కార్పోరేట్ శక్తుల ఆర్థిక పెత్తనంవైపుగా వలసపాలనకు తెరతీయడమే అవుతుంది. గత డెబ్భై ఏండ్లుగా ఇంగ్లీషు మీడియంలో చదువుకున్న ఈశాన్య రాష్ట్రాలు చెప్పుకోదగ్గ ఆవిష్కరణలుగానీ, శాస్త్రవేత్తలనుగానీ విద్యావేత్తలనుగానీ దేశానికి అందించలేకపోయాయి.

కృత్రిమ మేధతో కూడిన బృహద్ భాషా నిధుల యంత్రాధ్యయనంతో తయారవుతున్న యంత్రానువాద వ్యవస్థలు ఎవరి మాతృభాషలో వారు మాట్లాడటం, రాయటం, ఏ భాషలో ఉన్న విషయాన్నైనా తమ భాషలో వినటం, చదవటం సాధ్యం అవుతోన్న కాలం ఇది. కొన్నిభాషలను ప్రపంచ భాషలనీ సంపర్క భాషలనీ, జాతీయ భాషలనీ ఒకరి భాషను మరొకరిపై రుద్దటం ప్రజాస్వామ్య యుగంలో అనాగరిక చర్య. రేపటి కృత్రిమ బౌద్ధిక సమాజంలో మాతృభాషల ప్రాధాన్యత ఎంతో విలువైనది, ఎందుకంటే వాటితోనే సమాజంలో సమానత్వాన్నీ, ఆర్థిక వృద్ధినీ, మానవ హక్కుల పరిరక్షణనూ, సాంస్కృతిక సంరక్షణనూ అందరికీ, అందుబాటులోకి తెచ్చేందుకు సాధ్యమవుతుంది.

ఒక రాష్ట్రంలోగానీ దేశంలోగానీ భాషా సమస్య ఆర్థిక సమస్యలకు కారణం అవుతుంది. ఇది భాషలూ సంస్కృతులూ, జాతుల ఉనికికే సమస్యగా మారుతుంది. చివరకు రాజకీయ ప్రాదేశిక సమస్యగా మారి సామాజిక సంక్షోభానికి దారితీయవచ్చు.సమాజంలో సమానత్వ సాధనకు మౌలిక రూపంలో ప్రోత్సాహాన్ని ఇచ్చే మాతృభాషలకు మద్దతుగా కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థలు విభిన్న జనాభాల అవసరాలకు అనుగుణంగా పనిచేస్తాయి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలోనూ పట్టణ ప్రాంతాల్లోని వివిధ భాషలు మాట్లాడే ప్రజలు మాట్లాడగల యంత్రానువాద వ్యవస్థలతో అలవోకగా మాట్లాడుకోవచ్చు. ఇది విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ ప్రైవేటు సేవల వంటి రంగాలలో సమాన అవకాశాలను కల్పిస్తుంది.

విపణివీధులలో దొరికే కోట్లాది రకాల వస్తువుల కొనుగోళ్లు, వాటి వినియోగం గురించిన సమాచారం కృత్రిమ మేధ ఆధారంగా స్థానిక భాషలలో అందించడంతో వివిధ భాషలు మాట్లాడే ప్రజలందరికీ తాము కొనే వస్తువులపట్ల పరిజ్ఞానం సొంతమవుతుంది. మాతృభాషలలో వినియోగవస్తువుల సమాచారం మరింత సహజ అనుభూతిని కలిగిస్తుంది. కృత్రిమ మేధ ఆధారిత యంత్రానువాద వ్యవస్థలు భాషల అడ్డంకులను తగ్గించి, వస్తువులను వినియోగదారులకు మరింత చేరువ చేస్తాయి.ఆర్థిక శక్తికి ఆలవాలంగా కృత్రిమ మేధతో స్థానిక భాషల వాడకం పెరగడంతో ప్రాంతీయ మార్కెట్లను సమర్థవంతంగా చేరుకోవడానికి వీలుకలగడమేగాక, తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక వృద్ధికి ప్రోత్సాహం వస్తుంది.

కృత్రిమ మేధతో మాతృభాషల్లో సమాచారం అందుబాటులోకి రావడం వల్ల సాంకేతిక పురోగతితో అత్యంత ఆధునిక జ్ఞానం ప్రధాన భాషలు మాట్లాడేవారికి మాత్రమే పరిమితం కాకుండా అందరికీ అందుబాటులోకి వస్తుంది. దీనితో ఎవరి భాషలలో వారు నేర్చుకునేలా, సృజనాత్మకంగా అభివృద్ధి చెందేలా వీలుకలిగిస్తుంది. మొత్తానికి, కృత్రిమ మేధాసమాజంలో మాతృభాషల విస్తృత వాడకం, వికాసం ద్వారా ప్రజాస్వామ్యపరమైన, సాంస్కృతికంగా బలమైన, అందరికీ అందుబాటులో ఉండే ప్రపంచాన్ని సృష్టించబోతున్నాం.

భాష, సమస్య కారాదు. ఇది అంతర్జాల యుగం. కృత్రిమ మేధ రోజులు ఇవి. మునుపటిలా ప్రపంచంలో ఏ దేశమూ ఏక భాషా దేశంగా లేదు. అన్నీ బహు భాషా దేశాలే. అయితే అంత మాత్రాన ప్రజల భాషను గాలికి వదిలి ఇంగ్లీషులో చదువుకుందాం అని ఏ దేశంగానీ ఏ రాష్ట్రంగానీ ఆంగ్లభాషా మాధ్యమాన్ని మనం నెత్తికెత్తుకొన్నట్లు ఎత్తుకోలేదు. ఏ దేశమూ భాషను ఒక సమస్య చేయలేదు. కానీ తెలుగు రాష్ట్రాలు చదువులను ఒక భాషా సమస్యగా చిత్రించి ఆధునిక చదువులకు ఇంగ్లీషు మీడియం అవసరం అంటూ తెలుగు మాధ్యమానికి పాతరేశాయి. తెలుగును పక్కన బెట్టిన ప్రభుత్వాలనుకూడా అట్లాగే ప్రజలు గద్దెమీదినుంచి ఊడ్చిపారేశారు తగిన గుణపాఠంగా. రెండు రాష్ట్రాలలోనూ గత ప్రభుత్వాల ఓటమికీ ఇది ఒక ప్రధాన కారణమని తెలుసుకోవాలి. ప్రజల కోపం నివురుగప్పిన నిప్పులా ఓట్ల రూపంలో చెలరేగింది.

ఏ దేశంలోనైనా ఏ రాష్ట్రంలోనైనా అక్కడి స్థానిక భాషే బోధనా భాషగా ఉంటుంది. అలాకాక ఇంగ్లీషునో మరో భాషనో బోధనా భాషగా నిర్బంధం చేస్తే ప్రజల కోపాన్ని ఎదుర్కోక తప్పదు. అది ఇప్పటికిప్పుడు కనిపించకపోవచ్చు. కానీ పాలకులకు సమస్యగా పరిణమించి సమాజ వికాసాన్ని అడ్డుకొంటుంది.

25 మార్చి 2025

ఎదుటి వాని భాషలో మాట్లాడటం తెలుగువానికున్న అతి పెద్ద దుర్గుణం

పట్టపు శివకుమార్
9492032640

ఆధునిక తెలుగు భాషా సాహిత్యాలకు గురజాడ అప్పారావు గారి దోహదం

పరిచయం:

తెలుగు సారస్వత లోకంలో "గురజాడ"గా సుప్రసిద్ధులైన గురజాడ వేంకట అప్పారావు పంతులు గారు 1862 సెప్టెంబర్ 21న విశాఖపట్నం జిల్లా రాయవరం గ్రామంలో జన్మించారు. గురజాడ ప్రాథమిక విద్యాభ్యాసం చీపురుపల్లిలో, మెట్రిక్, ఎఫ్. ఏ., బి. ఏ. విజయ నగరంలో పూర్తి చేశారు. కుటుంబ పరిస్థితుల వల్ల అప్పారావు కొంతకాలం గుమాస్తాగా, కాలేజీలో ఉపన్యాసకుడుగా పనిచేశారు. ఆ తర్వాత ఆనందగజపతి సంస్థానంలో ఉద్యోగిగా చేరారు. గురజాడ తెలుగు, ఆంగ్ల సాహిత్యాల తోపాటు పాశ్చాత్య దేశాల్లోని వర్తమాన సాహిత్యాన్ని కూడా చక్కగా అధ్యయనం చేశారు. అందువల్లనే గురజాడ తన కాలంనాటి సంఘంలో ప్రబలంగా ఉన్న మూఢ నమ్మకాలకి వ్యతిరేకంగా తన రచనలతో గొప్ప పోరాటం చేశారు. గురజాడ బాల్య వివాహాలను ఖండించి, వితంతు వివాహాలను ప్రోత్సహించారు. తద్వారా ఆయన సంఘంలో స్త్రీ సమానత్వాన్ని ఎంతగానో ఆకాంక్షించారు. అదేవిధంగా గురజాడ చక్ర బంధ కవిత్వ కబంధ హస్తాలలో చిక్కుకొని, గ్రాంథిక భాషా ఉక్కు చట్రంలో బందీగా ఉన్న తెలుగు కవిత్వాన్ని కొత్త భావ లోకంలో విహరింప చేశారు.

సంఘ సంస్కరణ:

గురజాడ సంఘ సంస్కరణ దృక్పథం ఆయనలోని తాత్విక దృక్పథానికి ప్రబలమైన నిదర్శనం. అందువల్లనే గురజాడ తన రచనలలో 'మతాలన్నీ మాసిపోయి, జ్ఞాన మొక్కటి నిలిచి వెలిగే" కాలాన్ని భావించినాడు. ఎదుటి మనిషిలోని మంచితనమే దైవము అన్నాడు. 'మానవీయ ప్రేమ' అనే సిద్ధాంతాన్ని ప్రస్తావించారు. విశ్వ మానవ కుటుంబాన్ని ఊహించాడు. స్త్రీ పురుష సంబంధాలలో మార్పు వచ్చి, స్త్రీలు చైతన్యంతో తిరగబడాలని పేర్కొన్నారు.'లవణరాజు కల' ఆధారంగా కుల వ్యవస్థను, అస్పృశ్యతను నిరసించారు, 'మంచి చెడ్డలు మనుజులందున యెంచి చూడగ రెండె కులములు మంచి యన్నది మాలయైతే మాలనేయగుదు' అని పలికిన మహాకవి హృదయాన్ని కొందరు అపార్థం చేసుకోవటం ఎంతో శోచనీయం. వాస్తవానికి గురజాడ వస్తువులో మాత్రమే కాక సాహిత్య రూపంలో కూడా సంస్కరణని సాధించారు. అందుకే మార్గ ఛందస్సుని వదిలి, వృషభగతి రగడ అనే జానపద ఛందస్సు ఆధారంగా ముత్యాలసరంలో కవిత్వం రాశారు. భాషలో కూడా ప్రజల వాడుకలో లేని మాటలను విడిచి, వ్యవహారిక భాషనే ప్రయోగించారు. గురజాడ తన ఆలోచనా విధానంలో కూడా భారతీయ, పాశ్చాత్య రీతులను సమానంగా గ్రహించినాడు. ఈ విధంగా గురజాడ తన సాహిత్యం ద్వారా సంఘ సంస్కరణను ఆశించారు.

భాషా సాహిత్యాలు:

తెలుగులో వ్యావహారిక భాషా శైలికి గురజాడ రాసిన 'కన్యాశుల్కం' నాటకం బీజం వేసింది. గురజాడ తన 'అధునిక ఆంధ్ర వచన రచన' అనే వ్యాసంలో పురాణాలు మతానికి సంబంధించినవి కావడంతో, అనేకమంది విద్యార్థులు మత సంప్రదాయాలకు లోబడి పోతున్నారని పేర్కొన్నారు. అలాగే 'ప్రజలందరినీ విద్యావంతులను చేయడమనేది మాతృభాష అభివృద్ధి మీదనూ, ఉత్పన్నమవుతున్న సారస్వతం మీదనూ ఆధారపడి ఉంటుంది.' (వ్యాసచంద్రిక. పే.105) అని కూడా గురజాడ ప్రస్తావించారు. మాతృభాషల అభివృద్ధి. శాస్త్రీయ పద్ధతులు మీద జరగవలసిందే. భాషాబోధకులకు వట్టి కావ్య భాషా పాండిత్యం మాత్రమే గాక, అధునిక యూరోపియన్ పద్ధతుల్లో పరిశోధనా దృష్టి, విమర్శనా జ్ఞానం కలిగేలాగా శిక్షణ ఇవ్వవలసి ఉంటుందని గురజాడ ఆనాడే పేర్కొన్నారు. అయితే ఇంగ్లీషు సాహిత్య బోధనా పద్ధతుల వల్లగానీ, ఇంగ్లీషు భాషా రచన వల్లగానీ, ఇంగ్లీషు సాహిత్య ప్రచారం వల్లగానీ, భారతీయులలో తగినన్ని స్వతంత్ర రచనలు రావటం లేదని, విద్యార్థులలో స్వతంత్ర ఆలోచనా శక్తి, ఆత్మ గౌరవం పెంపొందటం లేదని కూడా గురజాడ పేర్కొన్నారు.

-(డైరీలు, 1885, పే.11)

గురజాడ అప్పారావు భాషా సాహిత్యాల పరివర్తనను, తద్వారా సామాజిక పరివర్తనను ఆదర్శంగా గ్రహించి రాసిన మహాకావ్యం 'కన్యాశుల్కం' నాటకం. అందుకు నిజమైన కొలమానాలు దాని పీఠికలు. గురజాడ ఉద్దేశించిన బోధనా భాషా సంస్కరణ కూడా అందులో ఒక భాగమే. అందువల్లనే కన్యాశుల్కం రెండు కూర్పుల పీఠికలలో ఉన్న గురజాడ మాటలు అధునిక భాషా సాహిత్యాలకు పట్టుగొమ్మలుగా కనిపిస్తాయి. కన్యాశుల్కం పీఠికలోని,'సమాజాన్ని అప్రతిష్ఠపాలు చేసే పరిస్థితిని కళ్ళ ముందర పెట్టి, నైతిక భావాల ఉన్నత ప్రమాణాల్ని ప్రామర్శానికి తేవడం కంటె, సాహిత్యానికి ఉత్తమమైన కార్యమేదీ ఉండదు.'అనే గురజాడ మాటలు అందుకు నిదర్శనాలు.

వ్యావహారిక భాషావాదం:

గురజాడ 'నాది ప్రజల ఉద్యమం' (డైరీలు 1911, పే.2.) అని పేర్కొనటమే కాకుండా, తన సాహిత్య రచనలలో కూడా వ్యావహారిక శైలిని చేపట్టారు. వ్యావహారిక భాషలో ఉన్న సాహిత్యం ఆంగ్లేయుని గుండెను కదిపినా, లేకున్నా రైతును మేల్కొలుపుతుంది. దాని శక్తి అపారం, అవకాశాలు అనంతం అని గురజాడ రాశారు. గురజాడ తన అసమ్మతి పత్రంలో (Minute of Dessent) వ్యావహారిక భాషకు గల స్వభావాన్ని స్పష్టం చేశారు. గురజాడ తన కవిత్వంలో ప్రయత్న పూర్వకంగా చేసిన వాడుక భాషలోని ప్రయోగాల వల్ల 'అపండితుడు" "అకవి" అని కూడా అనిపించుకొన్నాడు. అయినప్పటికీ గురజాడ తన రచనల ద్వారా అధునిక సాహిత్యాన్ని ప్రజల వద్దకు చేర్చినాడు.

ఇంటర్మీడియేట్ పరీక్షలో విద్యార్థులు రాసే సమాధాన పత్రాలలో అనుమతించదగిన తెలుగు భాషాశైలి ప్రమాణాన్ని నిర్ణయించడానికి మద్రాసు విశ్వవిద్యాలయం 1911లో ఒక సంఘాన్ని నియమించింది. దానిలో గురజాడ అప్పారావు ఒక సభ్యుడు. మూడు నాలుగేళ్ల తీవ్ర వాదోపవాదాలు జరిగిన తర్వాత, 1914లో ఆ సంఘం చేసిన నిర్ణయం విద్యాభివృద్ధికి కీడు చేస్తుందని నిరూపిస్తూ, విశ్వ విద్యాలయానికి గురజాడ,(The Minute of Dessent to the Report theTelugu Composition Committee (అసమ్మతి పత్రం) అనే నివేదికను ఇచ్చారు. "తెలుగు సాహిత్యానికి సంకెళ్లు వేసి కదుపు మాడ్చడమా, లేక దానికి జవసత్వాలనిచ్చి, దాన్ని ఒక గొప్ప నాగరిక శక్తిగా చేయడమా అనేది మనపై ఆధారపడి వుంది." అనే ఈ వాక్యం ఆ "అసమ్మతి పత్రం" లోనిది. ఈ అసమ్మతి పత్రం ద్వారా గురజాడ కేవలం గ్రాంథిక భాషను నిరసించటం మాత్రమే చేయలేదు. ఆధునిక అవసరాలను తీర్చటంలో వ్యావహారిక భాషకు గల సామర్థ్యాన్ని కూడా సోదాహరణంగా నిరూపించారు.

అందులో భాగంగానే గ్రాంథిక భాష కోసం పట్టుపట్టి, మాండలిక పదాలలోని స్వల్ప భేదాలను గురించి ప్రశ్నించినప్పుడు, దానికి సమాధానంగా గురజాడ 'స్థానిక మాండలిక భేదాలు అట్టివేవు. వీటిని సాహిత్య గ్రంథాలలో ఉపయోగించిప్పటికీ కావ్యభాషా రూపాలకంటే వాటినే సులువుగా నేర్చుకోవచ్చును.' అని పేర్కొన్నారు. అయితే కొన్ని పదాలకు అనేక మాండలిక రూపాంతరాలు ఉన్నాయని, కొందరు వాడుక భాషా వాదాన్ని వ్యతిరేకించారు. అందువల్ల గురజాడ, 'కావ్యభాషలో 'స్త్రీ'కి 180 పర్యాయపదాలుండగా వాడుక భాషలో 7 పర్యాయ పదాలున్నాయి. 'అందం' అన్నదానికి కావ్య భాషలో 91, వాడుక భాషలో 11 పదాలున్నాయి. 'మన్మథుడు' అన్న పదానికి కావ్యభాషలో 88, వాడుక భాషలో ఒకే పదం వున్నాయి. ఇటువంటివే యింకొన్ని పదాలకు ఆయన ఉదాహరణలు ఇచ్చారు." (అసమ్మతిపత్రం పీఠిక. పే.xviii) అని తెలుస్తున్నది. ఈ సందర్భం గురజాడవారికి వ్యావహారిక భాష పట్ల అభిమానాన్ని, పరిశోధన పట్ల వారికి గల నిబద్ధతను తెలుపుతున్నాయి.

గురజాడ తన అసమ్మతి పత్రం ద్వారా ఆనాటి తెలుగు విద్యాబోధనను కొంతైనా సులభం చెయ్యడానికి ప్రయత్నించారని మనం గ్రహించాలి. అలాగే భాషా సాహిత్యాలు సామాన్యులకు చేరువకాని పరిస్థితి గురించి కూడా ఈ 'అసమ్మతి పత్రం' లో గురజాడ పేర్కొన్నారు. నిసంకుచిత సామాజిక, రాజకీయ, సాహిత్య ఆదర్శాలది పైచేయిగా ఉన్న సమాజ పరిస్థితులవల్ల కావ్యభాష ఉత్పన్నమైంది. విశాల ప్రజానీకం ప్రభువర్గం కోసమే బతికేది, శ్రమించేది. ఆనాడు శూద్రుడు చదువుకోవడమే ఒక నేరం' (అసమ్మతి పత్రం. పే.52) అదేవిధంగా 'అసమ్మతి పత్రం' లో గురజాడ శిష్టుల వ్యావహారిక భాషను ఇతరులు నేర్చుకుంటారని ప్రస్తావించాడు. ఇది ఈనాడు మనం ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి రవాణా, ఉద్యోగ, వ్యాపారాల కోసం చేసే రాకపోకల ఫలితంగా జరుగుతున్నది. అలాగే పత్రికలు, పుస్తకాలు, వార్తా ప్రచురణ మొదలైనవన్నీ తెలుగు వ్యవహారిక భాషా సృష్టికి దోహదం చేస్తున్నాయి. ఆధునిక తెలుగు సాహిత్యంలో చోటుచేసుకున్న ఈ సత్పరిణామానికి కారణం గురజాడ వారి ముందుచూపు. మొత్తంగా ఇది అనేక ఆటంకాలకు ఎదురు నిలిచి గొప్ప ఉద్యమం చేసి, గురజాడ సాధించిన మార్పుల వల్ల తెలుగు భాషా సాహిత్యాలకు కలిగిన దోహదం అని చెప్పవచ్చు.

ముగింపు:

'గురజాడ ఆధునిక తెలుగు సాహిత్య యుగకర్తని సినారే ప్రశంసించాడు. గురజాడ ఆధునిక సామాజిక దృక్పథంతో రచనలు చేసిన మహాకవి. "దక్షిణ భారతదేశంలో గల మేధావులలో, పండితులలో ప్రథమ శ్రేణికి చెందిన వ్యక్తి" అని మార్క్ హంటర్ అనే విద్యావేత్త గురజాడని ప్రశంసించాడు. గురజాడ కన్యాశుల్కం భారతీయ నాటకాల్లో గొప్ప కళాసృష్టి. గురజాడ ముత్యాల సరాలు ఆధునిక తెలుగు కవిత్వానికి గొప్ప ఉద్దీపన. గురజాడ రాసిన కథలు తెలుగు కథా జగత్తుకు వెలుగు దివ్వెలు. గురజాడ లేఖలు, డైరీలు, వ్యాసాలు, పీఠికలు ఆధునిక తెలుగు వచన రచనకు మార్గదర్శకాలు. గురజాడ 'అసమ్మతి పత్రం" తెలుగులో భాషాశాస్త్ర పరిశోధనకు చక్కని ఆకరం. గురజాడ వాడుక భాష ఆవశ్యకతను గుర్తించి, కన్యాశుల్కం తొలికూర్పులో వ్యావహారిక భాషకు సాహిత్య స్థానాన్ని కల్పించి, వ్యావహారిక భాషోద్యమానికి అంకురార్పణ చేసినాడు. ఈ నిదర్శనాలన్నీ కూడా ఆధునిక తెలుగు భాషా సాహిత్యాలకు దోహదకర్త అయిన గురజాడ అప్పారావు అపూర్వమైన మేధా సంపత్తునూ, కార్యదీక్షనూ, సంఘ సంస్కరణాభిలాషనూ వెల్లడిస్తాయి.

ఆధార గ్రంథాలు:

1. ఈశ్వరరావు, సెట్టి (సం.). 1984. గురజాడ రచనలు – కవితల సంపుటం. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, చంద్రం బిల్డింగ్స్, విజయవాడ.

2. ఈశ్వరరావు, సెట్టి (సం.). 1984. గురజాడ రచనలు – కథానికలు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన్ భవన్, హైదరాబాద్.

3. ఈశ్వరరావు, సెట్టి (సం.). 1987. గురజాడ రచనలు – అసమ్మతి పత్రం. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన్ భవన్, హైదరాబాద్.

4. ఈశ్వరరావు, సెట్టి (సం.). 2005. గురజాడ రచనలు – కన్యాశుల్కం. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన్ భవన్, హైదరాబాద్.

5. ప్రభాకరరావు, దేవులపల్లి. 1969. మహాకవి గురజాడ జీవిత విశేషాలు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన్ భవన్, హైదరాబాద్.

6. నారాయణరెడ్డి, సి. 2001. ఆధునికాంధ్ర కవిత్వం– సంప్రదాయాలు: ప్రయోగాలు. విశ్వంభర విజన్ పబ్లికేషన్స్, ఫిలింనగర్ కాలనీ, హైదరాబాదు.

7. శ్రీశ్రీ–కుటుంబరావు, చలసాని ప్రసాద్– వి. రామకృష్ణ కే.వి.ఆర్. 1980. ప్రజాస్వామిక సంస్కృతి – కందుకూరి గురజాడల దోహదం. సొసైటీ ఫర్ సోషల్ ఛేంజ్, కావలి.

రచయిత, తెలుగు అధ్యాపకుడు

శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాల (స్వ.),తి.తి.దే.,

తిరుపతి

డకర వెంకట రమణ
8886726408

గురజాడ అప్పారావు రచనలు - ప్రాముఖ్యత

ఆధునిక సాహిత్య వైతాళికుడు. సాహిత్య లక్ష్యలక్షణాలలో విప్లవాన్ని సాధించిన మహాకవి. నాటకం, కథ, వ్యాసం, విమర్శ ఇత్యాది సాహిత్య రూపాలన్నింటా సమర్థుడు. జీవితానికీ, సాహిత్యానికీ సాన్నిహిత్యాన్ని సమకూర్చిన మహాపురుడు. అన్ని దేశాలకు జాతీయ గేయంగా ఉండదగ్గ "దేశభక్తి" నుండి మొత్తం ఆంధ్రజీవిత సర్వస్వమనదగ్గ "కన్యాశుల్కం" నాటకం వరకు అనేక ప్రయోగాలు సాధించిన మనిషి. కాల్పనీయకతకు ప్రయోగాలు సాధించిన మనిషి. కాలని కథకు దూరంగా ఉండే వాస్తవికతను ప్రదర్శించిన శిల్పి. "నాది ప్రజల ఉద్యమం" ఎవరినో సంతోష పెట్టడానికి దానిని వదులుకోను స్రష్ట.

గురజాడ అప్పారావు సెప్టెంబరు 21,1862లో వెంకట రామదాసు, కౌసలమ్మ దంపతులకు విశాఖపట్నం జిల్లా రాయవరంలో జన్మించాడు. గురజాడ వంశ ప్రతిష్ఠకు అప్పారావు జీవితం ప్రతీకగా చెప్పవచ్చు. వీరికి ఆటపాటలంటే అమిత ప్రాణం కావడంతో వీధి భాగవతాలు వినోదాలు, తోలు బొమ్మలాట బాల్యం నుంచే అమితంగా ఆకర్షించాయి. విజయనగర సంస్థాన దివాను శ్రీ పెనుమెత్స జగన్నాథరాజు సహాయంతో 1872 జనవరి 5న విజయనగరం చేరాడు. గిడుగు, గురజాడలు రెండు వేర్వేరు గ్రామాలకు చెందిన వారైన ఒకే బడిలో చదువుకోవడం, ఇద్దరి మనస్తత్వాలు ఒకటే కావడం విశేషం. గురజాడ చిన్నతనం నుంచి హాస్య ప్రియులు కావడంతో "కన్యాశుల్కం" నాటకంలో హాస్యానికి ప్రాముఖ్యం కలిగించారు.

"1896లో అప్పారావుగారు ఆనంద గజపతిరాజు సంస్థానంలో శాసన పరిశోధకునిగా, డిబేటింగ్ క్లబ్‌కు ఉపాధ్యక్షునిగా ఎన్నికయ్యారు. అలా... అలా... మహారాజా వారికి అంతరంగికుడిగా మద్రాసు, బెంగుళూరు, బెజవాడ, శ్రీకాకుళం వంటి పట్టణాలు తిరిగి ఎంతో చరిత్ర సేకరించాడు." (తెలుగు వైతాళికులు, గురజాడ అప్పారావు, రచన శ్రీ బీరం సుందరరావు, సంపాదకులు డా॥ నాగభైరవ కోటేశ్వరరావు, పుట.12) 'కళింగ దేశ చరిత్ర'ను రాయాలనుకున్నారు కాని 23.05.1897న ఆనంద గజపతిరాజుగారు మరణించారు. అప్పారావుగారి 'కన్యాశుల్కం' నాటకాన్ని ఆనంద గజపతిరాజుగారికి అంకితమిచ్చి ఋణం తీర్చుకున్నాడు. రాజు అనంతరం సంస్థాన లావాదేవీల వ్యవహారాలు మోయవలసి రావటం, అంతే కాకుండా 1898లో రేవా మహారాణి అప్పల కొండయమ్మకి అంతరంగిక కార్యదర్శిగా నియమింపబడ్డారు.

అప్పారావుగారు 1882లో "కుకూ" రాశారు. "కుకూ" అంటే కోకిల అని అర్థం. అలాగే 1883లో ఆంగ్లంలో రాసిన పద్య కావ్యం "సారంగధర", "ది ఇండియన్ లీజర్ అవర్" అనే పత్రికలో అచ్చయింది. 1887లో విక్టోరియా మహారాణి స్వర్ణోత్సవ సందర్భంలో ఆమె గూర్చి ప్రశంసా పద్యాలు రాశారు. అలాగే 1907లో తొలి ముద్రణ పొందిన "నీలగిరి పాటలు" రాశారు. "ఋతు శతకం" కూడా రాయడం జరిగింది. 1911లో "కోరుకొండ" గేయం రాయడం జరిగింది. గురజాడ రాసినవి ఐదు కథలు. అవి 1) దిద్దుబాటు, 2) సంస్కర్త హృదయం, 3) మెటిల్డా!, 4) పెద్ద మసీదు, 5) మీపేరేమిటి. ఈ ఐదు కథలు సంస్కరణోద్యమాన్ని బలోపేతం చేసేందుకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ప్రతి కథలోను ఏదో ఒక సామాజిక సమస్యను వస్తువుగా చేపట్టి ఈ కథలను తీర్చిదిద్దారు.

తెలుగు సాహిత్యంలో నాటక ప్రక్రియకు విశిష్టమైన స్థానం ఉంది. సమాజాన్ని ఉన్నత మార్గంలో నడిపించడానికి ప్రజలలో అభ్యుదయ భావాలు రేకెత్తించడానికి సాంఘిక దురాచారాలు పోగొట్టడానికి మంచిని ప్రచారం చేయడానికి నాటకాలు ఎంతగానో దోహదపడతాయనంటే సందేహం లేదు. ఈ సందర్భంలో ఈ పరిశోధన పత్రం ద్వారా గురజాడ అప్పారావు "కన్యాశుల్కం" నాటకాన్ని విశ్లేషించే ప్రయత్నం చేస్తాను.

కన్యాశుల్కం : 'కన్యాశుల్కం' నాటకం మహాకవి గురజాడ మహత్తర సృష్టి. తెలుగు నాటక రంగంలో 'కన్యాశుల్కం' గొప్ప ప్రయోగం. వ్యవహారిక భాషకు పట్టం గట్టిన ప్రథమ దృశ్య కావ్యం, ప్రజా సాహిత్యంలో వెలసిన ప్రథమ నాటకం. సాహిత్యంలో సంఘంలో, సంస్కరణ అంటే గిట్టనివాళ్ళు తలబాదుకున్నా సరే! గురజాడ తాను నమ్మిన ప్రయోజనాన్ని ఆశయాన్ని వదులుకోకుండా ఈ నాటకం రాశారు. కన్యాశుల్కంలో భాషా విషయంలో గురజాడ వంద సంవత్సరాల ముందుచూపుతో అడుగు వేశారు. తెలుగు నాటకాల్లో పాత్రోచిత భాషను ప్రవేశపెట్టింది తొలిసారిగా గురజాడవారే!

అగ్నిహోత్రావధాన్లు బ్రాహ్మణ యాస, గిరీశం వచ్చీ రాని ఇంగ్లీషు లెక్చర్లు, రామప్పపంతులు దభాయింపులు, మధురవాణి కొంటెతనం, బుచ్చమ్మ అమాయకత్వం - ఒకటేమిటి అన్ని పాత్రలు అద్భుతంగా మాట్లాడుతాయి. నాటకం చూసినంత సేపూ, చదివినంత సేపూ చుట్టు ఉన్న సమాజం మన మెదళ్ళలో మెదులుతూనే ఉంటుంది. సమాజంలోని క్రౌర్యానికి, నీచానికి, మోసానికి, స్వార్థానికి ప్రతీకలు ఇందులోని పాత్రలు.

"సాయంకాలమైంది. పూటకూళ్ళమ్మకు సామాను కొనిపెడతానని నెల రోజుల కిందట యిరవై రూపాయలు పట్టుకెళ్ళి డాన్సింగ్ గర్లు కింద ఖర్చు పెట్టాను...." అంటా గిరీశం మాటలతో నాటకం మొదలవుతుంది. నాటకం చివరికి "కొంతకాలం కింద గిరీశం అనే ఫూలిష్ యంగ్‌మాన్ ఒకడు ఉండేవాడు. మధురవాణీ అనే ఆ బ్యూటీఫుల్ నాచి డెవిల్ ఒకతె ఉండేది. వాడి సత్యము, గురువుల ఉపదేశం కొంత కాలానికి జ్ఞప్తికి తెచ్చుకొని, ఆ అంధకారంలోంచి వెలువడి గురువుల పాదములు చేరుకుని గతం కలగా భావించి, మరచి, మంచి తోవలో పడ్డారు. ఆ గిరీశమే యీ గిరీశం - ఆ మధురవాణే

యీా మధురవాణీ! స్వర్గానికి ఒక్క చీడీ తరువాయిగా ఉన్న నన్ను నరకానికి లాగడానికి తిరిగి యిక్కడ నా పూరాకృతం వల్ల ఆవిర్భవించింది! ఐ ఎర్నడ్ ఆల్ టుగేదర్ న్యూలైఫ్ – పాపంలో కాలు జారి, పశ్చాత్తాపపడి రిఫార్మ్ అయినాను. నావంటి సిన్నర్స్‌కి సహాయం చేసి మంచివాళ్లని చెయ్యడం తమ బిరుదుగాని, బ్రతుకు చెరచడం న్యాయం కాదు. ఏ క్రేవ్ ఫర్ యువర్ మెర్సీ! డామిట్! కథ అడ్డంగా తిరిగింది" అంటూ గిరీశం మాటతో పూర్తవుతోంది. (గురజాడలు, ప్రధాన సంపాదకులు – పెన్నేపల్లి గోపాలకృష్ణ, పుట:420).

కొండు భట్టీయం : 1906లో రచించిన గురజాడ అప్పారావు "కొండు భట్టీయం" మరో అద్భుతమైన నాకటం. ఇది రైలు ప్రయాణంలో పోవడంతో 1910లో తిరిగి గుర్తుకు తెచ్చుకొని మూడు అంకాలు మాత్రమే రాయబడిన నాటకం. ఈ నాటకం సమాజంలోని దురాచారాల మీద సూటిగా దాడి చేసింది. సాంఘిక, మత సంస్కరణలను గురజాడ గట్టిగా కృషి చేసినట్లు దీనిని బట్టి తెలుస్తుంది.

ముంజవాణి, కొండుభట్టు, వెంకన్న, సాహెబ్ మొదలైన పాత్రలు గిరీశం పాత్ర కన్యాశుల్కం లోనే కాదు, కొండు భట్టీయంలోనూ ఉంది. కాకపోతే మిస్టర్ గిరీశం, బి.ఏ.గా మారి ఇంగ్లీషు లెక్చర్లుకు బదులు ఉపనిషత్తులు, వేదాలు ధారాళంగా వల్లె వేస్తుంటాడు ఇలా "నా మతం నాకే పోల్చడానికి దుస్తరంగా ఉందనుకుంటాను. మతం ఉపాధి వేసి కడతారనుకున్నారు కాబోలు మామగారు యెండవేళ నొకమతం – చల్లనివేళ ఒక మతం కడుపు కాల్తాఉన్నప్పుడు ఒక మతం – కడుపు నిండినప్పుడు ఒక మతం – అందులో అంబలి మతం – పప్పూ నెయ్యి మతం – గోధుమ రొట్టె మతం – మద్య మాంస మతం – యేరుకు తినే ఒక పళ్ళ మతం – డబ్బిచ్చి కొనే మామిడిపళ్ళ మతం – వంటరిగా ఉన్నప్పుడూ మతం – అతివ చంతనున్నప్పుడు ఒక మతం – లంగరు లేని నావలాగా మతం – మనస్సు యొక్క శరీరము యొక్క స్థితిని బట్టి చెలిస్తూ ఉంటుంది. కొన్ని వెర్రులు మాత్రం నాకు ఉన్నాయి అనుకుంటాను. మనసుకు మాటకు విడాకులైప్పుడు మాటునున్న మాట మార్కెట్‌లో పెట్టాలనే పట్టలేని ఉత్సాహం ఒకటి – సూదంటే రాయిని యినుమంటినట్లు మంచివాళ్లు కనిపిస్తే వాళ్లను అనుకొను స్వభావం రెండు – యెదిరించిన వాడి మీద కయ్యానికి కాలు దువ్వడం మూడు – కష్ట సాధ్యమైన పని తటస్థించి ఫలితం మంచిదని తోస్తే ముందూ వెనుకా చూడకుండా అందులో ఉరకడం నాలుగు – లైఫ్‌లో చమత్కారాలు వెతుక్కుంటూ పోవడం అయిదు – తమ వంటి పెద్దల శలవు ప్రకారం నడుచుకోవడం ఆరో మతం. అక్కడికి షణ్మతాలు స్థాపన అయినాయి. ఇన్ని మతాలు ఒక్కచోట గూడిన ఒక తెన్ను యెలా వెళతాయి. ఈ విధంగా సమాజంలోని కుళ్లుని, వింత పోకడల్ని, వ్యక్తుల ప్రవర్తనల్ని, చంచల మనస్తత్వాల్ని, తన నాటక సృష్టి ద్వారా చిత్రించారు అప్పారావుగారు. ఏది ఏమైనా "కొండు భట్టీయం" నాటకం పూర్తిగా దొరికి ఉంటే అప్పారావుగారి అసమాన ప్రతిభ లోకానికి తెలిసేది.

దిద్దుబాటు : వక్రమార్గంలో నడుస్తున్న భర్త ప్రవర్తనలో భార్య ఎలా మార్పు తీసుకురాగలిగిందో తెలియజేసే కథే "దిద్దుబాటు". ఇందులో గోపాలరావు, కమలిని మరియు రావుడు ముఖ్య పాత్రలు.

సంస్కర్త హృదయం : ఇది సమకాలీన ఉద్యమాన్ని నిశితంగా విమర్శించిన కథ. సమకాలీన ఉద్యమంలో భారతీయ జీవితం ప్రతిబింబిస్తునట్లు చెప్పాడంటే సామాజిక జీవితాన్ని సమాజ పరిణామ క్రమంలో ఆలోచించాడని అర్థమవుతుంది. ఈ కథ ఆంగ్లంలో రాసినా, ఆంగ్లేయులకు ఈ కథ వల్ల ఎటువంటి ప్రయోజనం లేదు. మన ఉద్యమాల్లో ఉండే లోసుగులు వెలుగులోకి రావడం తప్ప. గురజాడలో ఉన్న నిజాయితీని తెలియజేసే కథ ఇది. దానితోపాటు రచనలో వస్తువు పట్ల గురజాడకు ఉన్న సమకాలీన దృష్టి ప్రతిస్పందనలు అర్థం చేసుకోవాలి.

సమాజాన్ని పీడించే సాంఘిక సమస్యల విషయంలో గురజాడకు ఆవేశం కంటే ఆలోచనే ఎక్కువ. తన సమకాలికులలో కొందరి ఆవేశాల్ని చూసే గురజాడ ఈ కథ రాశారేమో అనిపిస్తుంది. మనిషికి ఆదర్శాలు ఉండవలసిందేగాని, అవి ఆచరణకు సాధ్యమై శారీరక మానసిక పరిధికి లోబడే ఉండాలన్నది గురజాడ ఉద్దేశ్యం. లోకం విచక్షణతో చూడకుండా అసహ్యించుకునే దానిలో కూడా అంతర్గతంగా దాగి ఉన్న కాస్త మంచిని గ్రహించ గలగడం ఆయనలోని మానవతా దృష్టికి నిదర్శనం. నీతులు చెప్పడం కాదు, ఆచరించడం అనేది ముఖ్యం అనే సందేశం.

మెటిల్డా : ప్రేమను పంచినా, ద్వేషాన్ని పెంచుకున్నా మగవాడి వంతే, వీటిలో మొదటిది కలలోనే కాదు అసలు ఆలోచనలకు అందనంత దూరంలో ఉంది మెటిల్డాకు. ఈ వాస్తవాన్ని తెలిపే కథ మెటిల్డా. భిన్న వయస్సు గల భార్యాభర్తల జీవితగాథే ఈ కథ. శిథిలావస్థలో ఉన్న వివాహ వ్యవస్థకు మూలమైన స్త్రీల దుస్థితిని చిత్రంచడంతోపాటు విభిన్న వయస్సులవారి మధ్య వివాహం సఫలంకాదని తెలియజేయడం ఈ కథ ఉద్దేశ్యం. మెటిల్డా కథలో ముసలి పులిగి పిలువబడే మెటల్డా భర్తను కాలేజీ కుర్రవాడు మార్చగలిగాడు. దీనితో మెటిల్డాకు కొంత ఊరట లభించినట్లైంది. అంతకు ముందు గృహ నిర్బంధంలో ఉండి చీటికిమాటికి చివాట్లతో గడిచేది ఆమె జీవితం. ఇటువంటి దుస్థితి ఆకాలం నాటి స్త్రీలకే కాదు నేటి స్త్రీలకు కూడా అడపాదడపా ఎదురవుతూనే ఉంది. ఆ దుస్థితి పోవాలంటే పురుషుల ఆలోచనా ధోరణుల్లో మార్పు రావాలి. కథలో కాలేజీ కుర్రవాడి పాత్ర ఎంతో ప్రభావవంతమైంది.

పెద్ద మసీదు (మతము – విమతము) : గురజాడ రాసిన కథల్లో చాలా చిన్న కథ "పెద్ద మసీదు" (మతము–విమతము). గరజాడ కాలానికి సంబంధించిన ఇతివృత్తం ఇందులో కనబడదు. క్రీ.శ.16వ శతాబ్దం నాటి చారిత్రక వాస్తవంతో కూడుకున్న కథే ఇది. ఈ వాస్తవానికి అక్షర రూపాన్ని కల్పించి పాఠకులకు తెలియజేసే క్రమంలో గురజాడ సఫలీకృతుడయ్యాడనే చెప్పాలి.

ఈ కథలో నారాయణభట్టు, పుల్లంబొట్లు, సాహెబు ముఖ్య పాత్రలు. మనుషుల్ని విడగొట్టే సంస్కృతి కలవారిని, అసమానతల్ని, అస్పృశ్యతని పెంచి పోషించే మనస్తత్వం కలవారిని ఖండించడం ఈ కథ ఉద్దేశ్యం. ఈ కథ భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేదిగా ఉంది. భారతదేశం భిన్న జాతులు, విభిన్న మతాలతో కూడి భిన్నత్వంలో ఏకత్వంగా ఉంది అనడానికి ఈ కథ నిదర్శనం. ఇటీవల కాలంలో మత వైషమ్యాలు, కుల వివక్షలు పెచ్చరిల్లుతున్నాయి. వాటిని రూపు

మాపేందుకు ఆ కాలంలోనే వీటిని ఊహించి గురజాడ "పెద్ద మసీదు" కథ రాయడాన్ని బట్టి గురజాడలోని ఆలోచనా శక్తి, సమస్యల పట్ల అతడికి గల అవగాహన ఎంత పటిష్టమైందో అర్థం చేసుకోవాలి.

మీపేరేమిటి : దేవుడు చేసిన మనుషుల్లారా / మనుషులు చేసిన దేవుల్లారా! మీ పేరేమిటి? ఈ కథ మతం పట్ల ఎంత మూర్ఖంగా ఉన్నాదో తెలుపుతుంది. మూఢ నమ్మకాలతో, స్వార్థ ప్రయోజనాలను సాధించుకునేందుకు ఎలా ప్రయత్నించారో ఈ కథలో చూడొచ్చు. ఈ కథలో ముఖ్య పాత్రలు శరభయ్య, మనవాళ్ళయ్య, సారధినాయుడు, రామినాయుడు, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, నాంచారమ్మ. ఈ మతం గట్టిది, ఆ మతం ఒట్టిది అంటూ విభజన చేసి దుష్ప్రచారం చేసే మత మూఢులు ఈ సమాజంలో తక్కువేమీ లేరు. ఇందుకు ఉదాహరణగా మీపేరేమిటి కథలో శరబయ్యను, మనవాళ్ళయ్యను చెప్పుకోవచ్చు.

ఈ కథలో స్వార్థపరులు మతం పేరిట సంఘాన్ని చీల్చాలని ప్రయత్నం చేస్తూ దాని కోసం కఠోరమైన విధానాన్ని అవలంబిస్తూ తమ స్వప్రయోజనాల కోసం మతాన్ని ఎలా వాడుకుంటున్నారో తెల్పటంతోపాటు మత మౌఢ్యాన్ని వ్యతిరేకించడమే దీని ఉద్దేశ్యం.

వీరు తమ స్వప్రయోజనాలను సాధించుకునేందుకు మత మార్పిడ్లు చేపట్టడానికి కూడా వెనుకాడలేదు. కథలో నాంచారమ్మ మనవాళ్ళయ్యను, రామినాయుణ్ణి "ఏం కావాలి" అని ప్రశ్నించినప్పుడు ఏమి వద్దంటారు. వాళ్ళను పరీక్షించేందుకు నాంచారమ్మ మనవాళ్లయ్యను రామినాయుణ్ణి గుండం తొక్కమంటే సాకు చెప్పి తప్పించుకుంటారు. దీన్ని బట్టి వారిలో దోషాలున్నాయని స్పష్టమవుతుంది. ఆ దోషాల్నే వారి వారి మతాలకు పులిమే ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి పోకడ అనాదే కాదు, ఈనాడు కూడా ఉందని తెలుస్తుంది. ఇలా అప్పారావుగారు సమాజాన్ని చైతన్య పరిచేందుకు దురాచారాల్ని రూపు మాపేందుకు నాటకం, కథ, ప్రక్రియల ద్వారా పూనుకొని ఆ దిశలో సఫలీకృతుడయ్యారని చెప్పడంలో సందేహం లేదు.

ఆధార గ్రంథాలు :

1. కన్యాశుల్కం - గురజాడ అప్పారావు.
2. గురజాడ వ్యాసం - నాగరాజు అసిలేటి.

రచయిత, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

అమ్మ నుడిలో విద్యాబోధనతోనే ఆర్థిక ప్రగతి.
ప్రజల భాషలో పాలన తోనే ప్రజాస్వామ్య సుస్థిరత.
సొంత భాషను అణగద్రొక్కి సంస్కృతిని కాపాడుకోలేము.

కవిత

చందు నాగేశ్వరరావు
9290449517

అమ్మంటే... అమ్మనుడి!

పల్లవి: తెలుగు వీరుడ తెగువ జూపర
తెలివిడిగా మసలుకొని
తెలుగును నిలబెట్టర "తెలుగు"

అనుపల్లవి:బిడ్డలులేని తల్లిని -
గొడ్రాలెయనుట కద్దుర
భాషపోవ జాతిని
యేమని పిలవాలిర "తెలుగు"

చ. 1: మంచినీటి సరస్సుర -
మన అమ్మభాష సొగసుర
త్రాగు నీరునిచ్చి సాగుకొచ్చి -
పంటనిచ్చు నదియెర
కాపాడుకొనకబోయితిమ -
జాతియె కనుమరుగుర "తెలుగు"

చ. 2: భావమ్మును వొద్దికగా -
పడిసిపట్టు భాష మనది
మందిబలము బుద్ధిబలము -
రాజ్యాధికారమేగలది
ఎండుటాకులామారి -
ఎండమావి పరుగులేమి "తెలుగు"

చ. 3: అమ్మభాష విత్తుర -
భలే మోసులెత్తు ఊసుర
తెలుగుభాష మాధ్యమంగ -
బాలలెదగ సులువుర
అప్పుడు---
ఆంగ్లమైన నవలీలగ -
నేర్చుకొనగ చెల్లునుర "తెలుగు"

చ. 4: భాషచేయు మేలుఘనం -
జాతికి అది మూలధనం
మృతభాషగ మారిపోవ -
తెలివిలేని తెలుగుతనం
ఒక్కరమా ఇద్దరమా -
కోట్లమంది జనం మనం
ఒక్కటయ్యి కొట్లాడితె -
భాషలన్ని సమంసమం "తెలుగు"...

పరభాషావ్యామోహం ఉంటే తనను తాను చిన్నబుచ్చుకొన్నట్లే!

దండె రాజశేఖర్,
8096863598

తెలంగాణ దళిత కవయిత్రుల కవిత్వం - వస్తు వివేచన

వ్యాస లక్ష్యం: తెలంగాణ ప్రాంతం అనగానే వెట్టిచాకిరి విధానం గుర్తుకు వస్తుంది. అందులో ముఖ్యంగా దళిత స్త్రీల పరిస్థితి ఇంకా దయనీయం. ఎందరో దళిత స్త్రీ, పురుషులు వారి జీవితాలను దొరల పెత్తందారులకు ధారపోశారు. తమ హక్కులకోసం ఆ ప్రాంత అధికారులను ప్రశ్నిస్తూ ఎన్నో శిక్షలను అనుభవించారు. ఈ విధానం అప్పటి నుండి ఇప్పటి వరకు ఇంకా కొనసాగుతూ ఉంది. ఇలా దళితులు అనుభవిస్తున్న జీవితాలను దళిత కవయిత్రులు దళిత స్త్రీల, పురుషుల గోసను ఆత్మగౌరవాన్నీ కవిత్వీకరించిన విధానాన్ని, అలాగే తెలంగాణ ప్రాంత దళిత కవయిత్రులు వారి అనుభవాలను తెలియజేయడం ఈ వ్యాసంలోని ప్రధాన ఉద్దేశ్యం.

కీలక పదాలు: ఆత్మగౌరవం, నిప్పుకనికలు, ఆరిపాయె, గోన్క పాయె, గద్దముక్కలు, గులాపుది, కారకాసు, సురకత్తులు, కాట్లె, కొరకాసు, బస్మమైంది. గూటం దెబ్బ, రంపెకోత, ఎండిన కుండ, మొదలైనవి.

పరిచయం: ప్రాచీన కాలం నుండి సమాజంలో స్త్రీ గౌరవం, విలువ కలిగి ఉంది. కాలక్రమంలో మార్పు చెందుతూ స్త్రీలకు తగినంత ప్రాచుర్యం లభించకుండా ఒక పరిమితిని ఏర్పరచుకుని కొంత పరిధిలో బ్రతుకవలసిన స్థితి ఏర్పడింది. స్త్రీని ఆరాధ్య దైవంగా భావిస్తూ మాతృదేవతలుగా గుర్తించబడ్డారు. తర్వాత మానవ సంస్కృతి అభివృద్ధి చెందడం వల్ల స్త్రీ పురుషుల మధ్య అంతర్యం ఏర్పడి కేవలం స్త్రీ వంటింటికి మాత్రమే పరిమితం కావలసిన విధానం కొనసాగింది. ఆ తర్వాత స్త్రీని గౌరవిస్తూ అన్ని రంగాలలో ముందుంచుతూ రాజ్యాన్ని పరిపాలించే స్థాయి వరకు ఎదిగారు. నేడు స్త్రీ సాహిత్యాన్ని సృజించే స్థాయికి చేరారు. ముఖ్యంగా దళిత స్త్రీలు దళితుల జీవితాలను, అమ్మను, అమరులైన వారిని స్మరిస్తూ స్మృతి కవిత్వం, మానవీయ విలువలు ఎలా ఉన్నాయో తెలుపుతూ వాటిని కవితా వస్తువులుగా ఎంచుకొని వారి అనుభవాలను జీవితాలను ఎలా తెలియజేశారో తెలపడమే ఈ పరిశోధన వ్యాసం ముఖ్య ఉద్దేశ్యం.

వస్తువు నిర్వచనాలు: వస్తువును ఆంగ్లంలో Content, Theme, Concept అని అంటాం. రచనకు వస్తువు ఎంత ప్రధానమో. శిల్పం కూడా అంతే ప్రధానం. కవి ఎంచుకున్న వస్తువు ఎంత గొప్పదైనా దానిని సరైన మార్గంలో చెప్పకపోతే అది పాఠకులలో గుర్తింపుగా నిలిచిపోదు శిల్పం అనగా రచనను నడిపించిన తీరు. ఒక రచనకు వస్తువు, శిల్పం ఎంత ప్రధానమో సాహితీవేత్తలు కింది విధంగా తెలియ పరిచారు.

వస్తువు అనగా మనం ఎంచుకునే అంశంగా చెప్పవచ్చు. ప్రతి రచనకు వస్తువు ప్రధానం. వస్తువు లేకపోతే రచన ఉండదు కొనసాగదు. కాబట్టి ప్రతి రచనకూ వస్తువు ప్రధానంగా కొనసాగుతుంది. వస్తువు లేకపోతే రచన లేదు. ఉత్తమ వస్తువు ఎంచుకోకపోతే రచన రసవత్తరంగా ఉండదు. కాబట్టి తెలుగు పరిశోధక కవులు, రచయితలు వస్తువుకు ఎలాంటి నిర్వచనాలు ఇచ్చారో గమనిద్దాం.

'ఒకానొక దృగ్విషయంలో ప్రత్యేకంగా, నియమబద్ధంగా ఉన్న మూలకాల, క్రమ విధానాల మొత్తమే వస్తువు. మనిషీ మానవ సంబంధాలూ, సామాజిక జీవితం, దానిలోని వస్తువు అవుతుంది. (పింగిళి లక్ష్మీకాంతం, సాహిత్య శిల్ప సమీక్ష పుట 39) అని వివరించారు పింగిళి లక్ష్మీకాంతం.

'రచనకు రచయిత తీసుకున్న జీవితం, ఆ జీవితాన్ని రచయిత అర్థం చేసుకున్న తీరు జీవితాన్ని అర్థం చేసుకోవడానికి సహకరించిన భావజాలం మూడూ కలిపి సాహిత్య వస్తువవుతుంది.' (సింగమనేని నారాయణ, తెలుగు కథన రీతులు (3) సంకలనం, పుట: 176) అని అంటారు రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి.

'రచయిత సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని వస్తువుగా చెప్పవచ్చును అని అంటారు' (సాహిత్యంలో వస్తు శిల్పాలు, పుట:13) త్రిపురనేని మధుసుదనరావు. ప్రపంచంలో ప్రతిదానికీ ఏదో ఒక రూపం ఉంది. పదార్థాల్లో సారాంశం వస్తువే అయినా అది రూపంతోనే అస్తిత్వంలో ఉంటుంది. రూపాన్ని ఆశ్రయించుకునే వస్తువు వ్యక్తం అవుతుంది. సమాజ జీవితంలో వచ్చే ప్రతి చిన్న మార్పూ వస్తువులో మార్పును తెస్తుంది కాని రూపంలో కొన్ని అతి ముఖ్యమైన చారిత్రక సందర్భాల్లోనే మార్పు కనిపిస్తుంది.

'జీవితంలో ఒక సంఘటన గానీ, ఒక పార్శ్వం గానీ, ఒక స్పందనను గానీ, వస్తువుగా అర్థం చేసుకోవచ్చునని మనకు అర్థం అవుతోంది. అలాగే సాహిత్యం మానవీయమైన ఒక చైతన్య రూపం. ఉత్పత్తి సాధనాల మీద, వాటిని ఉపయోగించే సామూహిక శ్రమ మీద అనుభూతితో కూడిన సంబంధం పెట్టుకున్నప్పుడు సాహిత్య రూపాలు ఏర్పడ్డాయి. ఆత్మరక్షణ, ఆహార సంపాదన నుంచీ ఆరంభమైన సాంఘిక జీవన క్రమం సాహిత్యంలో వస్తువైంది' (పాపినేని శివశంకర్, సాహిత్యం మౌలిక భావనలు, పుట: 79) అంటారు పాపినేని శివశంకర్.

తెలంగాణ దళిత కవయిత్రుల కవిత్వం వస్తు విశ్లేషణ: తెలంగాణ సాహిత్యంలో దళిత కవయిత్రులు చాలా తక్కువ మంది ఉన్నారు. అయినా, వారు రాసిన సాహిత్యం చాలా దళితుల జీవితాల స్వీయ అనుభవాలను సాహిత్యీకరించినదే. ముఖ్యంగా తెలంగాణ దళిత కవిత్వం గురించి మాట్లాడుకుంటే అందులో ప్రధానంగా కనిపించేవారిలో జూపాక సుభద్ర, గోగు శ్యామల, జాజుల గౌరి, మెర్సీ మార్గరేట్, ఎండ్లూరి మానస, హైమావతి వంటివారు మనకు తెలంగాణ దళిత వాద సాహిత్యంలో కన్పిస్తున్నారు. వీరు కవిత్వం, కథా, నవలా సాహిత్యాలను వెలువరించారు.

అక్షరం అక్షరం కలిపి అర్థవంతమైన పదం ఎలా ఏర్పడుతుందో దళిత కవులు, కవయిత్రులు కలిస్తే సంపూర్ణ అర్థవంతమైన దళిత

సాహిత్యం వెలువడిందని సాహిత్యంలో వారికి ఉన్న ప్రత్యేకతను చాటుతున్నారు. కొంతమందిని దళిత సాహిత్యంలో కృషి చేసి చనిపోయినవారిని స్మరించుకుంది కవయిత్రి జూపాక సుభద్ర.

'నిన్నగాక మొన్ననే సెండాల సాటింపేసిన మాదిగోడు
మా వూరి మైసమ్మ గద్దమీంచి పుటుక్కున దెగిపాయె
మద్దెల బగిలి నాదెల్లిపాయె, కులం పీటాల మీద
గూటందెబ్బేసి రంపెకోత బొబ్బబెట్టిన ఎర్కోషి నెగడు
సప్పున ఆరిపాయె, యేల్లు గోస్కపోయె గద్ద ముక్కుల్నుంచీ'
(జూపాక సుభద్ర, అయ్యయ్యో దమ్మక్క పుట: 16)

దళిత ఉద్యమానికి అండగా నిలిచిన దళిత కవులను స్మరించుకుంది. ప్రముఖ దళిత కవి మద్దూరి నగేష్ బాబు సామాజిక స్పృహను మననం చేసుకుంటూ తన అస్తిత్వాన్ని తెలిపింది. అలాగే మాదిగ సాహిత్య వెలుగుకి మారుపేరు నాగప్పగారి సుందర్రాజు రచనలను గుర్తు చేసుకున్నది. ఇంకా గ్యార యాదయ్య, మద్దెల శాంతయ్యలను గుర్తు చేసుకుంటూ దళిత కవులు మమ్మల్ని వీడిపోయారని పై కవితలో కలత చెందుతుంది.

"మావ్వ దుక్కాల్ని దున్ని పోసుకున్న తొక్కుడు బండ" అనే కవితలో తన తల్లి గొప్పతనాన్ని, ఆమె కష్టపడే తత్వాన్ని ఆమె ఓపికను ఈ విధంగా వివరిస్తుంది.

"గుర్తింపు లేని గులాపుది మా అవ్వ
బువ్వ పుడకలేదని, మొత్తగిందని
రాయొచ్చిందని, యెంటికొచ్చిందని, ఎన్నాసార్లు బస్మమైందో
మా అందరికి మావ్వ వండిన కుండ వాల్సిన మంచమే'
(సుభద్ర, 2009 : 46)

అమ్మ ఎప్పుడు తీరికగా ఉండదు. తెల్లవారు జామున నుండి రాత్రి పడుకునే వరకు అమ్మపడే కష్టాన్ని చూసి అమ్మకి ఎన్ని పూజలు చేసినా ఎన్ని పూవ్వులతో అభిషేకించినా తక్కువే అని తన కష్టాన్ని తన మనస్తత్వాన్ని సుభద్ర ఈ విధంగా చెప్పడం జరిగింది.

అలాగే జాజుల గౌరి ఉతికి ఆరేస్తా కవిత్వం ద్వారా తన ఆత్మ గౌరవాన్ని ప్రకటిస్తుంది. సమాజంలో తన జీవిత వ్యథను తెలుపుతూ.....

"బలైన దళితురాలిని, కారు చీకటిలోని నల్లని తారునై,
వెండి వెలుతురులోని మండే మంటనై, వాగులో వరదనై, బురదనై,
ఎటు తోస్తే అటు గమ్యం తెలియక, వెనుతిరిగే వెట్టిదాస్నని, అక్షరాలకు దూరం చేసి, నన్ను వెక్కిరించారు ,మాదిగ బతుకు నుంచే తిరుగుబాటు ప్రకటిస్తున్నా, సమాజంలోని కుళ్ళును కడిగి ఇంటిని దురహంకారాన్ని ఉతికి ఆరేస్తా.(జాజుల గౌరి కవిత్వం, పుట: 06)

వేల సంవత్సరాల నుండి నేను సమాజానికి వెలివేయబడ్డ దళిత మహిళను అంటూ వేల సంవత్సరాల నుండి నా శ్రమను దారపోస్తూ సమాజ హితాన్ని కోరాను అయినా నాకు గుర్తింపు లేదు అంటుంది. ఈ సమాజంలో కుళ్ళును, కుట్రలనూ, కుతంత్రాలనూ కడిగి వేయడానికి సిద్ధంగా ఉన్నా అంటూ తన ఆత్మగౌరవాన్ని తెలుపుతుంది. సమాజం ఎప్పుడూ మార్పుకు గురవుతుంది. ఆ మార్పు మనుష్యులు మనుష్యులుగా దూరమవుతున్నంత వరకు మార్పు వచ్చింది. అప్యాయంగా కూర్చొని మాట్లాడుకునే వాతావరణమే కరువైయింది. మనుష్యులకు సెల్ఫోన్లు రావడం వల్ల వీరి మధ్య అంతరం ఏర్పడుతోందని తెలుపుతుంది కవయిత్రి మెర్సి మార్గరేట్.

"ఒకప్పుడు నోటినిండా మాటలుండేవి,
మాటలకు మొలకల వేళ్ళుండేవి, నచ్చగా మొలకెత్తేందుకు అవి సారవంతమైన నేలలు వెతికేవి!
మనక కన్నుల్ని వెలిగించే నిప్పురవ్వలుండేవి
చెమట చుక్కల్ని కౌగిలించుకొనే చేతులుండేవి'. (మాటల మడుగు,)

అంటూ మానవ విలువలను గురించి తెలియజేస్తుంది కవయిత్రి. సమాజంలో యాంత్రిక సాంకేతిక వ్యవస్థ అభివృద్ధి చెందడం వల్ల యాంత్రిక వ్యవస్థలో పడి మానవుడు బంధాలకు దూరమవుతూ అప్యాయంగా పలకరించే స్థితిని కోల్పోతూ ఒంటరితనానికి గురవుతున్నాడు. మానవ విలువలకూ, బంధాలకూ దూరమైపోతున్నారు అని ఆవేదన చెందుతుంది కవయిత్రి.

"కాల్లే కొరకాసు మొకమేసుకొని రోని కార్తె మీద నిలబడి
భూతల్లిని నిప్పులు నమిలిస్తుండు
నీడల నీళ్లని దాగి సెట్టు సొమ్మసిల్లినయి
సల్లగాలి గద్దల్ని ఏదేశం తరిమిండో ... ఏమో...
నీళ్ళు నిప్పు కనికలై పార్తున్నయి.
యింట్ల బైటది ముట్టుకున్నా సురకత్తులే
ఎండోనికి అగ్గిజ్వరం పట్టుకున్నట్లుంది.
మట్టి తేమల్ని మింగిన జెరిగొడ్డు తార్రోడ్లు
పైవోవర్ల వడగాలి పడగనీడను
కమ్ముల కమ్మిన యినుప ముక్కోలై వగడు నెగళ్లిగిరేస్తుంది.
మబ్బులు కొండల్ని కొలుములై సుట్టుకొని' (అయ్యయ్యో దమ్మక్కా)

జూపాక సుభద్ర ఎండను కూడా కవితా వస్తువుగా ఎంచుకుని గొప్ప భావచిత్రాన్ని కలిగించింది. సాధరణంగా ప్రతి ఒక్కరం ఎండను చూస్తున్నవాళ్లమే కాని ఎండ ఎట్లా ఉందంటే కాల్లే కొరకాసు మొఖమేసుకుని అని వర్ణించింది. కొరకాసు ఎర్రగా దగదగ మెరుస్తూ ఉంటుంది. అలాగే ఎండోనికి అగ్గిజ్వరం పట్టుకున్నట్లుంది అంటుంది. మనిషికి జ్వరం వస్తే ఒళ్లంతా వేడిగా ఉంటుంది. అలాగే ఎండాకాలం ఎండను చూసి ఎండకు కూడా జ్వరం పట్టుకున్నట్లుంది అంటుంది.

అరువు భాషను హావభావాలను, వేషధారణను
చంకలోని బతుకు బరువును సంచిలో వేసుకుని
నన్ను నేను అమ్ముకోవడానికి బయలుదేరుతా...(మాటల మడుగు)

నటనలు కేవలం బతకటం కోసం అని మన ఇష్టాలనెట్లా దూరం చేసుకోవాలో తెలిపే దైన్యం అయిష్టాలనెట్లా బలవంతంగా నెత్తికెత్తుకోవాలో తెలిపే దౌర్భాగ్యాన్ని తెలుపుతూ నాలుకకు ఇరవైఆరు అక్షరాల నరకాన్ని కట్టుకొని బయలుదేరాను అని అంటుంది మెర్సి మార్గరేట్. ఇలా అనడంలో అర్థమేమంటే పరాయిభాష ఎప్పుడూ మన సమస్త భావ వ్యక్తీకరణ అవసరాలను తీర్చలేదనే కాదు, పరాయి భాషను నేర్వడం అనేది నరకంతో సమానం అని తెలుపుతుంది.

రచయిత, పరిశోధక విద్యార్థి,
కాకతీయ విశ్వవిద్యాలయం

అప్పం పాండయ్య
9000332247

తెలంగాణ స్థానికబాష-మాండలిక వైవిధ్యం

4,8.9 అంతర్ జిల్లాల క్రియారూప వైవిధ్యం :ఉదా.

భూత	వర్తమాన	భవిష్య/తద్దర్మ
వొచ్చిన	వత్తుండ	ఒత్త
శెప్పిన	శెప్తుండ	శెప్తా
కట్న	కడ్తుండ	కడ్త
రాశ్న	రాత్తుండ	రాత్త
ఆయ్న	అయ్తుండ	ఆయ్త
ఏల్న	ఎల్తుండ	ఎల్త
సచ్చిన	సత్తుండ	సత్త
సద్విన	సదుతుండ	సదుత
పిల్సిన	పిలుత్తుండ	పిలుత్త

భూత	వర్తమాన	భవిష్య/తద్దర్మ
తెచ్చిన	తెత్తుండ	తెత్త
ఇచ్చిన	ఇప్తుండ	ఇప్త
పుట్న	పుడ్తుండ	పుడ్త
తీశ్న	తీత్తుండ	తీత్త
ఉండ	ఉండ	ఉంట
పొయ్న	పోతుండ	పోత
ఏడ్సిన	ఏడుత్తుండ	ఏడుత్త
కల్సిన	కలుత్తుండ	కలుత్త
నిల్సిన	నిలుత్తుండ	నిలుత/నిల్త

4.8.10 నిశ్చయార్థకాలు: క్రియా ధాతువు'ఆలి' అనే ప్రత్యయం చేరి నిశ్చయార్థక రూపాలు ఏర్పడుతున్నాయి. ఉదా. తినాలి, తాగాలి, సూదాలి, శేయాలి, సద్వాలి, రాయాలి మొదలైనవి. కొన్ని ప్రాంతాలలో 'వాలి' అనే ప్రత్యయంతో కూడా సదవ్వాలి, పోవ్వాలి, నడవ్వాలి, తెలవ్వాలి, కలవ్వాలి, పెట్టవాలి వంటి రూపాలు కూడా కనిపిస్తున్నాయి.

గత సంచిక తరువాయి భాగం ...

కొన్ని సందర్భాలలో 'ఆలె' అనే ప్రత్యయం చేరి తినాలె, తాగాలె, సూదాలె, శేయాలె, సద్వాలె, రాయాలె వంటి ప్రయోగాలు కూడా కనిపిస్తున్నాయి. వ్యతిరేకార్థంలో 'ఒద్దు' అనే వ్యతిరేక ప్రత్యయంతో తినొద్దు, రావొద్దు, చూడొద్దు వంటి రూపాలు ఏర్పడుతున్నాయి. కొందరి ప్రయోగాలలో తుమర్థక క్రియా రూపాలపై కూడదు అనే ప్రత్యయం చేరి వ్యతిరేక రూపాలు ఏర్పడుతున్నాయి. ఉదా. తినకూడదు/ తినకూడ్దు, తాగకూడదు/ తాగకూడ్దు, రాకూడదు/ రాకూడ్దు మొదలైనవి. కొన్ని సందర్భాలలో విధ్యర్థకంలోని ఆత్మార్థక క్రియా రూపాలపై కూడా 'కూడదు' అనే ప్రత్యయం చేరి వ్యతిరేక రూపాలు ఏర్పడుతున్నాయి. ఉదా. తీసోకూడదు, రాసోకూడదు, సదువుకోకూడదు మొదలైనవి. నిశ్చయార్థకాలలో ప్రశ్నార్థకాలు కావాల్నా?, పోవాల్నా?, ఉండాలా? వంటి నకార సహిత ప్రయోగాలతో కనిపిస్తున్నాయి.

4.8.11 సామర్థ్యార్థకాలు: తుమున్నర్థక క్రియా ప్రాతిపదికలపై 'గల' అనే ప్రత్యయం చేరి సామర్థ్యార్థక రూపాలు ఏర్పడుతున్నాయి. ఉదా. ఉత్తమ పురుష ఏకవచనంలో తినగలను, రాగలను, చూడగలను. అట్లే తక్కిన పురుషలలో కూడా ఏర్పడతాయి. ఈ రూపాలు భూతకాలంలో 'గలుగు', వర్తమానకాలంలో 'గలుగుతుండ', భవిష్యత్కాలంలో 'గలుగుత' అనే ప్రత్యయాల ద్వారా మూడు కాలాలలోను సామర్థ్యార్థకంలో కనిపిస్తాయి. ఉదా. భూతకాలార్థంలో: తినగలిగ, రాగలిగ. సూడగలిగ. వర్తమానకాలార్థంలో: తినగలుగుతున్న, రాగలుగుతున్న, సూడగలుగుతున్న. భవిష్యత్కాలార్థంలో: తినగల్గుత, రాగల్గుత, సూడగల్గుత. కొన్ని సందర్భాలలో తుమర్థక రూపాలపై 'జాలు' అనే ప్రత్యయం చేరి భవిష్యత్కాలార్థంలో ఏర్పడిన తినజాలడు, రాజాలడు, సూడజాలడు వంటి రూపాలు కూడా కనిపిస్తున్నాయి. వ్యతిరేకార్థంలో 'లే' పురుష ప్రత్యయంతో, 'లేకపోవు + కాల ప్రత్యయం 'పురుష ప్రత్యయం' అనే రూపాలతో వ్యతిరేక రూపాలు ఏర్పడుతున్నాయి. ఉదా. తినలేను, రాలేను, సూడలేను మొదలైనవి. భూతకాలార్థంలో: తినలేకపోయ, రాలేకపోయ, సూడలేకపోయ వర్తమానకాలార్థంలో తినలేకపోతుండ, రాలేకపోతుండ, సూడలేకపోతుండ – భవిష్యత్కాలికార్థంలో: తినలేకపోత, రాలేకపోత, సూడలేకపోత మొదలైనవి. అట్లే 'జాలు' ప్రత్యయంతో భవిష్యత్కాలిక వ్యతిరేకార్థంలో తినజాల్తను, రాజాలను, సూడజాల్తను వంటి రూపాలు కనిపిస్తున్నాయి.

4.8.12 విధ్యర్థకాలు-ప్రార్థనార్థకాలు: మధ్యమ పురుషతో సంబోధన వ్యవహారంలో క్రియా ధాతువు 'ఉ' అనే విధ్యర్థక ప్రత్యయం చేరి తిను, తాగు, ఆడు, పాడు వంటి రూపాలు ఏర్పడుతున్నాయి. రాస్, తీస్, వేస్, కోస్, లేస్ వంటి క్రియా ధాతువులపై ఇ అనే విధ్యర్థక ప్రత్యయం చేరడంవల్ల సకారం యకారంగా మారి రాయి/రాయ్, తీయి/తీయ్/తీ, వేయి/వేయ్, కోయి/ కోయ్/కొయ్, లేయి/ లేయ్/ లెయ్ వంటి రూపాలు ఏర్పడుతున్నాయి. చూస్ అనే క్రియా ధాతువు ప్రాచీన రూపం అయిన

'చూచ్' పై ఉ ప్రత్యయం చేరి చుచుగా ఏర్పడిన క్రియా ప్రాతిపదిక ఆ తరవాతి కాలంలో 'చూడు'గా కనిపిస్తుంది. 'చు' కారాంత పిలుచు, కలుచు, నిలుచు, ఊద్చు, ఏడ్చు, కూర్చో, నిల్చో, ఇచ్చు, వచ్చు వంటి ప్రాచీన ప్రాతిపదిక రూపాలు విధ్యర్థకంలో 'చు' కారాంత రూపాలతోపాటు పిల్చు, కల్చు, నిల్చు, ఊద్చు, ఏడ్చు, కూసో, నిల్సో వంటి రూపాలుగా, పిల్వు, కల్వు, నిల్వు, ఊద్వు, ఏడ్వు, కూర్సో, నిలో, ఇయ్యి, రా వంటి రూపాలుగాను, ఈ రూపాలే పిలు, కలు, నిలు, ఊదు, ఏడు, కూకో, నిల్సో, ఈ, దా వంటి రూపాలుగాను కనిపిస్తున్నాయి. అట్లే జరుగు, పెరుగు, మురువు, పరువు వంటి రూపాలు జరు, పెరు, మురు, పరు వంటి రూపాలుగా కనిపిస్తున్నాయి. ప్రార్థనాద్యర్థకాలలో, బహువచన రూపాలలో అండి ఉన్ని ఉర్రి అనే గౌరవ ప్రత్యయాలు చేరి తినండి, తినున్ని, తినుర్రి రాయండి, రాయున్ని, రాయుర్రి సూడండి, సూడున్ని, సూడుర్రి పిల్వండి, పిల్వున్ని, పిలున్ని, పిలుర్రి జర్గండి, జర్గున్ని, జరున్ని, జరుర్రి వంటి రూపాలు కూడా కనిపిస్తున్నాయి. వ్యతిరేకార్థంలో 'అకు' అనే ప్రత్యయంతో తినకు, తాగకు, ఆడకు, పాడకు, రాయకు, తీయకు, వేయకు, కోయకు, లేవకు, చూడకు, పిలవకు, కలవకు, నిలవకు, ఊద్వకు, ఏడ్వకు, కూకోకు, నిల్సోకు, ఇయ్యకు, రాకు, జర్గకు, పెర్గకు, ముర్వకు, పర్వకు వంటి రూపాలు కనిపిస్తున్నాయి. ప్రార్థనాద్యర్థకాలలో, బహువచన రూపాలలో 'అకండి',"అకున్ని, 'అకుర్రి' అనే ప్రత్యయాలతో తినకండి, తినకున్ని, తినకుర్రి, రాయకండి, రాయకున్ని, రాయకుర్రి, సూడకండి, సూడకున్ని, సూడకుర్రి, పిల్వకండి, పిల్వకున్ని, పిల్వకుర్రి, జర్గకండి, జర్గకున్ని, జర్గకుర్రి మొదలైన రూపాలు కనిపిస్తున్నాయి.

4.8.13 సంభవనీయార్థకాలు: తుమర్థక క్రియా ప్రాతిపతికపై 'వచ్చు, 'వొచ్చు' అనే ప్రత్యయాలు చేరి సంభవనీయ అర్థకాలు ఏర్పడుతున్నాయి. ఉదా. తినొచ్చు, తాగొచ్చు, రావొచ్చు, రాయొచ్చు, సద్వొచ్చు, తెల్వొచ్చు మొదలైనవి. కొందరి ప్రయోగాలలో 'అచ్చు' (వకార లోపం) అనే ప్రత్యయంతో తినచ్చు, తాగచ్చు, రాచ్చు, రాయచ్చు సద్వచ్చు వంటివి కనిపిస్తున్నాయి. వ్యతిరేకార్థంలో 'అకపోవచ్చు' అనే ప్రత్యయం చేరి తినకపోవొచ్చు, తాగకపోవొచ్చు, సద్వకపోవొచ్చు, తెల్వకపోవచ్చు వంటి రూపాలు కనిపిస్తున్నాయి. కొన్ని సందర్భాలలో 'కావొచ్చు' అనే అనుబంధ ప్రత్యయం చేరి తిన్నడుగావొచ్చు, తాగిండుగావొచ్చు, తింటుండుగావొచ్చు, తాగుతుండుగావొచ్చు, తింటడుగావొచ్చు, తాగుతడుగావొచ్చు వంటి రూపాలు కూడా కనిపిస్తున్నాయి.

4.8.14 అనుమత్యర్థకాలు: తుమర్థక క్రియా ప్రాతిపదికలపై , అనే ప్రత్యయం చేరి తిననీ, తాగనీ, ఆడనీ, సూడనీ, సద్వనీ, రాయనీ వంటివి ఏకవచనంలో అనుమత్యర్థక రూపాలుగా కనిపిస్తాయి. గౌరవవాచకంలోను, బహువచనంలోను 'అండి', 'ఉ', 'ఉర్రి' అనే ప్రత్యయాలు చేరి తిననీయండి, తాగనీయండి, ఆడనీయండి, సూడనీయండి, సద్వనీయండి, రాయనీయండి తిననీయున్ని, తాగనీయున్ని, ఆడనీయున్ని, సూడనీయున్ని, సద్వనీయున్ని, రాయనీయున్ని అట్లే తిననీయుర్రి, తాగనీయుర్రి, ఆడనీయుర్రి, సూడనియుర్రి, సద్వనీయుర్రి, రాయనీయుర్రి వంటి అనుమత్యర్థక రూపాలు కనిపిస్తున్నాయి. వ్యతిరేకార్థంలో 'అకు' అనే ప్రత్యయం చేరి ఏకవచనంలో తిననీయకు, తాగనీయకు, ఆడనీయకు, సూడనీయకు, సద్వనీయకు, రాయనీయకు వంటి రూపాలు ఏర్పడుతున్నాయి. ఈ రూపాలే తిననీకు, తాగనీకు, ఆడనీకు, సూడనీకు, సద్వనీకు, రాయనీకు వంటి రూపాలుగా కూడా కనిపిస్తాయి.

గౌరవవాచకంలోను, బహువచనంలోను 'అకండి', 'అకున్ని', 'అకుర్రి' అనే ప్రత్యయాలు చేరి తిననీయకండి, తాగనీయకండి, ఆడనీయకండి, సూడనీయకండి, సద్వనీయకండి, రాయనీయకండి వంటి రూపాలు తిననీయకున్ని, తాగనీయకున్ని, ఆడనీయకున్ని, సూడనీయకున్ని, సద్వనీయకున్ని, రాయనీయకున్ని అట్లే తిననీయకుర్రి, తాగనీయకుర్రి, ఆడనీయకుర్రి, సూడనీయకుర్రి, సద్వనీయకుర్రి, రాయనీయకుర్రి వంటి రూపాలు కనిపిస్తున్నాయి.

4.8.15 భావార్థకాలు: క్రియాధాతువులపై 'ఉడు', 'అకం' అనే ప్రత్యయాలు చేరి తినుడు, తాగుడు, తినుకం, తాక్కం వంటి భావార్థక రూపాలు ఏర్పడుతున్నాయి. కొన్ని సందర్భాలలో తిన, తాగ, చేయ, చూడ, చదవ, తిరగ వంటి తుమర్థక రూపాలే భావార్థక ప్రయోగంలో ఉన్నట్లు కనిపిస్తున్నది. ఈ తుమర్థక రూపాలే 'వచ్చు', 'వస్తుంది' అనే అనుబంధాలతో భావార్థకంలోని స్పష్టత తెలుస్తుంది. ఉదా. నాకు తినవొచ్చు (నాకు తినడం వచ్చు), నాకు తాగవొచ్చు (నాకు తాగడం వొచ్చు), నాకు చేయవొచ్చు (నాకు చేయడం వచ్చు) నాకు సూడవొచ్చు (నాకు చూడడం వచ్చు), నాకు సద్వవొచ్చు/ నాకు సదవొచ్చు (నాకు చదవడం వచ్చు), నాకు తీర్గవొచ్చు/ నాకు తిరగొచ్చు (నాకు తిరగడం వచ్చు) నాకు తినవొస్తుంది/ నాకు తినొస్తుంది (నాకు తినడం వస్తుంది.), నాకు తాగవొస్తుంది. నాకు తాగొస్తుంది (నాకు తాగడం వస్తుంది), నాకు చేయవొస్తుంది. నాకు చేయొస్తుంది (నాకు చేయడం వస్తుంది), నాకు సద్వవొస్తుంది/ నాకు సదవొస్తుంది (నాకు చదవడం వస్తుంది) మొదలైనవి. ఈ భావార్థక రూపాలు వ్యతిరేకార్థంలో క్త్వార్థక క్రియా రూపాలపై 'పోవుడు' అనే అనుబంధంచేరి తినకపోవుడు, తాక్కపోవుడు వంటి రూపాలు ఏర్పడుతున్నాయి. కొన్ని సందర్భాలలో ఈ భావార్థక రూపాలపై 'లేదు' అనే వ్యతిరేక ప్రత్యయం చేరి తినుడులేదు, తాగుడులేదు, తిన్కంలేదు, తాక్కంలేదు వంటి వ్యతిరేక రూపాలు కూడా కనిపిస్తున్నాయి. నాకు తినవొచ్చు, నాకు తాగవొచ్చు నాకు తినవొస్తుంది, నాకు తాగవొస్తుంది అనే ప్రయోగాలు వ్యతిరేకార్థంలో నాకు తినరాదు (నాకు తినడంరాదు), నాకు తాగరాదు (నాకు తాగడంరాదు) వంటి రూపాలతో కనిపిస్తున్నాయి. 'రా', 'పో', 'తే' వంటి ఏకాక్షర ధాతువులు భావార్థకంలో 'రాకడ' 'పోకడ', 'తేకడ' గా కనిపిస్తున్నాయి. 'ఏది' అనే అనుబంధ ప్రత్యయంతో తినేది (తినడం), తాగేది (తాగడం), సద్వేది (చదవడం), రాసేది (రాయడం), వచ్చేది (రావడం) వంటి రూపాలు కూడా భావార్థకంలో కనిపిస్తున్నాయి.

4.8.16 నిమిత్తార్థకాలు: భావార్థక రూపాలపై 'వల్ల' అనే ప్రత్యయం చేరి నిమిత్తార్థక రూపాలు ఏర్పడుతున్నాయి. ఉదా. తినుడువల్ల, తాగుడువల్ల, తినడంవల్ల, తాక్కంవల్ల మొదలైనవి. కొన్ని సందర్భాలలో క్రియా విశేషణాలపై 'అందుకు' అనే అనుబంధ ప్రత్యయం చేరి నిమిత్తార్థక రూపాలు ఏర్పడుతున్నాయి. ఉదా. వచ్చినందుకు, వచ్చేందుకు, కలిసినందుకు, కలిసేందుకు, చదివినందుకు, చదివేందుకు, రాసినందుకు, రాసేందుకు మొదలైనవి. వ్యతిరేకార్థంలో తినుడు లేనందువల్ల, తినుడు లేకపోడంవల్ల, తాగుడులేనందువల్ల, తాగుడు

లేకపోడంవల్ల, తిన్మంలేనందువల్ల, తిన్మంలేకపోడంవల్ల, తాక్మంలేనందువల్ల, తాక్మంలేకపోడంవల్ల వంటి నిమిత్తార్థక వ్యతిరేక రూపాలు కనిపిస్తున్నాయి.

4.8.17 ప్రేరణార్థకాలు: క్రియా ప్రాతిపదికలపై పు ఇంచు, ఇపించు, 'ఇపిచ్చు' అనే ప్రత్యయాలు చేరి ప్రేరణార్థక రూపాలు ఏర్పడుతున్నాయి. ఉదా. తాపు, తాగించు, తాగిపించు, తాపిచ్చు సూపు, సూయించు, సూపించు, సూయిచ్చు లేపు, లేయించు, లేపించు, లేపిచ్చు మొదలైనవి. అట్లే తినేటట్లుచేయు, ఉండేటట్లుచేయు, పోయేటట్లుచేయు, కూకోవెట్టు, కూసోవెట్టు, కూకుండవెట్టు, నిలవెట్టు, పడకోవెట్టు, తెలియజేయు, తెలియజెప్పు వంటి రూపాలు కూడా ప్రేరణార్థకాలుగా కనిపిస్తున్నాయి. వ్యతిరేకార్థంలో క్రియా ప్రాతిపదికలపై అకు అనే ప్రత్యయం చేరి వ్యతిరేక రూపాలు ఏర్పడుతున్నాయి. ఉదా. తాపకు, తాగించకు, తాగిపించకు, తాపిచ్చకు చూపకు, చూయించకు, చూపించకు, చూయిచ్చకు లేపకు, లేయించకు, లేపించకు, లేపిచ్చకు మొదలైనవి.

4.8.20 తద్ధర్మార్థక అభ్యసనార్థకాలు: తద్ధర్మార్థకంలో అభ్యసనాన్ని లేదా అలవాటును సూచించే టప్పుడు ఉపుఏవలో తిందు/ తిందును (తినేవాడిని), తాగుదు / తాగుదును (తాగేవాడిని), వొద్దు వొద్దును (వచ్చేవాడిని), పోదు/ పోదును (పోయేవాడిని) వంటి ప్రయోగాలు, ఉపుబవలో తిందుం (తినేవాళ్ళం), తాగుదుం (తాగేవాళ్ళం), వొద్దుం (వచ్చేవాళ్ళం), పోదుం (పోయేవాళ్ళం) వంటి ప్రయోగాలు కనిపిస్తున్నాయి. ప్రపుఏవలో తిను (తినేవాడు), తాగు (తాగేవాడు), వొచ్చు (వచ్చేవాడు), పోవు (పోయేవాడు), ప్రపుబవలో తిందురు (తినేవాళ్ళు), తాగుదురు (తాగేవాళ్ళు), వొద్దురు (వచ్చేవాళ్ళు), పోదురు (పోయేవాళ్ళు) వంటి ప్రయోగాలు కనిపిస్తున్నాయి.

4.9 అసమాపక క్రియలు రూపవైవిధ్యం

4.9.1 క్రియా ధాతువులు: క్రియార్థాన్నిచ్చే అర్థవంతమైన కనిష్ఠ రూపమే క్రియా ధాతురూపం. వీటికి కాల, పురుష వంటి ప్రత్యయాలు చేరి క్రియా రూపాలుగా మారతాయి. ఉదా. తిన్, తాగ్, ఆడ్, పాడ్, వెళ్, వచ్, తెర్చ్, కట్ట్, పుట్ట్, చెప్ప్, అవ్, ఉండ్, రాస్, చదువ్ మొదలైనవి. కొన్ని సందర్భాలలో క్రియా ధాతువే క్రియా ప్రాతిపదిక అవుతుంది. ఉదా. రా, పో, తే, కా మొదలైనవి.

4.9.2 క్రియా ప్రాతిపదికలు: కొన్ని సందర్భాలలో క్రియా ధాతువు రూపం కాల, పురుష వంటి ప్రత్యయాలు చేరేముందు మారుతుంది. ఉదా. తిను, తాగు, ఆడు, పాడు, వెళ్ళు, వచ్చు, తెచ్చు, కట్టు, పుట్టు, చెప్పు, అవు, ఉండు, రాయి, చదువు మొదలైనవి. వీటికి విధ్యర్థక రూపాలుగా కూడా ప్రయోగం ఉంటుంది.

4.9.3 తుమర్థకాలు: ఆధునికంలో తిను, తాగు, చూడు, చదువు, రాయు, తిరుగు, కలువు, తెలియు వంటి క్రియా ప్రాతిపదికలను కొన్ని ప్రత్యేకించిన అర్థాలలో ప్రయోగించేటప్పుడు రూపం మారబోయే సందర్భంగా 'అ' అనే ప్రత్యం చేరి తిన, తాగ, చూడ, చదవ, రాయ, తిరగ, కలవ, తెలవ వంటి తుమర్థక రూపాలు ఏర్పడతాయి. ఈ రూపాలు సామర్థ్యం, సాధ్యం, సంభవనీయం, అనుమతి, ప్రేరణ మొదలైన అర్థాలలో కనిపిస్తాయి. ఉదా. సామర్థ్యార్థకంలో: తినగల, తాగగల, చూడగల, చదవగల, రాయగల, తిరగగల, కలవగల, తెలియగల సాధ్యార్థంలో: తినబోవు, తాగబోవు, చూడబోవు, చదవబోవు, రాయబోవు, తిరగబోవు, కలవబోవు, తెలవబోవు సంభవనీయార్థంలో: తినవచ్చు, తాగవచ్చు, చూడవచ్చు, చదవవచ్చు, రాయవచ్చు, తిరగవచ్చు, కలవవచ్చు, తెలవవచ్చు అనుమత్యర్థంలో: తిననిచ్చు, తాగనిచ్చు, చూడనిచ్చు, చదవనిచ్చు, రాయనిచ్చు, తిరగనిచ్చు, కలవనిచ్చు, తెలవనిచ్చుటీ ప్రేరణార్థకంలో: తినిపించ, తాగించ, చూడనీయ, చదివించ, రాయించ, తిరగనీయ, కలవనీయ, తెలియజేయ మొదలైనవి. వ్యతిరేక రూపాలలో కూడా ఈ ప్రత్యం చేరి వ్యతిరేక రూపాలు ఏర్పడుతున్నాయి.

4.9.4 క్త్వార్థకాలు: క్రియాధాతువులపై 'ఇ' అనే ప్రత్యయం చేరి 'తిని', 'తాగి', 'సూసి', 'వొచ్చి', 'రాసి', 'సదివి' వంటి క్త్వార్థక క్రియా రూపాలు ఏర్పడుతున్నాయి. వ్యతిరేకార్థంలో 'అకు', 'అకుంట/ అకుండ' అనే ప్రత్యయాలు చేరి తినక, తినకుంట, తినకుండ, తాగక, తాగకుంట, తాగకుండ, సూడక, సూడకుంట, సూడకుండ, రాక, రాకుంట, రాకుండ, రాయక, రాయకుంట, రాయకుండ, సద్వక, సద్వకుంట, సద్వకుండ వంటి వ్యతిరేక క్త్వార్థక రూపాలు ఏర్పడుతున్నాయి. అట్లే తినక, తాగక వంటి క్త్వార్థక వ్యతిరేక రూపాలపై 'వచ్చు' అనే అనుబంధం చేరి 'తినకొచ్చు', 'తాగకొచ్చు' వంటి వ్యతిరేక ప్రాతిపదికలు ఏర్పడి ప్రపుఏవలో తినకొచ్చిండు (తినకుండా వచ్చాడు), తాగకొచ్చిండు (తాగకుండా వచ్చాడు) వంటి రూపాలు, ప్రపుబవలో తినకొచ్చిను (తినకుండా వచ్చారు), తాగకొచ్చిను (తాగకుండా వచ్చారు) వంటి రూపాలు ఏర్పడుతున్నాయి. ఈ ప్రాతిపదికలపై తదితర పురుషలలో కూడా వ్యతిరేక రూపాలు ఏర్పడుతున్నాయి. ఈ రూపాలలో వకారం ఒకారంగా మారడం గమనించవచ్చు.

4.9.5 శత్రర్థకాలు: క్రియా ధాతువులపై 'తు' 'టు' 'తా' 'టా' అనే శత్రర్థక ప్రత్యయాలు చేరి శత్రర్థక రూపాలు ఏర్పడుతున్నాయి. ఉదా. చేస్తు, రాస్తు, ఆడు, పాడు, సద్వుతు, తింటు, వింటు, కొంటు, ఉంటు, చేస్తా, తింటా మొదలైనవి. అట్లే 'తుండంగా', 'టుండంగా' అనే అనుబంధ ప్రత్యయాలు చేరి చేస్తుండంగా, ఆడ్తుండంగా, పాడ్తుండంగా, సద్వుతుండంగా (సదుతుండంగా, సవుతుండంగా), తింటుండంగా, వింటుండంగా, ఉంటుండంగా వంటి రూపాలు కూడా ఏర్పడుతున్నాయి. ఆత్మార్థక క్రియా ప్రాతిపదికలపై టు, ట, టా అనే ప్రత్యయాలతో చేసుకుంటు, చేసుకుంట, చేసుకుంటా, రాసుకుంటు, రాసుకుంట, రాసుకుంటా, ఆడుకుంటు, ఆడుకుంట, అడుకుంటా, పాడుకుంటు, పాడుకుంట, పాడుకుంటా, సద్వుకుంటు, సద్వుకుంట, సద్వుకుంటా, వినుకుంటు, వినుకుంట, వినుకుంటా వంటి రూపాలు కనిపిస్తున్నాయి. అట్లే వ్యతిరేకార్థంలో క్రియా ధాతువులపై 'అకుంట/ అకుండ' అనే అనుబంధ ప్రత్యయాలు చేరి చేయకుంట, చేయకుండ, రాయకుంట, రాయకుండ, ఆడకుంట, ఆడకుండ, పాడకుంట, పాడకుండ, సద్వకుంట, సద్వకుండ, తినకుంట, తినకుండ, వినకుంట, వినకుండ వంటి వ్యతిరేక శత్రర్థక రూపాలు ఏర్పడుతున్నాయి. 'అకుంట', 'అకుండ' నే అనుబంధ ప్రత్యయాలు తెలంగాణలో వైయక్తిక వైవిధ్యాలుగా కనిపిస్తాయి.

- ముగింపు వచ్చే సంచికలో....

రచయిత
పూర్వ డిప్యూటీ డైరెక్టర్, తెలుగు అకాడమీ

అప్పం పాండయ్య
9703079900

తెలంగాణ వైతాళికుడు కాళోజి




ప్రజాకవి కాళోజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

తెలంగాణలో తెలుగుభాషా వెలుగు కిరణాలు నింపి విశిష్ట సేవలందించిన మహనీయుడు ప్రజాకవి కాళోజీ నారాయణరావు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాకవి కాళోజీ జన్మదినాన్ని ('సెప్టెంబర్ 9) తెలంగాణ భాషాదినోత్సవం'గా ప్రకటించి తెలంగాణ ప్రజల అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి, తెలంగాణ జీవద్భాషకు ప్రాణం పోసింది. తెలంగాణ మాండలిక తెలుగు భాషా వైశిష్ట్యాన్ని, ఔన్నత్యాన్ని భాషలోని పదాలనూ, యాసలనూ, యాసలలోని అందాలనూ, అలంకారాలనూ, జాతీయాలనూ, నానుడులనూ చాటి చెప్పుకోడానికి తెలంగాణ ప్రజలను మేల్కొలిపింది. తెలుగు భాషా సాహిత్యాలలో ప్రముఖంగా కృషిచేసిన వారికి 'కాళోజీ పురస్కారం' పేరిట ప్రతి సంవత్సరం కాళోజీ పుట్టిన రోజున సమావేశం ఏర్పరిచి అధికారికంగా పురస్కారాలను అందజేయడం జరుగుతున్నది.

కాళోజీ తెలంగాణ వైతాళికుడు. తెలంగాణ మాండలిక తెలుగు భాషా సాహిత్య రంగాలలో ప్రజాకవిగా, ప్రజాస్వామ్య కవిగా, తిరుగుబాటు కవిగా పిలువబడే కాళోజీకి సమకాలీన, సామాజిక, రాజకీయ, సాహిత్య ఉద్యమాలతో విడదీయలేని సంబంధం ఏర్పడింది. తెలంగాణ ఆవిర్భావం తరువాత కాళోజీ గురించిన సాహిత్య సభలూ సమావేశాలూ, చర్చా సదస్సులూ అధికారికంగా, అనధికారికంగా నిర్వహించి కాళోజీ తెలంగాణకు చేసిన విశిష్ట సేవలను కొనియాడడం ప్రేరణాత్మకమైంది. ఇవి తెలంగాణ ఆత్మగౌరవసభలుగా భావిస్తూ ఉత్సాహంతో తెలుగు భాషపై కృషిచేయడం విస్తృతమైంది. 'అన్యాయాన్ని ఎదిరించే వాడే నాకు ఆరాధ్యుడు' అన్న కాళోజీ మాటను స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ కవులూ, రచయితలూ ఉద్యమరూపంగా పాటలూ, పద్యాలూ రాయడం వాటికి ప్రచారం కల్పించడం తెలంగాణ తెలుగుకు జీవం పోయడం ఒక అద్భుతమైన సంఘటన. తెలంగాణ తెలుగు లోని రాజకీయోపన్యాసాలను ఆదర్శంగా తీసుకొని వివిధ రాష్ట్రాలలో తెలంగాణ తెలుగుకు ప్రాముఖ్యాన్ని కల్పించడం కూడా ఆశ్చర్యకరమైన విషయమే. ఇది తెలుగు భాషాపరిరక్షణకు మూలభూతమైంది. ఏ భాషకైనా సరైన ప్రోత్సాహం కల్పించినప్పుడే జీవద్భాషగా నిలుస్తుందన్నది సుస్పష్టమైన అంశం. కాళోజీ అనుసరించిన ఈ భాషా సాహిత్యోద్యమంవల్ల ఒక్క తెలంగాణ తెలుగుకే కాకుండా వివిధ రాష్ట్రాలలోని వివిధ మాతృభాషలకు ప్రాణం పోసి భవిష్యత్తుకు మార్గం సుగమం చేసినట్లయింది. ఆయా భాషలపైన, పునర్నిర్మాణాత్మకమైన పరిశోధనలూ, సిద్ధాంతాలూ విరివిగా రావడం వల్ల ఆయా భాషలు చిరస్థాయిగా బతికి ఉంటాయనే నమ్మకం ఏర్పడింది. భాషా విషయంలో సీమాంధ్రులు ఆంగ్లభాషా మోజులోపడి, తెలంగాణవాళ్ళు ఉర్దూభాష మోజులో పడి తెలుగును నిర్లక్ష్యంచేయడం భావదాస్యంగా చూశాడు కాళోజీ. తెలుగుభాషలో ఉన్న యాసలకు ప్రాధాన్యం ఇవ్వాలనీ, యాసలకు ఇతర భాషాంశాలతో సమానమైన ప్రతిష్ఠను కలిగించాలనీ, లిఖితభాష ఉచ్చారణా విధేయంగా ఉండాలని అంటాడు.

తరువాయి....48వ పుటలో



నవంబరు 19న ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరిట నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించి జాతికి అంకితం చేశారు. రూ.95 కోట్ల వ్యయంతో హనుమకొండలో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కాళోజీ నారాయణరావు కాంస్య విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం కాళోజీ విగ్రహానికి పూలతో నివాళులర్పించారు. కాళోజీ రచనలనూ, పుస్తకాలనూ కాళోజీ డాక్యుమెంటరీని మంత్రులూ, ఎమ్మెల్యేలతో కలిసి చూశారు.

కాళోజీ కలం రాల్చిన నిప్పు కణికలు: ఎవని వాడుక భాష వాడు రాయాలె. ఇట్ల రాస్తే అవతలోనికి తెలుస్తదా అని ముందర్నే మనమనుకునుడు, మనసు మనం తక్కువ చేసుకున్నట్లె. ఈ బానిస భావన పోవాలె. నే నెన్నో సార్లు చెప్పిన. భాష రెండు తీర్లు – ఒకటి బడి పలుకుల భాష, రెండోది పలుకు బడుల భాష. పలుకు బడుల భాషగావాలె. తెలుగు బిడ్డవురోరి తెలుగు మాట్లాడుటకు– సంకోచ పడియెదవు సంగతేమిటిరా? అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు–సకిలించు ఆంధ్రుడా! చావవేటికిరా.

ఒక్క సిరాచుక్క లక్షల మెదళ్లకు కదలిక.
పుట్టుక నీది–చావు నీది–బతుకంతా దేశానిదీ.

ఎస్. రమేశ్
9490993210

తెలుగు సాహిత్యం, సంస్కృతి, చరిత్ర మరియు వాణిజ్యం: ఒక విస్తృత అధ్యయనం

ఉపోద్ఘాతం: తెలుగు సాహిత్యం, సంస్కృతి, చరిత్ర మరియు వాణిజ్యం మధ్య గల అవినాభావ సంబంధాన్ని ఈ వ్యాసం విశదీకరిస్తుంది. ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక యుగం వరకు, తెలుగు ప్రాంతాలు వాణిజ్య కేంద్రాలుగా ఎలా రూపొందాయో, సాహిత్యంలో వాణిజ్య ప్రస్తావనలు ఎలా కనిపిస్తాయో, సాంస్కృతిక మార్పులు వాణిజ్యాన్ని ఎలా ప్రభావితం చేశాయో ఈ వ్యాసం వివరిస్తుంది. పారంపరిక కళలు మరియు వృత్తుల వాణిజ్యీకరణ, సాహిత్య పర్యాటకం ద్వారా ఆర్థిక ప్రగతి, ఆధునిక కాలంలో తెలుగు రాష్ట్రాల అభివృద్ధి, వాణిజ్య నిర్వహణలో తెలుగు సాంప్రదాయాల ప్రభావం, డిజిటల్ యుగంలో తెలుగు సాహిత్య వాణిజ్యం, అంతర్జాతీయ వేదికపై తెలుగు సంస్కృతి ప్రాతినిధ్యం, పర్యావరణ అనుకూల వాణిజ్యంలో తెలుగు సంప్రదాయాల పాత్ర, తెలుగు భాషా సాంకేతికత మరియు వాణిజ్య అవకాశాలు, ప్రవాస తెలుగువారి పాత్ర వంటి అంశాలను ఈ వ్యాసం సవివరంగా చర్చిస్తుంది. చివరగా, భవిష్యత్ అవకాశాలు మరియు సవాళ్లను పరిశీలిస్తూ, తెలుగు సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూనే ఆధునిక వాణిజ్య అవకాశాలను వినియోగించుకోవడం ఎలా అనే అంశంపై దృష్టి సారిస్తుంది.

తెలుగు సాహిత్యం, సంస్కృతి మరియు చరిత్ర అనేవి వాణిజ్యం మరియు వ్యాపారంతో గాఢమైన సంబంధాన్ని కలిగి ఉన్నాయి. ఈ సంబంధం తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించింది.

1. చారిత్రక నేపథ్యం: తెలుగు ప్రాంతాలు ప్రాచీన కాలం నుండి వాణిజ్య కేంద్రాలుగా ప్రసిద్ధి చెందాయి. శాతవాహనుల కాలం నుండే ఈ ప్రాంతాలు అంతర్జాతీయ వాణిజ్యంలో ప్రముఖ పాత్ర పోషించాయి. విశాఖపట్నం, మచిలీపట్నం, మోటుపల్లి వంటి ఓడరేవులు రోమన్ సామ్రాజ్యంతో సహా పలు దేశాలతో వ్యాపార సంబంధాలను కలిగి ఉండేవి. ఈ వాణిజ్య మార్గాల ద్వారా కేవలం వస్తువులే కాకుండా సంస్కృతి, కళలు, భాషలు కూడా ఇతర దేశాలకు వ్యాపించాయి. ఇది తెలుగు సాహిత్యం మరియు సంస్కృతిపై గొప్ప ప్రభావాన్ని చూపింది.

2. సాహిత్యంలో వాణిజ్య ప్రస్తావనలు: తెలుగు సాహిత్యంలో వాణిజ్య అంశాలు ప్రముఖంగా కనిపిస్తాయి. నన్నయ భట్టారకుడు తన 'ఆంధ్ర మహాభారతం'లో తత్కాలీన వాణిజ్య విధానాలను వివరించాడు. తిక్కన సోమయాజి కూడా తన రచనలలో వర్తక మార్గాలు మరియు ఆర్థిక వ్యవస్థల గురించి ప్రస్తావించాడు. శ్రీనాథుని 'భీమఖండము'లో కాకతీయుల కాలంలోని వాణిజ్య కేంద్రాల వివరణలు ఉన్నాయి. ఈ రచనలు ఆ కాలపు ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకోవడానికి సహాయపడతాయి.

పోతన భాగవతంలో కూడా వ్యాపార లావాదేవీలు, మార్కెట్ల వివరాలు కనిపిస్తాయి. ఇవి అప్పటి సమాజంలో వాణిజ్యం ఎంత ముఖ్యమైనదో తెలియజేస్తాయి. అల్లసాని పెద్దన 'మనుచరిత్ర'లో రాజ్య పాలనలో వాణిజ్య ప్రాముఖ్యతను వివరించాడు.

3. సాంస్కృతిక ప్రభావాలు మరియు వాణిజ్య సంబంధాలు: వాణిజ్యం ద్వారా విదేశీ సంస్కృతులతో సంపర్కం తెలుగు సంస్కృతిని సమృద్ధం చేసింది. అరబ్, పర్షియన్ మరియు యూరోపియన్ వర్తకులతో సంబంధాల వల్ల తెలుగు భాషలో కొత్త పదాలు చేరాయి. ఉదాహరణకు, 'బజారు', 'దుకాణం' వంటి పదాలు. ఈ సాంస్కృతిక మార్పులు కళలు, వస్త్రధారణ, ఆహారపు అలవాట్లపై ప్రభావం చూపాయి.

కాకతీయుల కాలంలో తెలుగు ప్రాంతాలు వాణిజ్య కేంద్రాలుగా వర్ధిల్లాయి. వారి పరిపాలనలో నిర్మించిన చెరువులు, ఆనకట్టలు వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి, దానితో పాటు వాణిజ్యాన్ని కూడా పెంపొందించాయి. ఈ కాలంలోనే తెలుగు వాణిజ్యం తన పరాకాష్ఠకు చేరుకుంది.

4. పారంపరిక కళలు మరియు వృత్తుల వాణిజ్యీకరణ: తెలుగు సాహిత్యంలో వర్ణించబడిన అనేక పారంపరిక వృత్తులు మరియు కళలు నేడు ముఖ్యమైన వాణిజ్య అవకాశాలుగా మారాయి. ఉదాహరణకు:

– కలంకారీ: మచిలీపట్నం ప్రాంతంలో అభివృద్ధి చెందిన ఈ వస్త్ర ముద్రణ కళ నేడు అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది.

– పోచంపల్లి ఇకత్: తెలంగాణ ప్రాంతపు ఈ నేత కళ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది.

– కొండపల్లి బొమ్మలు: ఈ చెక్క బొమ్మలు నేడు తెలుగు సంస్కృతికి ప్రతీకగా మారాయి.

ఈ పారంపరిక కళలు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్లో తెలుగు సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయి.

5. సాహిత్య పర్యాటకం మరియు ఆర్థిక ప్రభావాలు: తెలుగు సాహిత్యంలో వర్ణించబడిన ప్రదేశాలు, దేవాలయాలు మరియు సాంస్కృతిక కేంద్రాలు నేడు ముఖ్యమైన పర్యాటక ఆకర్షణలుగా మారాయి. ఉదాహరణకు:

– శ్రీశైలం: పోతన భాగవతంలో వర్ణించబడిన ఈ క్షేత్రం నేడు ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారింది.

– లేపాక్షి: వీరభద్రుని ఆలయంతో ప్రసిద్ధి చెందిన ఈ ప్రదేశం అనంతపురం జిల్లా ఆర్థిక వ్యవస్థకు దోహదం చేస్తోంది.

– హంపి: విజయనగర సామ్రాజ్య రాజధానిగా సాహిత్యంలో వర్ణించబడిన ఈ ప్రదేశం నేడు యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొంది, వేలాది పర్యాటకులను ఆకర్షిస్తోంది.

ఈ పర్యాటక కేంద్రాలు స్థానిక ఉపాధి అవకాశాలను సృష్టించడమే కాకుండా, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయి.

6. ఆధునిక కాలంలో తెలుగు రాష్ట్రాల అభివృద్ధి మరియు వాణిజ్యం: స్వాతంత్ర్యం తరువాత తెలుగు రాష్ట్రాలు అనేక రంగాలలో అభివృద్ధి సాధించాయి. ముఖ్యంగా:

– సమాచార సాంకేతిక రంగం (IT): హైదరాబాద్, విశాఖపట్నం వంటి నగరాలు (IT) హబ్లుగా మారాయి. ఇది అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించి, ఉపాధి అవకాశాలను పెంచింది.

– ఫార్మా రంగం: తెలుగు రాష్ట్రాలు భారతదేశ ఔషధ తయారీ కేంద్రాలుగా మారాయి. ఇది ఎగుమతులను పెంచి, ఆర్థిక వృద్ధికి దోహదపడింది.

– చిత్ర పరిశ్రమ: 'టాలీవుడ్' పేరుతో ప్రసిద్ధి చెందిన తెలుగు చిత్ర పరిశ్రమ దేశంలోనే అత్యధిక చిత్రాలను నిర్మించే పరిశ్రమగా గుర్తింపు పొందింది. ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన దోహదం చేస్తోంది.

ఈ అభివృద్ధి తెలుగు భాష మరియు సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేసింది. ఇది అంతర్జాతీయ వాణిజ్య అవకాశాలను మెరుగుపరచడమే కాకుండా, ప్రవాస తెలుగువారితో బలమైన సంబంధాలను ఏర్పరచింది.

7. వాణిజ్య నిర్వహణలో తెలుగు సాంప్రదాయాల ప్రభావం: తెలుగు సంస్కృతి మరియు సాంప్రదాయాలు వ్యాపార నిర్వహణ పద్ధతులపై కూడా ప్రభావం చూపాయి. ఉదాహరణకు:

– నాయంకర వ్యవస్థ: మధ్యయుగ కాలంలో అభివృద్ధి చెందిన ఈ వ్యవస్థ నేటి కార్పొరేట్ సామాజిక బాధ్యత (AI) భావనకు మూలం.

– గుత్త వ్యవస్థ: ఇది ఒక రకమైన ఫ్రాంచైజీ మోడల్‌కు సమానం, ఇది నేటి వ్యాపార విస్తరణ వ్యూహాలకు ప్రేరణ.

8. భవిష్యత్ అవకాశాలు మరియు సవాళ్లు: తెలుగు సాహిత్యం, సంస్కృతి మరియు చరిత్రను వాణిజ్యంతో అనుసంధానించడం ద్వారా అనేక భవిష్యత్ అవకాశాలు ఉన్నాయి:

– సాంస్కృతిక పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేయడం.

– పారంపరిక కళలను ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మలచడం.

– తెలుగు భాషా సాఫ్ట్‌వేర్ మరియు (AI) అప్లికేషన్ల అభివృద్ధి.

అయితే, సాంప్రదాయిక విలువలను కాపాడుకుంటూ ఆధునిక అభివృద్ధిని సాధించడం ఒక ప్రధాన సవాలు.

9. డిజిటల్ యుగంలో తెలుగు సాహిత్య వాణిజ్యం: ఆధునిక కాలంలో, డిజిటల్ సాంకేతికత తెలుగు సాహిత్య వ్యాప్తికి కొత్త మార్గాలను తెరిచింది:

– ఇ-పుస్తకాలు: తెలుగు పుస్తకాలు ఇప్పుడు డిజిటల్ ఫార్మాట్‌లో అందుబాటులో ఉన్నాయి, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాఠకులకు సులభంగా చేరుకోగలుగుతోంది.

– ఆడియో బుక్స్: తెలుగు సాహిత్య కృతులు ఆడియో రూపంలో అందుబాటులోకి వచ్చాయి, ఇది కొత్త తరం పాఠకులను ఆకర్షిస్తోంది.

– ఆన్‌లైన్ కోర్సులు: తెలుగు భాష మరియు సాహిత్యంపై ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులోకి రావడంతో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు తెలుగు నేర్చుకునే అవకాశం పొందుతున్నారు.

10. అంతర్జాతీయ వేదికపై తెలుగు సంస్కృతి ప్రాతినిధ్యం: తెలుగు సంస్కృతి ఇప్పుడు అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శించబడుతోంది, ఇది వాణిజ్య అవకాశాలను మరింత పెంచుతోంది:

– అంతర్జాతీయ చలనచిత్ర మహోత్సవాలలో తెలుగు సినిమాల ప్రదర్శన.

– ప్రపంచ సాహిత్య వేదికలపై తెలుగు రచయితల పాల్గొనడం.

– అంతర్జాతీయ సంగీత మరియు నృత్య కార్యక్రమాలలో తెలుగు కళాకారుల ప్రదర్శనలు.

11. పర్యావరణ అనుకూల వాణిజ్యంలో తెలుగు సంప్రదాయాల పాత్ర: తెలుగు సంస్కృతిలో పర్యావరణ పరిరక్షణకు ఎప్పుడూ ప్రాధాన్యత ఉంది. ఈ సంప్రదాయాలు ఇప్పుడు ఆధునిక సుస్థిర వాణిజ్య పద్ధతులకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి:

– పేడకోలు వ్యవసాయం: సాంప్రదాయిక పంట విధానాలు ఇప్పుడు ఆర్గానిక్ వ్యవసాయానికి ప్రేరణగా నిలుస్తున్నాయి.

– హస్తకళలు: చేతి వస్తువుల తయారీలో వాడే సహజ వనరులు పర్యావరణ హితమైన ఉత్పత్తులకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

12. తెలుగు భాషా సాంకేతికత మరియు వాణిజ్య అవకాశాలు: తెలుగు భాషా సాంకేతికత రంగంలో కొత్త వాణిజ్య అవకాశాలు ఉద్భవిస్తున్నాయి:

– తెలుగు భాషా ప్రాసెసింగ్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి.

– తెలుగు వాయిస్ అసిస్టెంట్స్ మరియు చాట్‌బాట్‌ల తయారీ.

– తెలుగు-ఇంగ్లీష్ అనువాద సాఫ్ట్‌వేర్ అభివృద్ధి.

13. ప్రవాస తెలుగువారి పాత్ర: ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన తెలుగు ప్రవాసులు తెలుగు సంస్కృతి మరియు వాణిజ్యానికి వారధిగా నిలుస్తున్నారు:

– విదేశాలలో తెలుగు రెస్టారెంట్లు, దుకాణాలు నడపడం ద్వారా తెలుగు ఆహారం, వస్తువులను ప్రచారం చేస్తున్నారు.

– అంతర్జాతీయ కంపెనీలతో తెలుగు రాష్ట్రాలకు వాణిజ్య సంబంధాలను ఏర్పరుస్తున్నారు.

– తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా తెలుగు కళలకు ప్రపంచ వేదికను కల్పిస్తున్నారు.

ముగింపు: తెలుగు సాహిత్యం, సంస్కృతి, చరిత్ర మరియు వాణిజ్యం మధ్య ఉన్న సంబంధం శతాబ్దాలుగా కొనసాగుతూ వస్తోంది. ఈ సంబంధం తెలుగు ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి దోహదపడింది. ఆధునిక కాలంలో, ఈ సంబంధం మరింత బలపడి, కొత్త రూపాలను సంతరించుకుంటోంది. డిజిటల్ యుగంలో తెలుగు సంస్కృతి మరియు వాణిజ్యం ప్రపంచ వేదికపై తమ స్థానాన్ని పదిలం చేసుకుంటున్నాయి.

అయితే, ప్రపంచీకరణ నేపథ్యంలో పారంపరిక విలువలను కాపాడుకోవడం, స్థానిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం, మరియు సుస్థిర అభివృద్ధిని సాధించడం ముఖ్యమైన సవాళ్లుగా నిలుస్తాయి. భవిష్యత్తులో, తెలుగు సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూనే ఆధునిక వాణిజ్య అవకాశాలను వినియోగించుకోవడం ప్రధాన లక్ష్యంగా ఉండాలి. ఈ విధంగా, తెలుగు సాహిత్యం, సంస్కృతి మరియు వాణిజ్యం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి.

రచయిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కామర్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నేలకొండపల్లి, ఖమ్మం జిల్లా, తెలంగాణ

ప్రకటన

అనివార్యకారణాల వలన 'అమ్మనుడి' మాసపత్రికను 2024లో నిరంతరాయంగా ప్రచురించలేక పోయినందుకు చింతిస్తున్నాం. 2025 మార్చి, ఏప్రిల్ సంచికలను కలిపి ఒకే సంచికగా ఇప్పుడు ప్రచురిస్తున్నాం. ఇందుకు మమ్మలను మన్నించమని చదువరులనూ రచయితలనూ ప్రకటనకర్తలనూ వేడుకొంటున్నాం. వ్యవస్థలో అవసరమైన మార్పులను చేసుకొని త్వరలోనే ప్రతినెలా 'అమ్మనుడి'ని ప్రచురించగలమని అందరికీ విన్నవిస్తున్నాం. ఇకపై కూడా మీ అందరి సహకారాన్నీ కోరుకొంటున్నాం.

–ప్రచురణ కర్త

STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS OF "**AMMANUDI**", MONTHLY MAGAZINE, Tenali as required under Rule 3 of the Registration of News Papers (Central) Rules 1956.

FORM IV (See Rule 3)

1.Place of Publication :Angalakuduru
2.Periodicity : Monthly
3.Printer's Name :SAMALA LAKSHMANA BABU
4.Whether Citizen of India : Yes
5.Address: D.No.8-386, Angalakuduru post, Tenali Mandal, Guntur Dist. A.P.
6. Publisher's Name : SAMALA LAKSHMANA BABU
Address : As above
7. Editor's Name : SAMALA RAMESH BABU
Addres: As above
8.Names & Addresses of Individuals who owns the newspaper : SAMALA LAKSHMANA BABU : As above

I, Samala Lakshmana Babu, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
SAMALA LAKSHMANA BABU
Publisher

Tenali
25-3-2025

ఎ. రవీంద్రబాబు
8008636981

రావిశాస్త్రి 'వేతనశర్మ కథ - విప్లవ శిల్ప విలక్షణత

రావిశాస్త్రి:

రావిశాస్త్రి మరణించినప్పుడు అజంతా బాధాతప్త హృదయంతో-

"ఇక కథ లేదు వ్యథ,
దారి లేదు, ఎడారి, ఎడారి, ఎడారి
అడుగడుగునా ఇక అశ్రుఘాతాలే
శిరస్సు ప్రయ్యలైన అపశబ్ద శరీరాలే
వీధి మొగలో ధూళి, ధూళి
జీవన గ్రంథం నిండా పొగ అన్నారు. ఇది అక్షర సత్యం.

రావిశాస్త్రి అనగానే 'అల్పజీవి' నవల గుర్తుకొస్తుంది, లేదా 'ఆరుసారా కథలు' గుర్తొస్తాయి, లేదా శ్రీశ్రీ బాటలో రాసిన 'బుక్కులు' గుర్తొస్తాయి. కానీ నిజానికీ వారు రాసిన 'కార్నర్ సీటు' పిపీలికం', 'వరం', 'వేతనశర్మ' లాంటి కథలు చాలా జటిలమైనవి, తార్కికమైనవి. సమజాన్ని లోచూపుతో అర్థం చేసుకోడానికి ఉపయోగపడేవి. పాఠకుల మేధోతత్వాన్నీ పెంపొందించేవి.

"రావిశాస్త్రి ఈ దేశపు ఈ కాలపు మేధావివర్గంతో బ్రహ్మరథం పట్టించుకోగల రచయిత. ఆయన కథలు చదివాక చదవక ముందున్న స్థితిలో ఉండగలవాడు పరమ జడుడై ఉండాలి. ఆయనలో ప్రచార గుణం ఉన్నది. పాఠకుణ్ణి కాలరు పట్టుకుని నిలవేసే లక్షణం ఉంది. నూతన ప్రయోగాలు చేసే సమర్థత ఉంది. మధ్యతరగతి పునాదులు కదిలించడానికి ప్రతికథా ఉపయోగపడుతుంది. ఇలాంటి డైనమైట్స్‌ను రావిశాస్త్రి సృష్టించినంతగా మరే రచయితా సృష్టించలేదని చెప్పవచ్చు' (ప్రసాదు, కృష్ణాబాయి. 2015:18).

'వేతనశర్మ కథ' భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు అన్వయిస్తోంది. పాలకుల స్థితినీ, పాలనా విధానాన్నీ, అధికారుల ప్రవర్తననూ, వ్యాపారాల లావాదేవీలలోని లాభనష్టాల కొలతలనూ, వ్యాపారులకూ, పాలకులకూ మధ్య ఉండే లాలూచీని, ప్రజల బాధలనూ, ఆ కష్టనష్టాల్లోంచి పుట్టే నాయకుడినీ, ఆ నాయకుడు సృష్టించే విప్లవాన్నీ, ఆ విప్లవాన్ని అణిచివేసే పాలకుల ఎత్తుగడలనూ, పాలకులకూ పాలితులకూ మధ్య ఉండే ఉద్యోగవ్యవస్థ లాబీయింగ్‌నూ, వ్యవస్థ స్వలాభాపేక్షతో చేసే అక్రమాలనూ, విప్లవానికి పొడిచే వెన్నుపోటును మేజిక్ రియలిజం కథన పద్ధతిలో చూపిస్తుంది.

తెలుగులో మునిపల్లె రాజు ఈ కథన పద్ధతిలో ఎక్కువ రచనలు చేశాడు. ఈ నిర్మాణ పద్ధతి గురించి "1925లో అమెరికాలో మొదటుగా ఫ్రాంజ్ రోహ్ 'మేజిక్ రియలిజం-పోస్ట్ ఎక్స్‌ప్రెషనిజం' అనే పుస్తకం ప్రకటించాడు. యాభైల నాటికి మార్క్వెజ్ తన నవల 'వన్ హండ్రెడ్ ఇయర్స్ అఫ్ సోలిట్యూడ్' లో ఈ మేజిక్ రియలిజాన్ని గొప్పగా ఆవిష్కరించాడు. సరిగ్గా ఆ సమయంలోనే కథలు రాయడం మొదలెట్టిన మునిపల్లె రాజు ఈ మేజిక్ రియలిజాన్ని తన కథలకు ఉపయోగించుకున్నారు. ఒక సంక్షోభ కాలంలో, పైగా రెండు ప్రపంచ యుద్ధాల మధ్య ఉండేటువంటి కాలంలో- రాజకీయ, సాంస్కృతిక, ఆర్థికపరమైన మార్పులు ఒక సమాజంలో చోటు చేసుకుంటున్నప్పుడు మనిషి నిజ అస్తిత్వ స్థితికి సరిహద్దులు చెరిగిపోతాయి. ఈ సంక్షోభిత వాస్తవాన్ని సంపూర్ణంగా చిత్రించేందుకు రచయితే ఒకేసారి భూత, భవిష్యత్, వర్తమాన కాలాల అవగాహనలోంచి కథనం కొనసాగిస్తాడు.

పౌరాణిక, బీభత్స, చారిత్రక, జానపద వీర గాథలు, అనేక వర్ణనలు, బీభత్స రస ప్రధానాలైన కల్పనలతో కూడిన ఒక శిల్పం రూపు దిద్దుకుంటుంది. అదే మేజిక్ రియలిజం. విచిత్రం ఏమిటంటే ఇన్ని వైరుధ్యాల మధ్య కూడా బిగి సడలని కథనం కొనసాగించడమే ఈ మేజిక్ రియలిజం గొప్పదనం. కథలో మగధదేశాన్ని సుందరసేనుడనే మహారాజు పరిపాలిస్తూ ఉంటాడు. కథ మొదటే రావిశాస్త్రి అర్థవంతమైన ఆలోచనాత్మకమైన ఒక వాక్యాన్ని బ్రాకెట్లలో ఇస్తాడు.'పాలించేవారే రాజులనడం వేరు! రాజులే పరిపాలించాలనడం వేరు' ఈ వాక్యాన్ని తర్కబద్ధంగా ఆలోచించాలి. ఎందుకంటే, రావిశాస్త్రి ఎవరి గురించి చెప్తున్నారో, ఎందుకు చెప్తున్నారో అనేదానికి సూచన ఈ వాక్యం. అంటే తొలి ద్వారం లాంటిది అన్నమాట. ఆ రాజు వర్ణాశ్రమ ధర్మాలను కాపాడుతూ, ప్రజల మధ్య భగవంతుణ్ణి నిలబెట్టి, తనకు తోచిన రీతిలో ఏలుబడి సాగిస్తుంటాడు. నిజానికి పాలన సక్రమంగా సాగాలన్నా, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నా దేశ ఆర్థికస్థితి ముఖ్యం.

ఆర్థికరంగం:

మూలధనం, వ్యాపారం, వినియోగం, లాభాలు, పన్నులతో కూడుకున్నదే ఆర్థికరంగం. ఈ అంశాలతో ముడిపడి ఉన్న ప్రజల జీవనాన్ని, పాలకులకు, ప్రజలకు మధ్య ఉండే ఈ ఆర్థికాంశాలను, పాలకుల నిర్లక్ష్యాన్ని, దోపిడీ విధానాన్ని రావిశాస్త్రి ఈ కథలో అద్భుతంగా వివరించారు. సూరసేనుడు.. తనకు, సైన్యానికి, ప్రజల బాగోగులకు, పాలనా యంత్రాంగానికి ఖర్చులు అవసరం కాబట్టి అందుకు మొదట ప్రజలపై పదోవంతు పన్ను వేస్తాడు. స్నేహితులకీ, బంధువులకీ, దన్నుదారులకీ, జ్ఞాతులకీ కొంత ధనం ఇచ్చి వ్యాపారాలు చేసుకునేలా ఏర్పాటు చేస్తాడు. కానీ వ్యాపారస్తులకు నష్టం వచ్చినప్పుడు, అధిక లాభాలకోసం, విలాసాలు, వినోదాలకోసం, గుళ్లు ధర్మసత్రాలు కట్టించడానికి, రాజుకు సహాయం చేయడానికీ డబ్బు అవసరం కావడంతో రాజు రెండోసారి ప్రజల మీద పాతిక శాతం పన్ను విధిస్తాడు. దాంతో మూలధనం పెంచుకొని, లాభాలు అధికంగా ఆర్జిస్తూ పన్నులు పెంచి వ్యాపారులూ లాభపడుతుంటారు. రాజ్యంలోని ప్రజలలో బాగా కలిగిన వాళ్లు ఈ పన్నుల భారాన్ని కొంత సహిస్తారు. కానీ చిన్న కుటుంబాల వాళ్లు, చిన్న వ్యవసాయదారులు మాత్రం ఇబ్బందులు

పడతుంటారు. ఇక కూలీనాలి చేసుకుని జీవించే, బీదాబిక్కి సంగతి మరీ దారుణంగా మారుతుంది.

ఆర్థికవ్యవస్థ సక్రమంగా సాగడం వేరు, లాభాలకోసం వ్యాపారులు, రాజు కలిసి అధికపన్నులు విధించి ప్రజలను అమితంగా దోచుకోవడం వేరు. అతి తక్కువమంది, పాలకుల అండదండలతో వ్యాపారాలు చేస్తూ దేశ సంపదను కూడా దోచుకుంటూ ... వాళ్లు మాత్రం గౌరవం, హోదాలతో, ధనం సంపాదిస్తూ, విందులు వినోదాలలో మునిగి తేలడం వేరు. ఇదే విషయాన్ని రావిశాస్త్రి ఒక్క వాక్యంలో రాస్తారు. అది 'నేటి కాలానికి వర్తిస్తుంది, మేజిక్ రియలిజం కథన పద్ధతినీ చూపిస్తుంది. 'ఆ కాలంలో మగధదేశంలో, ఈ రోజుల్లో భారతదేశంలో లాగే నిరక్షరాస్యులు ఎక్కువ సంఖ్యలో ఉండేవారు. అజ్ఞానం ప్రజల్లో ఎక్కువగా ఉండేది.' ఈ వాక్యం ద్వారా నేటి భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, వ్యాపారుల తీరు, పాలకులకూ, వ్యాపారస్థులకూ మధ్య ఉన్న సంబంధాలు... అన్నీ మనకు నిగూఢంగా బోధపడతాయి. రచయిత దృష్టిలో నిరక్షరాస్యత అంటే చదువులేకపోవడమే కాదు, అజ్ఞానం అంటే జ్ఞానం లేకపోవడమే కాదు. వాస్తవాన్ని తెలుసుకోలేకపోవడం, తెలిసినా పట్టించుకోకపోవడం.

విప్లవం – అణచివేత:

అణచివేత, దోపిడి నుంచే చైతన్యం వస్తుంది. ఆ చైతన్యమే తిరుగుబాటుగా మారి, విప్లవ రూపాన్ని సంతరించుకుంటుంది. ప్రజల్లో చైతన్యం రగిలించి, వారిని ఉద్యమం వైపు నడిపేది నాయకులు. విప్లవం అనే పదం లాటిన్ పదమైన (REVOLUTION) నుంచి వచ్చింది. విప్లవం అంటే 'తిరగబడడం' అని అర్థం. అధికారంలో లేదా సంస్థాగత నిర్మాణంలో కొంత సమయంలో తెచ్చే మౌలికమైన మార్పునే విప్లవం అంటారు. అరిస్టాటిల్ దీనిని రెండు రకాలుగా చూడాలన్నాడు. 1.రాజ్య స్వభావం పూర్తిగా మారడం. 2. ప్రస్తుతం ఉన్న వ్యవస్థలో మౌలికమైన మార్పులు తీసుకురావడం.

'వేతనశర్మకథ'లో మార్కండేయుడనే ఋషి మగధరాజు, అతని అనుయాయులు ప్రజలను పీడించి దోచుకుతినడం చూసి 'రాజునీ, అనుయాయుల్నీ పారదోలండి! మీ రాజ్యం మీరేలుకొండి! ఇది భగవదాదేశం' అని ప్రజలకి బోధించడం మొదలుపెడతాడు. దాంతో ప్రజానీకం రాజవర్గం మీద తిరుగుబాటు చేస్తుంది. ఆ తిరుగుబాటులో ఉద్యోగస్థులు, ప్రజలు అందరూ పాల్గొంటారు. ప్రజలు లేవనెత్తిన తిరుగుబాటును రాజు తట్టుకోలేక, వారి నాయకుడైన మార్కండేయ మహర్షిని అంతమొందించడానికి కుట్ర పన్ని, కామవాంఛకు లోనైన మార్కండేయ మహర్షి రాణివాసపు దాసిమనిషి చెల్లెల్ని చెరిచాడని అభియోగం మోపి, చిత్రహింసలు పెట్టి చంపిస్తాడు. ఆ తర్వాత తిరుగుబాటుదారులందర్నీ విచారణ అవసరం లేకుండానే హింసించి చంపమని సైన్యానికి ఆజ్ఞ జారీ చేస్తాడు. దాంతో సైనికుల ఆగడాలకు ఆ నేలంతా నెత్తురుమయం అవుతుంది. రాజుగారి కత్తులకు భగవంతుడు కూడా భయపడతాడు.

కథలో మార్కండేయ మహర్షి నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నిస్తూ, ప్రజల పక్షాన నిలబడి, వారిని పోరాటం వైపు కదిలిస్తున్న వారికి ప్రతీక. స్వాతంత్ర్యం వచ్చాక కూడా పాలకులు స్వలాభం కోసం, అధికారం కోసం చేస్తున్న దోపిడీ గురించి ప్రజలకు తెలియజేసి, వారిలో చైతన్యం తీసుకొస్తున్నారు వివిధ ప్రజాసంఘాలు, ఉద్యమాల నాయకులు. అలాంటి వాళ్లు హత్యలకు గురికావడం, పలు కేసుల్లో బందీలవడం మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. ఇలా వర్తమాన సమాజానికి ముడిపెట్టి ఈ కథను అర్థం చేసుకున్నప్పుడే రావిశాస్త్రి ఎన్నుకున్న వస్తువుకు, కథన పద్ధతికి మధ్య ఉన్న సంక్లిష్టత, సరళం అవుతుంది. రచయిత ఉద్దేశ్యం బోధపడుతుంది.

ఉద్యోగులు – స్వలాభాలు:

పరిపాలన సక్రమంగా జరగాలంటే పాలనాయంత్రాంగం అవసరం. పాలన వివిధ స్థాయిల్లో అనేక మంది ఉద్యోగస్థులతో సాగుతూ ఉంటుంది. ముఖ్యంగా పాలకులకు, ప్రజలకు మధ్య ఉండే పన్నులు వసూలు చేసే ఉద్యోగులు ఏ వ్యవస్థలో అయినా కీలక పాత్ర పోషిస్తూ ఉంటారు. ఈ కథలోని మగధరాజ్యంలో పల్లెసీమల్లో పన్నులు వసూలు చేసి, లెక్కలు రాసి, భటుల ద్వారా ఆ సొమ్మును రాజధానికి పంపించే యంత్రాంగంలో కీలక పాత్ర పోషించేవాళ్లు కరణాలు. జీతాలు తక్కువగా ఉండడంతో మార్కండేయ మహర్షి ప్రారంభించిన తిరుగుబాటులో వాళ్లూ పాల్గొంటారు.

మార్కండేయ మహర్షి చనిపోయిన తర్వాత రాజుగారి సైన్యం తిరుగుబాటుకు కారణమైన అందరితో పాటూ కరణాలను వేటాడుతుంది. చదువుకున్న వాళ్లకు బాగా బుద్ధి చెప్పాలనే ఉద్దేశంతో రాజు వీళ్లను ఎక్కువగా హింసించమంటాడు. ఆ హింసను భరించలేక కరణాలకు నాయకుడైన వేతనశర్మ తనకు తాను ఆత్మవిమర్శ చేసుకొని, కరణాలందరిని సమావేశ పరిచి 'మార్కండేయ మహర్షి' దోపిడీదారులను అణచివేస్తే లేదా హతమార్చితే ప్రజలు బాగుపడతారని చెప్పారు. అయితే తిరుగుబాటుదార్లని మన రాజవర్గం నిర్దాక్షిణ్యంగా, విచారణ కూడా జరపకుండా క్రూరంగా బీభత్సంగా నరికిపారేసి అణచిపారేస్తుంది. దీని గురించి మనం చాటుగా కూర్చొని ఆలోచించాలి. ఈ దోపిడి వల్ల మనకు ఏం నష్టం ఉంది? ఈ దోపిడి నశిస్తే మనకి ఏం లాభం చేకూరుతుంది? మనం కరణాలం, మహారాజుగారు చేసే దోపిడీకి సహాయపడుతూ దోపిడీని దగ్గరుండి రాజుగారికి చేయించి పెడుతున్నాం. అంటే, మనం దోపిడీకి సహాయం చేస్తున్నాం అన్నమాట. అలా సహాయం చేస్తే మనకి మహారాజువారు ఇచ్చేదేమిటి జీతం. రాజుగారు మనకు సరైన జీతాలు ఇవ్వకపోవడం వల్ల మనం తిరుగుబాటులో చేరాం. ప్రస్తుత సమాజంలో మనకి వేతనాలు పెరిగి, కొన్ని సదుపాయాలు కలిగించినట్లయితే ఏ ఇబ్బంది ఉండదు. ప్రజారాజ్యం వచ్చినా మనకు వేతనాలు పెరగవచ్చు, సదుపాయాలు కలగవచ్చు. అప్పుడైనా మనకు దక్కేది అంతేకదా!. ఆపాటిదానికి మనం తిరుగుబాటులో చేరడం ఎందుకు చిత్రహింసలకి పాలవడం ఎందుకు? రాజుల్నీ, రాజ్యాంగాల్నీ మారుస్తాం అంటే ప్రభువర్గం ఒప్పుకోదు. వాళ్లు లక్షలు దోపిడీ చేస్తున్నారు. ఇప్పుడు వారు మనకి పిడికెడు గింజలే ఇస్తున్నారు. మనం మరో నాలుగు పిడికెళ్లు అడుగుదాం. మనకి వేతనాలు పెరిగితే రాజులూ మారనవసరం లేదు. రాజ్యాంగమూ మారనవసరం లేదు అని తోటి కరణాలకు నచ్చచెప్పి, ఒప్పిస్తాడు.

రాజవర్గంతో సంప్రదింపులు జరిపి సఫలం అయ్యేలా చేస్తాడు.

దాంతో కరణాలకీ, సుంకర్లకీ, బారికలకీ, భటులకీ అందరికీ చిటికెడు చిటికెడు చొప్పున జీతాలు పెరుగుతాయి. కొందరికి మాన్యాలు లభిస్తాయి. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలే కాకుండా, ప్రజల నుంచి పారితోషికాలు పొందే హక్కు కూడా ఆనాటి నుంచి అమల్లోకి వస్తుంది. అలా వేతనశర్మ ఘనవిజయం సాధించి విప్లవానికే వెన్నుపోటు పొడుస్తాడు. ప్రభుత్వ ఉద్యోగులందరికీ మొట్టమొదటి పీఠాధిపతి అవుతాడు. ఇలా నేడు ప్రజాపక్షం వహించాల్సిన మేధావులూ, కళాకారులు, ఉన్నతోద్యోగులు పాలకపక్షం వహించడం వెనకున్న రహస్యాన్ని, కుట్రను రావిశాస్త్రి బట్టబయలు చేసి చూపించాడు.

వర్తమాన సమాజం:

రావిశాస్త్రి కథను ముగిస్తూ 'గాయపడిన ఉద్యమం అలసట తీర్చుకొని మరునాడెప్పుడో చిచ్చుగా మరడానికి వీలుగా అడవుల్లో తలదాచుకుంది'. అంటారు. ఇంకా 'ప్రభువర్గం, వ్యాపారవర్గం కలిసిపోయి ప్రభువులు ధన, కనక, వస్తు, వాహనాలతో తులతూగుతుంటారు. వేతనశర్మలాంటి కార్మికనాయకులు కేవలం జీతాల పెంపుకోసమే సమ్మెలు చేస్తుంటారు. సమసమాజం కోసం ప్రభువులు విప్లవాలు వద్దంటారు. ప్రభుత్వోద్యోగులు దానికి వంతపాడతారు' అంటారు రచయిత. ప్రభుత్వం, ఉద్యోగులు కలిసిపోయి ప్రజల మేలుకోసం పనిచేసే వాళ్లను అణిచివేస్తున్న స్థితిని ఈ వాక్యాల ద్వారా సూచించారు. మరోవైపు విప్లవోద్యమాన్ని సమర్థిస్తున్న ఈ కథ 'ఉద్యమం అడవుల్లో తలదాచుకుంది' అని చెప్పడం కూడా గమనించాల్సిన విషయమే. మైదానాల్లో కాకుండా నేటికీ విప్లవకారులు అడవుల్లోనే ఉంటున్నారు. నేటికీ ప్రజాసమస్యల కోసం, వ్యవస్థ మార్పుకోసం తుపాకితో పోరాడే వాళ్లను ప్రభుత్వం అనేక పేర్లతో హత్యలు చేస్తూనే ఉంది. ఈ కథ ఆంధ్రజ్యోతి వారపత్రికలో మే 18, 1971లో ముద్రితమైంది. అంటే ఇప్పటికి సుమారు యాభై రెండేళ్ల క్రితం అన్నమాట. కానీ నేటికీ కథలోని పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి.

కథన శిల్పం:

'వేతనశర్మ కథ' రావిశాస్త్రి శిల్ప నైపుణ్యానికి ప్రతీక. 'రావిశాస్త్రి రచనా శిల్పం విలక్షణం. కథా శిల్పంలో ఆయన పోయినన్ని పోకడలూ, చేసినన్ని ప్రయోగాలు ఎవరూ చేయలేదు. ఉత్తరాంధ్ర మాండలికానికి పెద్దపీట వేశారు. మెరుపుల్లాంటి చిన్న వాక్యాలు రాయడం, ఒక్కోవాక్యాన్ని ఒక్కో పేరాగా రాయడం రావిశాస్త్రి ప్రారంభించిన పద్ధతే. కథనంలోనూ, కథా వస్తువును దర్శించడంలోనూ కవిత్వానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన వర్ణనలు, ఉపమాలంకార వైవిధ్యం పాఠకుల్ని అమితంగా ఆకర్షిస్తాయి. ఆయనది ఆలంకారిక శైలి. కథల్లో, నవలల్లో చమత్కారాలు కొల్లలుగా గుప్పించారు. తాను నమ్మిన మార్క్సిస్టు భావజాలాన్ని కళాత్మక రీతిలో ప్రకటించారు. రావిశాస్త్రి భావాలతో మౌలికంగా విభేదించిన వారూ ఆయన రచనల్ని అభిమానిస్తారు. ఆయన రచనా శిల్పంలోని సమ్మోహకశక్తి దానికి కారణం (https://www.eenadu.net/telugu-news/vyakyanam/general/) ఈ కథలో రావిశాస్త్రి రాజరిక వ్యవస్థాగతంగా కథను నడుపుతూ మేజిక్ రియలిజంతో వర్తమాన భారతదేశ స్థితిని అంతర్లీనం చేశారు.

కథనంలో శ్రవ్య, దృశ్య పద్ధతులు రెండూ ముఖ్యమైనవే. ఏ పద్ధతిని ఎన్నుకోవాలో, ఏ వస్తువుకు ఏ పద్ధతి సరైనదో అన్నది రచయిత ప్రతిభ, జ్ఞానం మీద ఆధారపడి ఉంటుంది. రావిశాస్త్రి కథంతా శ్రవ్యపద్ధతిలో పాఠకులతో నేరుగా చెప్తున్నట్లే రాశారు. వ్యవహారిక శైలిలో, సుదీర్ఘ వాక్యాలతో మొదలై చిన్నచిన్న వాక్యాలతో ముగుస్తుంది. అంటే కథలో వాక్య నిర్మాణశైలి మారుతూ ఉంటుందన్నమాట.

మొదట్లో 'ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్ములో, పరిపాలనా యంత్రాంగపు ఖర్చులుపోను ప్రజలకు సత్రవులు, వైద్యశాలలు మొదలైనవాటి ఖర్చులుపోను, సైన్యం ఖర్చులు పోను, రాణివాసపు ఖర్చులుపోను, విలాసాల ఖర్చులు పోను, మూలధనం కింద ఏర్పాటుగా కొంతపోను, మిగతా సొమ్ముతో ఆ సుందరసేను మహీపతి కొన్ని కొన్ని దినుసులతో, వస్తువులతో లాభసాటిగా తను వ్యాపారం చేసుకోవడమే కాక, తన బంధువులకీ, స్నేహితులకీ, జ్ఞాతులకీ, ధన్నుదారులకీ చాలామందికి ధర్మవడ్డీకి బదుళ్లు ఇచ్చి, వారి వ్యాపారానికి సాయపడుతూ ఉండేవాడు.' ఈ సుదీర్ఘ సంక్లిష్ట వాక్యం వెనుక ఆర్థికపరమైన లంకె కనిపిస్తుంది. రాజు పన్నుల వసూల నుంచి వచ్చిన ధనాన్ని ఖర్చుపెట్టే విధానం ఉంది. మరో సుదీర్ఘ వాక్యంలో వ్యాపారులు పన్నులు పెంచడానికి ఏ విధంగా కారకులు అవుతారో చెప్పారు.

ముగింపుకు వచ్చేసరికి 'ఎక్కువ జీతాలకోసం సమ్మెలే తప్ప. సమసమాజం కోసం విప్లవాలు వద్దంటారు ప్రభువులు, అవునంటారు ప్రభుత్వోద్యోగులు' ఇలా వాక్యశైలిలో కథా వస్తువుకు అనుకూలంగా మార్పు చేశారు రచయిత. కవిత్వ వచనానికి, రావిశాస్త్రి వాక్యానికి చాలా దగ్గర పోలికలు ఉన్నట్లు పరిశోధకులు, విమర్శకులు చెప్తారు. త్రిపురనేని శ్రీనివాస్ కవిత్వ ప్రచురణల్లో భాగంగా 10వ పుస్తకాన్ని 1991 జనవరిలో రావిశాస్త్రి కవిత్వాన్ని 'ఎన్నెలో ఎన్నెల' పేరుతో తీసుకొచ్చారు. అసలు రావిశాస్త్రే తన శిల్పం గురించి చెప్తూ నివాస్తవానికి నేను కథగా చెప్పే ఇతివృత్తం ఏ విధంగా చెప్తే బాగుంటుందోనని కొంచెం ఆలోచిస్తాను. కానీ దాని గురించి తన్నుకు చావను. ఆ విధంగా తెలిస్తే ఆ కథ సరిగా వస్తుంది' అన్నారు. అలాగే మరో చోట చెప్తూ 'ప్రాథమిక రచనలలో శైలీ స్పృహ లేదు. అల్పజీవితో పేరు వచ్చిన దగ్గర నుండి శైలి స్పృహ వచ్చింది' అని ఒకచోట రాసుకున్నారు. రావిశాస్త్రి శైలిలో కొంత చైతన్య స్రవంతి, అధివాస్తవిక శైలులు ఉన్నట్లు విమర్శకులు గుర్తించారు. (శిఖామణి. విశాలాంధ్ర దినపత్రిక, ఆగస్టు 29, 2022)

చిన్నకథైన ఈ 'వేతనశర్మ' కథలో మార్క్సిజం సిద్ధాంతాన్ని, లక్ష్యాన్ని, విప్లవాన్ని, మ్యాజిక్ రియలిజం కథనంలో చెప్పారు రావిశాస్త్రి. కర్షకులు, కార్మికులు విప్లవంలో ప్రధాన భూమిక వహిస్తారని అన్నారు. విప్లవాలు అణచివేయడానికి పాలకులు వేసే ఎత్తుగడలు ఎలా ఉంటాయో, విప్లవ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి, వాళ్లను ఎలా చంపుతారో మార్కండేయ మహర్షిద్వారా వివరించారు. అలాగే ఉద్యోగులు పాలకవర్గం కొమ్ముకాస్తూ, స్వలాభం కోసం విప్లవాలకు ఎలా వెన్నుపోటు పొడుస్తారో వేతనశర్మ మాటతీరు, ప్రవర్తనలో చూపించారు. రాజరిక వ్యవస్థ నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఈ కథ సమకాలీన పరిస్థితులకూ అన్వయిస్తుంది అనడంలో ఏ మాత్రం అనుమానం లేదు.

రావిశాస్త్రీ 'రత్తాలు - రాంబాబు' నవలపై వచ్చిన విమర్శకు
తరువాయి....47వ పుటలో

విద్య

నల్లపనేని విజయలక్ష్మి
9701667350

తెలుగుకు పాతర వేస్తున్న విద్యా విధానాలు

తెలుగు భాష సమీప భవిష్యత్తులో మృతభాషగా మారే ముప్పు పొంచి ఉంది. దీనిని ప్రజలు గాని, ప్రభుత్వాలు గాని పట్టించుకోవడం లేదు. తెలుగు భాషా దినోత్సవాన్ని వేడుకగా మరొకమారు జరుపుకోనున్న తరుణంలో తెలుగు భాష భవిష్యత్తును గురించి భాషాభిమానులు ఆలోచించక తప్పదు. ప్రజలు ఎప్పుడూ జీవనోపాధి అవకాశాలను కోరుకుంటారు. మాతృభాష మీద అభిమానం ఉన్నా ఆ భాష వల్ల బతుకుతెరువు లేదని భావించినపుడు అయిష్టంగానే దానికి దూరమౌతారు. అటువంటి నిస్సహాయస్థితికి ప్రజలు గురి కాకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వాలది. కాని మన రాష్ట్రంలో ప్రభుత్వాలు ఆ బాధ్యతకు దూరంగా ఉంటున్నాయి. ఒక జాతిగా మన అస్తిత్వానికి, మన ఉనికికి కారణమైన తెలుగు భాషను గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేసింది. పాఠశాలల్లో, కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమం చదువును తప్పనిసరి చేయడం వల్ల నిజంగా విద్యార్థులకు మేలు జరిగే అవకాశం ఉన్నదా? ఇంట్లో తెలుగు మాత్రమే మాట్లాడే తల్లిదండ్రులున్న కుటుంబాలలోని పిల్లలు ఆంగ్ల మాధ్యమంలో చదవలేక అసలు చదువే మానుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి. కళాశాల స్థాయిలో తెలుగు మాధ్యమంలోని కోర్సులను పూర్తిగా ఎత్తివేయడం వల్ల కూడా ఇదే పరిస్థితి. అప్పటివరకు తెలుగు మాధ్యమంలో చదువుకొని ఒక్కసారిగా ఆంగ్ల మాధ్యమానికి మారలేక అసలు చదువే మానుకొంటున్న వారు ఉన్నారు.

ఇంటర్ మీడియట్ లో ద్వితీయ భాషగా సంస్కృతాన్ని ప్రైవేటు కళాశాలలు ప్రోత్సహించడం వెనుక తక్కువ సిలబస్ చదివి, ఎక్కువ మార్కులు తెచ్చుకొనే అవకాశం ఉండడం ఒక కారణమన్న విషయం అందరికీ తెలిసిందే. తమ పిల్లలు ఇంజనీర్లో, డాక్టర్లో కావాలనుకొనే తల్లిదండ్రులు, తమ కలలను ప్రైవేటు కళాశాలలు మాత్రమే నెరవేర్చగలవని నమ్ముతున్నారు. వారిలో ఎంతోమందికి కనీసం ద్వితీయ భాషగా నైనా తమ పిల్లల చేత తెలుగు చదివించాలని ఉన్నా, ఆయా కళాశాలల్లో అలా ఎంచుకొనే అవకాశం ఉండడం లేదు. ఆ విధంగా విద్యార్థులు ఇంటర్ మీడియట్ లో తెలుగుకు దూరమౌతున్నారు.

డిగ్రీ కళాశాలల్లో ప్రభుత్వం కేవలం ఆంగ్ల మాధ్యమంలోనే చదువుకొనే అవకాశం విద్యార్థులకు కల్పిస్తున్నది. ఇంతకుముందు ద్వితీయభాషగా నాలుగు సెమిస్టర్ లలో తెలుగు చదువుకొనే అవకాశం ఉండగా ప్రస్తుతం దానిని రెండు సెమిస్టర్లకు కుదించారు. నూతన విద్యావిధానాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ మార్పులు చేసినట్లుగా అధికారులు చెపుతున్నారు. మరి ఇదే విద్యావిధానం పక్క రాష్ట్రమైన తెలంగాణలో అమలులో లేదా? వారు ఏ విధంగా తెలుగు భాషను పరిరక్షించుకుంటున్నారు? డిగ్రీ మూడు సంవత్సరాల్లో ఆరు సెమిస్టర్లలో తెలుగు చదువుకొనే అవకాశం అక్కడ లభిస్తున్నది. క్రమంగా ప్రాథమిక విద్య నుండి, ఉన్నత విద్య నుండి ఈ విధంగా తెలుగును తొలగించడం వల్ల కొంత కాలానికి తెలుగు మాట్లాడే భాషగా కూడా లేకుండా పోయే అవకాశం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది.

డిగ్రీలో రెండు సెమిస్టర్లలో మాత్రమే తెలుగు చదువుతున్న విద్యార్థులు క్రమంగా తెలుగు భాష, సాహిత్యాలకు దూరమౌతున్నారు. నూతన విద్యావిధానానికి అనుగుణంగా తెలుగు (మేజర్) గా తీసుకొని చదువుకొనే అవకాశం కల్పిస్తున్నాం కదా అని ప్రభుత్వం అనవచ్చు. పూర్వం తెలుగు (ఎస్.హెచ్.టి) చదివినవారికి సోషియాలజీ, చరిత్ర, తెలుగు– ఈ మూడు విషయాల మీద సమానంగా పట్టు సంపాదించేవారు. అందువల్ల ఈ మూడింటిలో దేనినైనా ఎంచుకొని మాస్టర్స్ డిగ్రీ చేయటానికి అవకాశం ఉండేది. అందువల్ల మితంగానే అయినా విద్యార్థులు తెలుగు (ఎస్.హెచ్.టి) ఎంచుకునేవారు. ఇప్పుడు ఒకసారి డిగ్రీలో తెలుగు (మేజర్) తీసుకుంటే పూర్తిగా తెలుగు మాత్రమే చదువుతారు. మరొక విషయాన్ని మైనర్ పేపరుగా మితంగానే నేర్చుకొనే అవకాశం ఉంది. కేవలం తెలుగు చదవటం వల్ల ఉద్యోగావకాశాలు ఉండవనే అభిప్రాయం బలంగా ఏర్పడటం వల్ల విద్యార్థులు తెలుగు (మేజర్) తీసుకొని చదవటానికి ఇష్టపడటం లేదు. చివరికి తెలుగు అధ్యాపకులు కూడా తెలుగు (మేజర్) చదివేలా విద్యార్థులను ప్రోత్సహించటానికి భయపడుతున్నారు. కళ్ళముందే తెలుగు ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా పనిచేసే అవకాశాలు అదృశ్యమవుతున్న తీరును గమనిస్తున్న వారు ఎలా విద్యార్థులను ప్రోత్సహించగలరు?

నూతన విద్యావిధానం 2020 లో ఉన్న అనేక అంశాలలో పిల్లలు తమ జీవితంలో నీతివంతమైన/నైతికవరమైన పద్ధతులను అనుసరించేందుకు, నైతిక విషయాలను బహు కోణాల్లో తార్కికంగా విశ్లేషించేందుకు, అన్ని పనుల్లో నైతిక విలువలను పాటించేందుకు ఉపయోగపడే వృత్తాంతాలను బోధించాలి అన్న అంశం కూడా ప్రత్యేకంగా చేర్చబడింది. ఈ ప్రాథమిక నైతిక విశ్లేషణ, సంప్రదాయిక భారతీయ విలువలు, అన్ని ప్రాథమిక రాజ్యాంగ విలువలు (సేవ, అహింస, స్వచ్ఛత, సత్యం, నిష్కామ కర్మ, శాంతి, త్యాగం, సహనం, వైవిధ్యత, సత్ప్రవర్తన, లింగ స్పృహ, పెద్దల పట్ల గౌరవం, అందరికీ మర్యాద, పర్యావరణం పట్ల గౌరవం, క్షమాగుణం, దేశభక్తి ప్రజాస్వామిక దృక్పథం, సమైక్యత, బాధ్యత, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం) విద్యార్థులలో పెంపొందించాలని నిర్దేశించబడింది. ఈ అంశాలను విద్యార్థులకు బోధించగలిగింది సాహిత్యమే కదా! ఈ బాధ్యతను ఇంతకాలంగా నిర్వర్తిస్తూ వస్తున్న తెలుగు సాహిత్యాన్ని చదువుకోవటం వల్ల ఏ ప్రయోజనం లేదా? వేల సంవత్సరాలుగా తెలుగు సాహిత్యం చేసిందేమిటి? మనిషి మనిషిగా ఉండటానికి అవసరమైన మానవీయ, నైతిక, ఆధ్యాత్మిక విలువలను సమాజానికి అందించింది. తెలుగు భాష ఇచ్చిందేమిటి? పట్టుదలతో శ్రమించే తత్వం, ఆత్మవిశ్వాసం గల జాతికి అస్తిత్వాన్ని ఇచ్చింది. అటువంటి భాషా సాహిత్యాలకు ముగింపు పలకటం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదా?

తరువాయి....48వ పుటలో

వైభవంగా ముగిసిన ఆరవ ప్రపంచ తెలుగు మహాసభలు



ఆరవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల ప్రారంభోత్సవ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

విజయవాడ: **"అమ్మభాషను కాపాడుకుందాం! ఆత్మాభిమానం పెంచుకుందాం!!"** అనే నినాదంతో నిర్వహించిన 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ఘనంగా ముగిశాయి. డిసెంబర్ 28, 2024 (శనివారం) ఉదయం 10:30 గంటలకు మహాసభలను జస్టిస్ నూతలపాటి వెంకట రమణ, సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి, చేతులమీదుగా కాకరపర్తి భావనారాయణ కళాశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు సభాప్రాంగణాన, చెరుకూరి రామోజీరావు సభావేదికపై ప్రారంభంకాగా, శ్రీమతి శైలజాకిరణ్, మార్గదర్శి మేనేజింగ్ డైరెక్టర్, జ్యోతి ప్రజ్వలన కావించటంతో రెండురోజులపాటు వైభవంగా నిర్వహించబడ్డాయి. శ్రీ కనుమూరు రఘురామ కృష్ణంరాజు, ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి, విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ మహాసభలకు శ్రీ మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షత వహించగా గౌరవ కార్యనిర్వాహక అధ్యక్షులు, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ స్వాగతవచనాలు పలికారు. జస్టిస్ నూతలపాటి వెంకట రమణ, సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి ప్రారంభోపన్యాసం చేశారు.

ఈ ప్రారంభ సభలో 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల సందర్భంగా ప్రచురించిన "మార్పు" గ్రంథాన్ని విజయవాడ (ప.) శాసనసభ్యులు, శ్రీ యలమంచిలి సత్యనారాయణ (సుజనాచౌదరి) ఆవిష్కరించారు. ఈ మహాసభలకు శ్రీ కేశినేని శివనాథ్ (చిన్ని), లోకసభ సభ్యులు, విజయవాడ, శ్రీ కె. గోపీనాథ్, లోకసభ సభ్యులు, హొసూరు, శ్రీ సజ్జా కిషోర్ బాబు, పవర్ మెక్ ప్రాజెక్ట్స్, హైదరాబాద్ సహా పలువురు పార్లమెంటు, శాసనసభ సభ్యులు హాజరయ్యారు. ప్రముఖ సాహితీ, సినీ గేయ రచయితలు పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్, తెలంగాణ శాసనమండలి సభ్యులు గోరటి వెంకన్న, సినీ గేయకవులు జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, సుద్దాల అశోక్ తేజ, భువనచంద్ర తదితరులు మహాసభల్లో పాల్గొని తమ ప్రసంగాలు అందించారు.

ఈ మహాసభలలో తెలుగు రచయితల కృషిని గౌరవించడం, భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రోత్సహించడం లక్ష్యంగా పలు కీలక అంశాలపై చర్చలు జరిగాయి. ప్రపంచ తెలుగు రచయితల మహాసభల అధ్యక్షుడు శ్రీ గుత్తికొండ సుబ్బారావు ఆహ్వాన వచనాలను పలుకగా, ప్రధాన కార్యదర్శి డా. జి. వి. పూర్ణచందు మహాసభల లక్ష్యాన్ని వివరించారు.

తెలుగు భాషాభిమానులూ సాహితీ ప్రియులూ కవులూ రచయితలూ ఈ మహాసభలకు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కవులూ రచయితలూ పరిశోధకులూ అధ్యాపకులూ దాదాపు 800 మందికి పైగా రెండు రోజులపాటు జరిగిన ఆరు వేదికలపై 30 సదస్సులూ పరిశోధక విద్యార్థుల శిక్షణాశిబిరాలతో యువకవుల సమ్మేళనాలతో మహాసభలు విజయవంతంగా నిర్వహించారు.

భారత సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి శ్రీ నూతలపాటి వెంకటరమణ గారి ప్రసంగపాఠం



కృష్ణా జిల్లా, తేదీ 28, 29, డిసెంబరు 2024 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల సందర్భంగా భారత సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి శ్రీ నూతలపాటి వెంకటరమణ గారి ప్రసంగపాఠం

6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభకు ప్రపంచ వ్యాప్తంగా నాలుగు చెరగుల నుండి "తెలుగు భాషను కాపాడుకుందాం! ఆత్మాభిమానం పెంచుకుందాం, అనే నినాదంతో ఆత్మ విశ్వాసం, గౌరవంతో, ఐక్యతను చాటడానికి అనేక వ్యయప్రయాసలను ఓర్చి విచ్చేసిన తెలుగు భాషాభిమానులకూ, కవులకూ, రచయితలకూ, పండితులకూ, సోదర సోదరీమణులకూ నా హృదయపూర్వక స్వాగతం.

తెలుగు జాతి, సంస్కృతి, భాష, చరిత్రల కీర్తి పతాకను విశ్వ వినువీధుల్లో ఎగరవేస్తూ, నిస్వార్థంగా భాష పట్ల అంకితభావంతో, ప్రభుత్వ సహాయం లేకుండా ఈ సభలను నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు రచయితల సంఘం, కృష్ణ జిల్లా రచయితల సంఘంవారికి ఒక తెలుగు బిడ్డగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఈ మహోద్యమానికి మద్ధతిస్తున్న తెలుగు ప్రజలకి నా అభివందనం. తెలుగు సాహిత్యం గురించి నాకన్నా అనర్గళంగా గంటల తరబడి మాట్లాడగల మహామహులు ఎందరో ఇక్కడ కనిపిస్తున్నారు. అయినా ఈ ఆరవ ప్రపంచ తెలుగు రచయితల సభల ఆవిష్కరణకు నన్ను ఆహ్వానించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు.

తెలుగు జాతి అంటే మద్రాసీయులు కాదని, తెలుగు రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు సభా ప్రాంగణములో, తెలుగుతల్లి ముద్దుబిడ్డ, విలువలు కలిగిన పత్రికా సామ్రాజ్య నిర్మాతగా, ఆదర్శప్రాయ జీవితం గడిపి తుది శ్వాస వరకు తెలుగుభాష, సాంప్రదాయాలను పరిరక్షించుకోవడం కోసం పోరాటం చేసిన యోధుడు చెరుకూరి రామోజీ రావు సభా వేదిక నుంచి మిమ్మల్నందరినీ చూస్తుంటే తెలుగు మహా ప్రపంచం సాక్షాత్కరిస్తోంది.

విశ్వవ్యాప్తంగా ఉన్న మన తెలుగువారు, మన సంస్కృతిని, మన భాషను, చరిత్రను మరిచిపోకుండా పునరుజ్జీవించేలా దేదీప్యమానంగా తెలుగు జాతి కీర్తి ప్రతిష్ఠలు వెలగాలని కోరుకునేవాడిగా, ఈ సందర్భంగా కొన్ని ముఖ్యమైన విషయాలు మీ దృష్టికి తీసుకునివస్తాను.

తెలుగు భాష చరిత్రను చూసుకుంటే, దేశంలో వంద మిలియన్లకు పైగా ప్రజలు తెలుగు భాష మాట్లాడుతారు, దేశంలో అత్యధికంగా మూడవ స్థానంలో, ప్రపంచ వ్యాప్తంగా 13వ స్థానంలో తెలుగు వాడుక భాషగా ఉంది. క్రీ.పూ. నాలుగు వందల సంవత్సరాలకు ముందు నుంచే తెలుగు ఉనికిని భట్టిప్రోలు శాసనాలు రుజువు చేస్తున్నాయి. ఈ పరిణామక్రమంలో తెలుగు లిపి సొంత సుడికారాన్ని పొంది వైభవాన్ని చేకూర్చుకుంది. అనేక కావ్యాలు, పురాణాలు, ఇతిహాసాలు, ప్రబంధాలను దాటి ప్రజల భాషగా మారి, నవల, కథ, కథానిక, పద్యం, గేయం, కవితా రూపాల్లో ప్రజాబాహుళ్యంలో వృద్ధి చెందుతూ వర్ధిల్లుతోంది. తెలుగు భాష పలుకుబడి సంగీతంలా వినసొంపైనది. సామాన్య ప్రజానీకం కూడా కవితా ధోరణిలో మాట్లాడగల ఒక అందమైన భాష 'తెలుగు'. ఇంత అద్భుతమైన ఈ మన తల్లి 'తెలుగు భాష'ను వ్యాపార, రాజకీయ ప్రయోజనాలతో వేరొక భాషా సంస్కృతి వచ్చి కొల్లగొట్టడాన్ని మనం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా తెలుగువారు మద్రాస్ ప్రెసిడెన్సీ లో భాగమై ఉండడం వలన మన భాష, సంస్కృతి అణగదొక్కబడ్డాయి. అంతేకాదు స్వాతంత్ర్య సమరంలో తెలుగువారి పాత్రకు, త్యాగాలకు తగినంత గుర్తింపు దక్కలేదు. తెలుగు భాషను వాడుక భాషగా మార్చి ప్రజలకు సాహిత్యం అందించటం కోసం గిడుగు రామూర్తి నుంచి మొదలుకొని గురజాడ, రఘుపతి వెంకటరత్నం నాయుడు, త్రిపురనేని రామస్వామి చౌదరి, కందుకూరి వీరేశలింగం లాంటి మహానుభావులు కాలానికి ఎదురీదారు. ఈనాటికీ వాడుక భాషకు సంబంధించి మనం ఇంకా ప్రజలకు దగ్గర అవ్వలేదని అనిపిస్తోంది. దానికి కారణం స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రత్యేకించి తెలుగు భాష మీద దృష్టి పెట్టలేకపోవడమే. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల ఎదుగుదలకి భాషే పునాదిగా నిలిచింది. ఉదాహరణకు, దక్షిణ కొరియా, జపాన్, చైనా, ఇజ్రాయేల్ తమ మాతృ భాషలలో చదువుకొని

పరిపాలన చేసుకుంటూ సృజనాత్మక శక్తితో సరికొత్త ఆవిష్కరణలు చేసి గొప్ప మేధో సంపత్తి కలిగిన దేశాలుగా ఈనాడు ప్రపంచ దేశాలలో ముందున్నాయి.

ఆ దేశాలు వారి సాంకేతిక విజ్ఞాన్ని తమ భాషలో రాసుకున్నాయి. తమ భాషలలోనే ఆలోచించాయి. తమ భాషలలోనే విజయగీతాలను ఆలపించాయి. అక్కడ మాతృభాష ఉపాధినిచ్చింది, ఆత్మగౌరవాన్ని పెంచింది. వారితో వ్యాపారం చేయటానికి మిగతా ప్రపంచం అంతా ఎగబడుతోంది. ఏ జాతికైనా అంతకు మించిన గౌరవం ఏముంటుంది. మాతృభాష మీద మమకారంతో దాని అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి బంగ్లాదేశ్‌ని ఏర్పాటు చేసుకున్న ప్రజలను చూశాము. ఈ నాటి పాలకులు, ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి.

భాష, జీవితం, మతం, సంసారం, ఆచారం ఈ ఐదింటి కలబోతే మన సంస్కృతి. అదే మన దైనందిన జీవన విధానం. అదే నేటి మన సంస్కృతి. పరాయి దేశ భాష, సంస్కృతి నుంచి మంచి విషయాలను గ్రహించడంలో తప్పేమీ లేదు కానీ గుడ్డిగా అనుసరిస్తే నష్టపోయేది మనమే. ఈ సందర్భముగా మహాత్మాగాంధీ అన్న మాటలు ఇక్కడ నేను గుర్తు చేస్తున్నాను, I like the wind of other cultures to blow through my doors and windows, but I refuse to be blown off from my feet by them.

కొందరు తెలుగు భాషలో చదువుకోవడం వలన గానీ, ఆ భాషను అభివృద్ధి చేయడం వలన గానీ, వెనకబడిపోతామనీ, ప్రపంచ అధునాతన నాగరికతకు దూరమైపోతామనే భయంలో ఉన్నారు. అది వాస్తవానికి సరికాదన్న విషయం మనందరికీ తెలుసు. మాతృభాషలో విద్యను అభ్యసించి గొప్పవారైన ప్రముఖుల గురించి నేను చెప్పనవసరం లేదు. కానీ ఈవేళ పెట్టుబడిదారులను ఆకర్షించి ఉద్యోగాలు సంపాదించాలంటే కేవలం ఇంగ్లీషు భాష వల్లే అది సాధ్యమవుతుందని భ్రమలో ఉన్నారు. ఎందుకంటే పెట్టుబడిదారులకు కావలసింది ఇంగ్లీషులో మాట్లాడే వ్యక్తులనీ, వారే సమర్థవంతంగా ఉద్యోగంగానీ, వ్యాపారంగానీ చేస్తారన్న దురభిప్రాయంలో ఉన్నారు.

వాస్తవానికి మాతృభాషలో చదువుకొని ఉద్యోగం సంపాదించిన వ్యక్తి పరాయి భాషలో ఆలోచించి అభివృద్ధి చెందలేరని అనుకోవడం ఒక భ్రమ మాత్రమే. తెలుగు మాధ్యమంలో చదువుకున్న పిల్లలు ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్ వంటి విదేశీ భాషలను కూడా అనాయాసంగా నేర్చుకుంటున్నారు. మన రాష్ట్రంలో బాల్యంలో తెలుగు మాధ్యమంలో చదివిన ఒక మిత్రుడి కొడుకు హిందీ, ఆంగ్లం, తెలుగుతో సహా 12 భాషల్లో పరిజ్ఞానం సంపాదించాడు. ఇప్పుడు ఐక్యరాజ్య సమితిలో దౌత్యవేత్తగా ఉన్నాడు. అందుకనే గురజాడ అంటారు "నా మాతృభాష సజీవమైన తెలుగు. ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అనిపించుకున్న ఈ తెలుగులో మన సుఖాల్ని, మన దుఃఖాల్ని వెల్లడించుకోవడానికి ఎవరమూ సిగ్గుపడనవసరంలేదు". దీన్ని బట్టి ఆయన తన కాలానికంటే ఎంతో ముందు ఆలోచించారని స్పష్టమౌతోంది.

అంతేకాదు ప్రజాబాహుళ్యం తమ భావాలను వ్యక్తీకరించుకోలేని పరిస్థితిలో పరిపాలన సరిగా జరగదన్న విషయం ప్రభుత్వాలు గుర్తుంచుకోవాలి. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం. భారత రాజ్యాంగానికి బద్ధులై మనదేశాన్నీ, ప్రాంతాన్నీ అభివృద్ధి పరుచుకోవాలన్న ఆలోచన ఉన్న వ్యక్తులమైతే మాతృభాషని పరిపుష్టం చేసి తెలుగు భాష, సంస్కృతులను పదిలపరచినప్పుడే మనం గొప్పవారమవుతామన్న విషయం గుర్తుపెట్టుకోవాలి. జాతి మనుగడకు వికాసానికి ధైర్యంగా వుండటం చాలా అవసరం. భాష లేకపోతే ఏమి ఉన్నా, ఎన్ని ఉన్నా చరిత్ర లేని అనాధలము, అక్షరం లేని అభాగ్యులము. మన సంస్కృతి, భాష చిరకాలం నిలిచి వుండేలా గొప్ప ఆధునిక రచయితలు శ్రీశ్రీ, ఆరుద్ర, విశ్వనాథ సత్యనారాయణ, సి. నారాయణరెడ్డి, జాషువా, కొసరాజు, లాంటి గొప్ప కవులు రచయితలు, సూర్యకాంతం, జమున, సావిత్రి, నాగయ్య, గుమ్మడి, జగ్గయ్య, అక్కినేని నాగేశ్వరరావు, ఎన్.టి. రామారావు, రేలంగి, ఎస్వీరంగారావు, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ఘంటసాల, ఎస్.పీ. బాలసుబ్రహ్మణ్యం లాంటి కళాకారులు, ఇలా ఎందరెందరో దిగ్గజాల ఘనమైన వారసత్వం మనది. ఈ వారసత్వం మరవకండి, మీరు గుర్తుచేసుకోండి. మీ పిల్లలకు తెలియజెప్పండి.

అభివృద్ధిలో సమాజం భాగస్వామ్యం కావాలంటే సంస్కృతి, ఆచార వ్యవహారాల్లో సరిగ్గా అవగాహన ఉన్నప్పుడే అది సాధ్యమవుతుంది. భాష అనేది భావ వ్యక్తీకరణకు ఒక సాధనం. కాబట్టి ప్రస్తుత కర్తవ్యం అభివృద్ధితో పాటు భాషా సంస్కృతులను కూడా రక్షించుకోవాలి. కొందరు భాషాభిమానులైన మంత్రులు, ముఖ్యమంత్రులు ఉన్నప్పుడు మాత్రమే తెలుగు భాషాభివృద్ధిపై కొంత కృషి జరిగింది. ఈ సందర్భంగా ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించిన ఆ నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, విద్యామంత్రి మండలి వెంకటకృష్ణారావు, తెలుగు జాతికి గుర్తింపు తెచ్చి, తెలుగు వారి సంస్కృతికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎన్.టి. రామారావు గార్లను మనం గుర్తించుకోవాలి.

ఈ సందర్భంగా కవులు, రచయితలు, పండితుల పాత్ర గురించి ఆలోచిస్తే వారు చరిత్రకారులుగా ఉండి, దివిటీ పట్టి సమాజాన్ని ఉత్తేజ పరచి, ప్రజాశ్రేయస్సు కోసం రచనలు చేయాలి. మీరు ప్రజాభిమానంతో బ్రతకాలి. చరిత్రలో నిలిచిపోవాలి. ఏ రచన అయితే సమాజానికి శాశ్వతమైన మార్గదర్శనం చేయగలుగుతోందో, ఏ రచన అయితే మానవ సంబంధాల ఆధారంగా, మానవ సంబంధాల చుట్టూ అల్లుకొని, ఎన్ని దశాబ్దాలకైనా మానవ సంబంధాల స్ఫూర్తికి దర్పణం పడుతూ వస్తోందో - దానికి శైలిలో నైపుణ్యం తోడైతే, అదే కదా ఉన్నతమైన, ఉత్తమమైన సాహిత్యంగా నిలిచిపోతుంది! మానవ సంబంధాలు, మానవతా విలువలు, సామాజిక (దేశ) ప్రయోజనాలు ఆధారంగా వచ్చే రచనలే ఎక్కువ కాలం నిలబడతాయి ఉదాహరణకు కన్యాశుల్కం. అంతేగాని ప్రభుత్వం ఇచ్చే అవార్డులు, బహుమతుల గురించి రచనలు చేయవద్దని కోరుతున్నాను.

ఈ సందర్భంగా మహాకవి పోతన రచించిన "బాల రసాల సాల నవ పల్లవ కోమల కావ్యకన్యకన్ గూళలకిచ్చి అప్పడుపు కూడు భుజించుటకన్న..." అంటూ భాగవతాన్ని రాజులకు అంకితమివ్వటానికి నిరాకరించిన సంగతి స్మరించుకోవాలి.

ప్రజలే భాషను రక్షించుకోవాలి. తెలుగు ఉద్యమం ప్రజల కోసమే, ప్రభుత్వ వ్యతిరేకం కాదు. తెలుగు భాష పరిరక్షణ కోసం

ఈ సందర్భముగా రాష్ట్ర ప్రభుత్వం:

1. తక్షణమే తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

2. తెలుగు భాషను అణిచివేయడానికి తీసుకువచ్చిన జి.ఓ.ఎం.ఎస్.నెం.85 ను రద్దు చేయాలి.

3. భారత సర్వోన్నత న్యాయ స్థానము ముందు దాఖలు చేయబడిన ఎస్ఎల్పి(SLP)ని విరమించుకోవాలి.

4. జి.ఓ.ఎం.ఎస్.నెం.40 కింద ఏర్పాటు చేసిన తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలి.

5. మాతృభాషపై తమిళనాడు, కర్ణాటక తరహాలో చర్యలు తీసుకోండి. కూటమి ప్రభుత్వం దీనికి స్పందించి పరిస్థితిని సరిదిద్దుతుందని అనుకుంటున్నాను.

ప్రజా బాహుళ్యంలో మాతృభాషలోనే అన్ని నిర్ణయాలు ఉండాలి. ప్రభుత్వాలు కూడా తెలుగు భాషలోనే ఆదేశాల కాపీలు ఇచ్చే ఆలోచన చేయాలి. తెలుగు భాష వైభవం వల్లే తెలుగు రాష్ట్రాలకు కీర్తి ఉంటుంది. మన ఆచార, వ్యవహారాలు సక్రమంగా అమలు చేయాలి. అభివృద్ధితో పాటు భాషా సంస్కృతిని అలవాటు చేసుకోవాలి.

ఈ మహాసభలు చిరస్థాయిగా నిలిచే ఇతివృత్తాలతో కథలు, కవితలు, వ్యాసాలు, నాటకాలు తదితర రచనలకు మరింత ప్రేరణ, ప్రోత్సాహం అందించేందుకు దోహదపడాలని ఆకాంక్షిస్తున్నాను. తెలుగు రచనలను అన్నీ ప్రపంచ భాషల్లోకి అనువదించబడే స్థాయికి తీసుకెళ్ళేందుకు అవసరమైన లక్షణాలను యువ రచయితలకు మహాసభలు అందిస్తాయని ఆశిస్తున్నాను. ఈ మహాసభలకు అతిథిగా ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు.

చివరిగా శ్రీ శ్రీ గీతాన్ని గుర్తు చేసుకుంటూ...
తెలుగువారి ధీశక్తి, తెలుగువారి క్రియాశక్తి
నలుదెసలా రగిలించాలి, తెలుగుతనం జయించాలి
కోట్లాది తెలుగుజాతి హర్షించాలి, ఆనందం తెలుగునాట వర్షించాలి
తెలుగువాడి తెలుగు 'వాడి' దీపించాలి,
తెలుగునాట తెలుగుపాట వ్యాపించాలి
తమ గమ్యం తెలుగువాళ్ళు చేరాలంటే,
ఈ వేళ నేను కోరేదింతే.

6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో ఆమోదించిన తీర్మానాలు:

6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో తెలుగు భాషాభివృద్ధికై ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాలు సంక్షిప్తంగా ఈ కింది విధంగా ఉన్నాయి: 1.ఇంటి భాషగా తెలుగు: మానవ సంబంధాలు బలపడడానికి ఇంట బయట సామాజిక వ్యవహారాలన్నిటిలో తెలుగును ఉపయోగించాలి. 2. వాడుక భాషగా తెలుగు: అంతరించిపోతున్న వృత్తి మాండలికాలలోని పదాలను రచయితలూ పాత్రికేయులూ ప్రజలూ వాటిని వెలికి తీసి వారి రచనలలో ప్రాచుర్యం కలిగించాలి. 3. ప్రపంచ భాషగా తెలుగు: ప్రపంచ భాషగా తెలుగును తీర్చిదిద్దడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడి భాషను కృత్రిమ మేధా అనువాద ప్రక్రియలకు ఉపయోగించడానికి తెలుగు పద సంపదను ఒకచోటకు చేర్చాలి. 4. విద్యారంగంలో తెలుగు: భారత రాజ్యాంగం 350 నిబంధన ప్రాథమిక విద్యను మాతృభాషలో బోధించాలని పేర్కొంది. 2029 విద్యా హక్కు చట్టం కూడా ప్రాథమిక విద్య ఆపై విద్యలో కూడా సాధ్యమైనంతమేర మాతృభాషలోనే నేర్పించాలని పేర్కొంది. కనీసం ప్రాథమిక విద్య వరకైనా తెలుగులోనే బోధించేందుకు చర్యలు చేపట్టాలి. 5. డిగ్రీ స్థాయిలో అన్ని సెమిస్టర్లలో తెలుగుని తప్పని సరిగా ఒక పాఠ్యాంశంగా బోధించాలి. 6. సాంకేతిక రంగ విద్యలను కూడా మాతృభాషలో బోధించాలని కేంద్రం తలపెట్టిన విధానాన్ని అమలు చేయాలి. 7. గత ప్రభుత్వం తెలుగు భాషను అణచివేయటానికి జారీ చేసిన జీ.ఓ.ఎం.ఎస్. నెం. 85ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కోర్టు కొట్టివేసిన నేపథ్యంలో ఆనాటి రాష్ట్రప్రభుత్వం భారత సర్వోన్నత న్యాయస్థానం ముందు దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటీషన్ వెంటనే ఉపసంహరించి రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్పోరేట్ విద్యాసంస్థల్లో కూడా మాతృభాషలో బోధనను అమలుచేయాలి. 8. తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలలో 5% రిజర్వేషన్ కల్పించాలి. 9. పాలనా భాషగా తెలుగు: ప్రజలకు ప్రభుత్వం చేరువయ్యేందుకు వీలుగా పాలన వ్యవహారాలూ. ఉత్తర ప్రత్యుత్తరాలూ తెలుగులోనే జరిగేలా గట్టి చర్యలు చేపట్టాలి. 10. తెలుగులో న్యాయపాలన: హైకోర్టులో షెడ్యూల్డు భాషలలో న్యాయవ్యవహారాలను జరిపేందుకు అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలు ఈ విషయంలో గౌరవ ముఖ్యమంత్రిగారు చొరవ తీసుకొని ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలి. 11. తెలుగులో న్యాయపాలన కోసం తీర్పులూ చట్టాల అనువాదానికి అవసరమైన తెలుగు పారిభాషిక పదకోశాలను నిర్మించటం, ద్వారా తెలుగులో న్యాయపాలన జరిగేందుకు తోడ్పడడం. 12. భాషా సంస్కృతుల కోసం తెలుగు సంస్థలు: తెలుగుదేశం ప్రభుత్వం 2016 లో జీవో ఎంఎస్ నెంబర్ 40 ప్రకారం ఏర్పరచిన తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను తగు అధికారాలతో చట్టపరమైన రక్షణ, పూర్తిస్థాయి పాలకవర్గం, అధికారాలూ విధులు, నిధులూ ఏర్పరచాలని ఈ మహాసభ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఏకగ్రీవంగా తీర్మానించింది. 13. తెలుగు అకాడెమీని పునరుద్ధరించాలి. 14. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఆం.ప్ర.లో స్థాపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనువెంటనే చొరవ తీసుకోవాలి. 15. కళల పరిక్షణ, పరిశోధన, పరివ్యాప్తి కొరకు 'సాంస్కృతిక విశ్వవిద్యాలయం' ఏర్పాటు చేయాలి. 16. తెలుగు కళారూపాలను, దృశ్యకళలను కాపాడటానికి తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు సాంస్కృతిక విధానాన్ని రూపొందించి ప్రకటించాలి. 17. భాషా సేవలో గ్రంథాలయ సంస్థలు: భాషాభివృద్ధి కోసం గ్రంథాలయ వ్యవస్థను పటిష్ట పరిచేందుకు సాంస్కృతిక శాఖకు అనుసంధానం చేయడం. అలాగే, పుస్తకప్రచురణ రంగానికి తోడ్పాటు నందించడం. 18. రాష్ట్ర గ్రంథాలయం, రాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాల, రాష్ట్ర ప్రాచీన పత్రభాండాగారం లాంటి సంస్థలను రాష్ట్రానికి తరలించ వలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించటమైనది.

భాషలంటే కేవలం పదాలు కావు. అవి ప్రపంచాన్ని చూసే విధానాలు, అవి మనకు నిన్నటి జీవితపు ప్రతిరూపాలు, నేటి బ్రతుకులకు దారిదీపాలు, రేపటి ఆశాదీపాలు

ఏటుకూరి ప్రసాద్

ఆరని కాగడా

డా. నాగసూరి వేణుగోపాల్, డా. సామల రమేష్ బాబు గార్ల సంపాదకీయంలో వెలువడిన పుస్తకం చెరగని స్ఫూర్తి తాపీ ధర్మారావు విశ్లేషణల సమాహారం నుండి తాపీ ధర్మారావుగారి జయంతి సెప్టెంబర్ 19ని 'తెలుగు మాధ్యమాల దినోత్సవం' సందర్భంగా అందిస్తున్న వ్యాసం .



ధర్మారావు సాహిత్య జీవనం ఓ హరివిల్లు. అందులోని అన్ని వర్ణాలూ ఒకే స్వచ్ఛమైన కేంద్రకిరణం నుండి వెలువడ్డాయన్న విషయం తెలిసిందే. అలాగే వీరి సాహిత్య కృషి వెనక ఒకే ఆశయం ఉంది. కొందరి నిజజీవితం, సాహిత్య జీవితాల మధ్య భేదం ఉండవచ్చు. సారూప్యం ఏ కొద్దిగానో ఉండవచ్చు. కానీ ధర్మారావు విషయంలో ఈ రెండూ పడుగూ, పేకల్లా అల్లుకుపోయాయి. రెంటినీ విడదీసి చూడడం అసాధ్యం. దీనికి కారణం లేకపోలేదు. దేనిని సాహిత్య జీవన లక్ష్యంగా ధర్మారావు ఎంచుకున్నాడో ఆ లక్ష్యమే వారి నిజజీవితాన్ని కూడా నడిపింది. అదే... సమాజం మారాలి.

సమాజం పరిణామశీలమైంది. అయినప్పుడు ధర్మారావు ఆకాంక్షలో కొత్తేముంది అని అనిపించవచ్చు. కానీ అది కాదు. ఆ పరిణామం ఎలా ఉండాలో, ఏ దిశలో సాగాలో, ఆపైన ఏర్పడబోయే నూతన సమాజం ఎలా ఉంటుందో అన్న విషయాల్లో వారికి స్పష్టమైన అవగాహన ఉంది. నిర్దిష్టమైన చూపు ఉంది. సమాజం మారాలి అన్న అభిప్రాయం ఉన్న వీరికి, అప్పటివరకూ ఉన్న ఏ చెడు లక్షణాలనుండి విముక్తి పొంది మారాలి?– అన్న అంశం కూడా తెలుసు. ఆ చెడు లక్షణాలు ఏయే చారిత్రక పరిస్థితుల ప్రభావంవల్ల వచ్చాయో, ఏయే సామాజిక దశలూ, శక్తులూ దానికి కారణభూతాలయ్యాయో, వాటినీ ధర్మారావు అర్థం చేసుకున్నాడు. ఈ లక్షణాలు సమాజంలో రావడానికి ఎంత కాలం పట్టాయో వాటిని వదిలించుకోడానికి అంతేకాలం పట్టవచ్చన్న అభిప్రాయం వీరికుంది. అయితే ఆ చెడును తిట్టుకుంటూ కూర్చునే వ్యక్తికాదు వీరు. వీటిని ఎదుర్కొన్న తనకన్నా పూర్వీకుల చరిత్రను సాకల్యంగా అధ్యయనం చేశాడు. వారందరి కృషినీ కలపోసి ముందుకెళ్ళాలని అనుకున్నాడు.

కొన్ని వర్గాల సంఘర్షణలో ఒక సామాజిక దశ ఆవిర్భావాన్నీ, చరిత్రనూ చూసిన ధర్మారావుకు, మరికొన్ని కొత్త వర్గాలు సమైక్యమై ఘర్షించడం, అప్పుడే తాననుకున్న సమాజంలోని చెడు లక్షణాలు పోయే అవకాశం ఉంది అన్న స్పృహతో, వ్యక్తులు ఏయే రూపాల్లో శ్రమించి ఇలాటి ఘర్షణను వేగవంతం చేశారో చూశాడు. వాళ్ళే కందుకూరి, గురజాడ, గిడుగులు. ధర్మారావూ, వీళ్ళూ ఉన్న సమాజం కొంచెం ఇంచుమించుగా ఒకటే. అందువల్ల సమాజంలో ఉన్న చెడుగేదో వీళ్లందరికీ కనిపించింది. కానీ అందరూ వేర్వేరు మార్గాల్లో. విభిన్నాలైన ఆయుధాలతో తిరుగుబాటు చేశారు. సామాజిక విప్లవం త్వరితం కావటానికి భావ విప్లవం అవసరమని అందరూ గుర్తించారు.

ఫ్యూడలిజం జనజీవితం అంతటా పరచుకుంది. అందులో మత సంబంధమైన ఫ్యూడలిజం నాశనం కానిదే సమాజం బాగుపడదని కందుకూరి భావించాడు. దీనికి కారణం ఉంది. తన చుట్టూ ఉన్న ప్రజలను నడిపిస్తున్నది వాళ్ళ ఆలోచన కాక, మతం – మతాధిపతులూ – ఆచారాలూ – వాటిని తలకెత్తే ఆచార్యులూ వంటి నిరంకుశ శక్తులేనని కందుకూరి గమనించాడు. వాళ్ళలో ఆలోచనలకు కొత్త కిటికీలు తెరిచి, పేరుకున్న గబ్బిలాల కంపును దులిపే కొత్త గాలులు అవసరం అని తలచాడు. అందుకు మొదటి దెబ్బ వీటికి మూలమైన మతం, మూఢ విశ్వాసాలపై కొట్టడం అవసరమనిపించి కందుకూరి అదే లక్ష్యంగా తన సాహిత్యం – జీవితం– ఆ పోరాటానికే అంకితం చేశాడు. అందుకే కలం నిలపకుండా, క్షణం ఆగకుండా తుది శ్వాస విడిచేవరకూ ఆ మతపరమైన ఫ్యూడలిజం మీద పోరాటం సాగించాడు. ఇందులో మిత్రులు శత్రువులైనారు, శత్రువులు మిత్రులైనారు. కానీ యువకులు మాత్రం కడకంటా వెన్నంటివచ్చారు.

సమాజంలో రెండోరంగంలో ఈ ఫ్యూడలిజం వికటాట్టహాసాన్ని గురజాడ గమనించాడు. అదే సాహిత్యరంగం. సామాజిక సంస్కరణ గాలులు తెలుగు నేలమీద వీస్తుండడం శుభసూచకమనుకున్నాడు. కానీ సాహితీరంగం ఏళ్ళ తరబడి చలనంలేని మురికినీరు చేరిన గుంటగా ఆయనకు కనిపించింది. అనేక వ్యాధులు ప్రకోపిస్తున్న దశనూ, అవి

జనం మూలుగులు పీలుస్తున్న అంశాలనూ స్పష్టంగా చూశాడు గురజాడ. సాహిత్యంలో పెత్తందారీతనాన్ని, అది తెస్తున్న చీడనూ పసిగట్టాడు. సామాన్యులు పడ్తున్న మానసిక ఆందోళనలను ఎక్సరే కళ్ళతో చూశాడు. ప్రపంచ సాహిత్యంలో ఉండే భాష, ఛందస్సు, భావాలలో వచ్చిన, వస్తున్న మార్పులనూ గమనించాడు. విశాల దృష్టిని పెంచుకున్నాడు. దాంతో తెలుగు సాహిత్యంలో కొత్త పుంతలూ, కొత్త దారులూ వేశాడు. సామాజిక పరిణామానికి సాహిత్యం బాధ్యత గుర్తించి, దాన్ని విప్లవ పంథాలో వేగవంతం చేశాడు. ఆ గమనం అభ్యుదయం దిశగా సాగడానికి శ్రమించాడు. భవిష్యత్తు మీద విశ్వాసంతో ఆ పనికోసం పోరాడాడు. సాహిత్యరంగంలో యథాపూర్వస్థితి కోసం పెనుగులాడే అభివృద్ధి నిరోధకుల భావాలపై గురజాడ కత్తికట్టి ఎదుర్కొన్నాడు. ఈ విధంగా సాహిత్య ఫ్యూడలిజం 'పుట్టకీటు' కదల్చడంలో గురజాడ, కన్నుమూసేదాకా కలం దించలేదు.

'సంకెళ్ళను ప్రేమించేవాళ్ళు దాన్ని – అనగా గ్రాంథిక భాషను ఆరాధిస్తారుగాక, నా మట్టుకు నా మాతృభాష సజీవమైన తెలుగు. 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అనిపించుకున్న ఈ తెలుగుతో మన సుఖాల్నీ దుఃఖాల్నీ వెల్లడించడానికి మనం యెవరమూ సిగ్గుపడలేదుగాని కాగితం మీద పెట్టడానికి మాత్రం మనలో కొంతమంది బిడియపడుతున్నారంటూ గురజాడ మన భాషను గురించి వాపోయాడు. అప్పటికి భాషావిషయకంగా గిడుగు ఉద్యమంలోకి దూకలేదు. ఈ రంగంలో కూడా గ్రాంథికవాదుల మోతుబరితనం తెలుగు భాష పెరగడానికి వీల్లేకుండా నెత్తిమీద మేకులు కొట్టింది. చిన్నయసూరి లాంటి వాళ్లు ఉక్కువత్రాలే బిగించారు. గురజాడ సాహిత్య సృజన గిడుగుకు లక్ష్యంగా కనిపించింది. వ్యావహారిక భాషోద్యమం తీవ్రతరం చెయ్యాలనిపించింది. ఇందుకు ప్రపంచంలోని భాషల పెంపుదలా, ఆయా శాస్త్రజ్ఞుల కృషి గిడుగు అధ్యయనం చేశాడు. అక్కడ కరుడుకట్టిన ఛాందసభావాలను, వాటిని ప్రచారం చేసినవాళ్ళను ఎలా ఎదుర్కొన్నారో అధ్యయనం చేశాడు. సశాస్త్రీయంగా, అధికారికంగా ఈ రంగంలో ప్రబలిన ఫ్యూడలిజం భావాలను మొదలంటా నరకాలనీ వ్యావహారికానికి సభామర్యాద కల్పించాలనీ కృషి చేశాడు. ఇందుకు కందుకూరి, గురజాడలు అప్పటికే చేపట్టి సాగించిన ఉద్యమాల ప్రభావం బాగా తోడ్పడింది. అసహాయశూరుడిలా, కాకలు తీరిన యోధుడిలా పోరాటం సాగించాడు.

ధర్మారావు నిలదొక్కుకునే కాలానికి ముందు ఈ రంగాలన్నిటా ఫ్యూడలిజం నిలదొక్కుకోడం చూశాడు. తొలిదశలో తానూ ఆ దశలో వ్యక్తే కనుక దాన్ని ఎదిరించడానికి కొంత సమయం తీసుకున్నాడు. మొదట్నుంచీ సామాజికంగా ఉండే మతసంబంధమైన ఫ్యూడలిజం గుప్పిట్లో తానూ నలిగినవాడుగనుక, దానిమీద తిరుగుబాటుతో ధర్మారావు తన కృషి ఆరంభించాడు. సమకాలిక జీవనాన్ని నిత్యం అధ్యయనం చేస్తున్నందువల్లా, ఒక రకమైన రంగంలో ఫ్యూడలిజాన్ని ఎదిరించడానికి నిశ్చయించుకున్నందువల్లా, అలాటి అసహ్యించుకోదగ్గ లక్షణాలు ఇతర రంగాల్లో కూడా చూడగలిగాడు. ఆ రంగాల్లో కృషి చేస్తున్నవారి శ్రమను మొదట సరిగా అంచనా వేయకపోయినా క్రమంగా తన తప్పు తెలుసుకుని మారాడు. దానితో ఆ మూడు రంగాలలో మిగిలిన ఫ్యూడలిజం లక్షణాలను తూర్పారబట్టాలని తలచాడు. ఆ రంగాలలో కృషి చేసినవాళ్ళనే తనకు మార్గదర్శకులుగా భావించాడు.

అంతేకాదు. కందుకూరి, గురజాడ, గిడుగుల కాలానికి అంతగా కనిపించందీ క్రమంగా తీవ్రమై ధర్మారావు రంగంలో దిగే కాలానికి స్ఫుటంగా కనిపించిందీ మరోటి ధర్మారావు దృష్టిలో పడింది. అదే రాజకీయాల్లో ఫ్యూడలిజం. తనకు పూర్వమున్న విప్లవ వైతాళికత్రయం దీన్ని బహుశా గమనించినా తమ కృషి ఇతర కోణాలలో సాగించారు. పారిశ్రామిక విధానం పెరుగుతున్న కొద్దీ గత దశకు చెందిన భావాలకూ నూతనంగా వచ్చిన భావాలకూ ఘర్షణ జరగడం అనివార్యం. పాత, కొత్త వర్గాల మధ్య వైరుధ్యం సహజం. శిథిలమవుతున్న సామాజిక భావాలూ, కొత్తగా రూపుకడ్తున్న సామాజికాంశాల భావాలూ పోటాపోటీలు పడడం జరుగుతుంది. దీన్ని రాజకీయరంగంలో చాల స్పష్టంగా ధర్మారావు చూశాడు.

అది జాతీయ పోరాటంగా కనిపిస్తున్నా–అందులో ఈ పెత్తందారీ భావాలు దేశ సమైక్యతకూ, అందర్నీ ఒకే ఆశయంతో కలుపుకుపోవడానికి ఆటంకంగా పరిణమిస్తాయని ధర్మారావు భావించాడు. అంతేకాదు. దేశంలోని అన్ని వర్గాలూ, వర్ణాలూ, జాతులూ సమానంగా అభివృద్ధి సాధించడానికి ఈ భావాలే అడ్డుకుంటున్నాయని కూడా గమనించాడు. అది కాంగ్రెసుకానీ, జస్టిసుపార్టీ కానీ, ప్రజామిత్రపక్షం కానీ ఏదైనా ఈ ఊబిలో పడే కొట్టుమిట్టాడ్తోందని గ్రహించాడు. కనుక తను పోరాడాల్సిన శత్రువర్గంలో ఈ నాలుగో అంశాన్ని కూడా చేర్చుకున్నాడు.

ఒక సాహిత్యకారుడుగా సాహితీపరంగానూ, భాషాపరంగానూ ఎలాటి ఫ్యూడల్ లక్షణాలనూ సహించకూడదని భావించడం సహజమే. సంస్కరణ భావాభిలాషిగా, ఒక నూతన సమాజాన్ని ఊహిస్తున్న వ్యక్తిగా, ఆ సమాజంలో వర్గరహిత స్వభావం ఉంటుందని కాంక్షిస్తున్న మనిషిగా, మత సంబంధమైన ఫ్యూడల్ లక్షణాలను అసహ్యించుకోడం సబబే. సాహిత్యకారుడూ, కవి – తన చుట్టూ ఉన్న సమాజంలో ఒకడుగా ఉండకమానడు. తన సమకాలిక సమాజాన్ని నడిపే రాజకీయ భావాల ప్రభావానికి గురికాక మానడు. అలాంటప్పుడు తాను వింటున్న సరికొత్త సోషలిస్టు సమాజం కోసం ఆరాటపడే వ్యక్తి, అలాటి సమాజం వస్తేనే సమస్త కళలూ సాహిత్యమూ సంపూర్ణంగా ప్రజలపరం కాగలవని విశ్వసిస్తున్న వ్యక్తి, తన చుట్టూరా ఉండే రాజకీయాల్లో ఫ్యూడలిజం భావాలను ఎలా సహించగలడు? అందుకే తిరుగుబాటు చేశాడు. అయితే ఈ రంగంలో ధర్మారావు చేసిన తిరుగుబాటుకు, మిగిలిన మూడు రంగాలకన్నా కాస్తకాలం ఎక్కువ తీసుకుంది. అయినా సరే నిర్దిష్టమైన దిశలో సాగాడు. ఆ మహోన్నత సమాజంకోసం కృషిచేసే అన్ని ప్రజాసంఘాల, ఉద్యమాల కార్యక్రమాల్లో పాలు పంచుకున్నాడు.

ఆది సాహిత్యరంగం కానీ, పత్రికా రంగంకానీ, చలన చిత్రరంగం కానీ – అన్నిటా ఈ ఫ్యూడలిజాలను తుదికంటా నిర్మూలించడానికే ధర్మారావు జీవితం అంకితమైంది. కందుకూరి, గురజాడ, గిడుగులు అందించిన కాగడాలను సంలీనం చేసుకుని ముందుకు సాగాడు ధర్మారావు.తన సాహిత్య జీవితమంతా తానందుకున్న ఆ కాగడాను జ్వలింపజేయడానికే ధారపోశాడు.

తరువాయి... 48వ పుటలో

పేరం అమృతరావు
8919087108

కొత్త పుస్తకాలు



ఎప్పటికీ అందరికీ...సంజీవదేవ్

చదివింది నాలుగవ తరగతే అయిన దాదాపు పధ్నాలుగు భాషలలో రాతకోతలలో ప్రవేశం గల మన తెలుగువాడు పరిచయం అవసరంలేని తత్వవేత్త, చిత్రకారుడు, రచయిత, కవి, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, బహుభాషాభిజ్ఞునిగా, లలితకళా విమర్శకునిగా ప్రఖ్యాతి పొందిన సూర్యదేవర సంజీవదేవ్‌ను స్ఫురణకు తెచ్చే కరదీపిక 'ఎప్పటికీ అందరికీ... సంజీవదేవ్.' అనే పేరుతో బి. లలితానంద ప్రసాద్ ప్రకటించారు. ఆయనతో ప్రత్యక్ష అనుబంధం గల లలితానంద ప్రసాద్ ఇప్పటికే ఎన్నో వ్యాసాలు ఆయన గురించి రాశారు. ఆయన జీవన ప్రయాణంలోని కొన్ని అపూర్వమైన అంశాలను ఈ రచనలో చర్చించారు. సంజీవ దేవ్‌పై తాను రాసిన కవితలతోపాటు, సంజీవ దేవ్ అముద్రిత కవితలను ఇందులో పొందుపరిచారు. జంపాల చౌదరి ముందుమాటతోపాటు, సంజీవ దేవ్ శత జయంతి సభలో సింగమనేని నారాయణరావు అధ్యక్షోపన్యాసాన్ని, సుప్రసిద్ధ రచయిత, సంపాదకుడు ఎ.బి.కె. ప్రసాద్ సంజీవ దేవ్ రచనలపై రాసిన సాధికారిక వ్యాసాలను పాఠకులకు అందుబాటులోకి తెచ్చారు. సంజీవ దేవ్ పై ఏడు వ్యాసాలనూ, వివిధ రచయితల అభిప్రాయాలనూ, సంజీవ దేవ్ ఇతర రచనల వివరాలనూ అనుబంధంగా చేర్చారు. తేజో-దీప్తు ప్రచురణల ద్వారా ముద్రించారు.

విజ్ఞాన వీచికలు-సండే మార్కెట్ క్యాలెండర్లు



ప్రతి చిన్న వ్యాపారి, లేదా వ్యాపార సంస్థవారి ప్రకటనల కోసం నూతన సంవత్సర ఆరంభంలో క్యాలెండర్లను రూపొందించడం, అందులో తమ వ్యాపార వివరాలను, వారి కార్యకలాపాలను పొందుపరచటం మనం చూస్తూనే ఉంటాం. సాధారణంగా అన్ని క్యాలెండర్లూ ప్రజల అభిరుచులకు తగినట్లుగా రాశిఫలాలు మొదలుకొని తిథి, నక్షత్రాలు, జ్యోతిష్యం, వాస్తూ, అంటూ ఎన్నో రకాలైన వివరాలతో సంవత్సర ఆరంభంలో మనకు దర్శనమిస్తూనే ఉంటాయి. అందుకు భిన్నంగా 2010 నుంచి మొదలైన సండే మార్కెట్ క్యాలెండర్ల నుంచి ఎంపిక చేసిన ప్రజా విద్య, వైద్యం, ఆరోగ్యం, పర్యావరణంతో పాటు చరిత్ర, సైన్స్, సినిమా, లౌకికవాదం, నమ్మకాలు- నిజాలు పేరిట ఏర్చి కూర్చి "విజ్ఞాన వీచికలు- సండే మార్కెట్ క్యాలెండర్లు" పేరిట విజ్ఞాన ప్రచురణ, నెల్లూరువారు సంకలనంగా ముద్రించారు. నెల్లూరు పట్టణానికే తలమానికమైన సండే మార్కెట్ సుమారు వంద మంది చిరు వ్యాపారస్తులతో 1980లలో మొదలై లాభాపేక్ష లేని వ్యాపార విలువలతో కొనసాగుతోంది. ఈ ప్రజా చైతన్య క్యాలెండర్ 2010లో మొదలై, సంవత్సరానికి ఒక అంశంతో ఉదా: తెలుగు రచయితలు, నెల్లూరు జిల్లా విశేషాలు, ప్రముఖ శాస్త్రవేత్తలు, పద్యాలు, కొటేషన్లు ఇలా ఎన్నో అంశాలను ప్రచురిస్తూ వచ్చారు. సమాజాభివృద్ధిని కాంక్షించే ఇలాంటి రచనలు పాఠకలోకానికి ఎంతైనా అవసరం.



ఎంపిక చేసిన సరసి కథలు

సేరస్వతుల రామ నరసింహం 'సరసి' పేరుతో తెలుగు పాఠక లోకానికి కార్టూనిస్టుగానే గాక కథా రచయితగా కూడా సుపరిచితులు. ఇప్పటివరకు పది కార్టూన్ సంకలనాలను వెలువరించారు. ఆయన కార్టూన్లకు నాలుగు అంతర్జాతీయ, మూడు జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయి. ఎనిమిదవ తరగతి నుంచే కథలు రాయటం మొదలుపెట్టి నలభై ఏళ్లుగా నవ్య, ఆంధ్రభూమి, బాల భారతం, దిన, వార, మాస పత్రికలలో ఆయన కథలు ప్రకటిస్తూ వచ్చారు. 'కుక్క పిల్ల', 'మనిషి పశువు, ఇల్లు కట్టి చూడు, సూనె దీపం, పరీక్ష లాంటి అద్భుతమైన కథలను సమాజంలోని సమస్యలను కథాంశాలుగా తీసుకొని వినూత్న శైలిలో వాటిని చిత్రించారు. ఉదాహరణకు, 'పరీక్ష' కథలో గురు శిష్యుల మధ్య సంబంధాలనూ చదువు ఆవశ్యకతనూ గురించి చర్చించారు. ఈ కథలన్నీటిని కలిపి వేద సంహిత ప్రచురణలు, హైదారాబాద్‌వారు "ఎంపిక చేసిన సరసి కథలు" పేరుతో యాభై కథలను కలిపి ఒక సంపుటిగా తీసుకువచ్చారు.



శబ్ద బ్రహ్మ చిన్నయసూరి

తెలుగు సాహిత్యానికి వ్యాకరణ దీపం చిన్నది అంటారు తిరుపతి వెంకటకవులు. ఆ వ్యాకరణ దీపాన్ని వెలిగించిన చిన్నయ జీవితం, ఆయన రచన బాల వ్యాకరణ నేపథ్యం గురించి ఆచార్య వెలమల సిమన్న, డా. గుమ్మా సాంబశివరావు గార్లు వెలువరించిన గ్రంథమే 'శబ్దబ్రహ్మ చిన్నయసూరి' పరవస్తు చిన్నయసూరి పీఠం వారి సహకారంతో విశాలాంధ్ర బుక్ హౌస్ వారి ప్రచురణగా 2024లో

...తరువాయి 40వ పుటలో

యజ్జల ప్రవీణ్
9966779994

గిడుగు దర్శనం - సమీక్షా వ్యాసం



గిడుగు దర్శనం' అనే పేరున ఈ యేడు తెలుగు పిడుగు గిడుగు పై వచ్చిన పరిశోధనా గ్రంథం. దీన్ని మమతా ప్రెస్, విశాఖపట్నంవారు ప్రచురించారు.

గిడుగు రామమూర్తిగారి వ్యక్తిత్వం ...శిష్యులకు పాఠాలు బాగా చెప్పిన గురువుగా ... ప్రపంచ భాషాశాస్త్రవేత్తలకు గొప్ప భాషాశాస్త్రవేత్తగా ... మరికొందరికి మానవతావాదిగా.... తెలుగువారికి వ్యావహారిక భాషావాదిగా కనిపిస్తారు... .

డాక్టర్ అల్లంసెట్టి చంద్రశేఖరరావు గారు 'గిడుగు దర్శనం' పేరిట పరిశోధనాత్మకంగా రచించిన తీరు ఈనాటి రచయితలకూ, భావి పరిశోధకులకూ మార్గదర్శకంగా ఉంది. అల్లంసెట్టివారు 1998లో సవర భాషకు వర్ణనాత్మక వ్యాకరణం రచించి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి పీహెచ్.డీ. పట్టా పొందారు. ఆ పరిశోధన అనుభవం ఈ పుస్తక రచనకు బాగా ఉపయోగపడింది. నాలుగు అధ్యాయాలూ, మూడు అనుబంధాలతో మొత్తం 182 పుటల పుస్తకం. అందులో, మూడు అధ్యాయాలూ ఒక అనుబంధంలోని వ్యాసాలు రచయిత స్వతంత్ర వ్యాసాలు కాగా ఒక అధ్యాయం రెండు అనుబంధాలలోనివి గిడుగువారి రచనలకు అల్లంసెట్టివారి అనువాదాలు.

ముందుమాటలుగా సమకాలీన పండితులు, పరిశోధకులు వ్యక్తపరిచిన అభిప్రాయాలున్నాయి. మొట్టమొదటగా, డా. సీ.పీ. శ్రీనివాస రామానుజంగారు ఈ గ్రంథ రచయితకు ప్రమాణపూర్వకంగా ఇచ్చిన బిరుదు 'అభినవ గిడుగు'. ఈ గ్రంథానికి స్పందన చేర్చిన సవర గణపతిరావుగారైతే చంద్రశేఖరరావుగారి పరిశోధనకు ముగ్ధులై 'మరో గిడుగు' అంటూ ప్రస్తుతించారు. ఆచార్య నడువల్లి శ్రీరామరాజుగారి చంద్రదర్శనం పేరిట రాసిన ముదుమాట గిడుగు దర్శనానికి ఒక సమగ్ర పీఠిక అని చెప్పక తప్పదు. రచయిత ముందుమాటలు రాస్తూ ఈ గ్రంథం ఎందుకు రాయవలసివచ్చిందో చెబుతూ, గిడుగు రామమూర్తిగారి భాషా పరిశోధనలపట్లా భాషేతర ప్రవర్తనలపట్లా కొందరి రచనలలోనూ ప్రసంగాలలోనూ ప్రచారంలోకి వస్తున్నవాటిని వివరణలతోనూ సప్రమాణ నిరూపణలతోనూ చదువరుల ముందుంచుటే ముఖ్య ప్రేరణ అంటారు.

మొదటి అధ్యాయంలో గిడుగువారి పుట్టిన తేదీ ఆగస్టు 29ని తెలుగు భాషా దినోత్సవంగా ప్రకటించబడిన అంశాల్ని నమోదు చేశారు. గిడుగువారి విద్యాభ్యాసం, పర్లాకిమిడిలో ఉద్యోగం, చరిత్ర, సంస్కృతి, భాష అనే వాటిపై గిడుగువారి అభిప్రాయాలను సాధికారికంగానూ సంక్షిప్తంగానూ వివరించడంలో సాధికారతను ప్రదర్శించారు. శాసనాలలో కనిపించే నేంటి, నేండు వంటి రూపాలు నేటి వ్యవహారాలలోని రాంగా, పోంగా వంటి రూపాల వంటివని గిడుగువారు రాయటాన్ని సమర్థించారు. ఇలాంటి అంశాల చుట్టూ ఈ మొదటి అధ్యాయం తిరుగుతుంది. రెండవ అధ్యాయంలో సవర భాష మాట్లాడే జనాల జాతీ సంస్కృతీ చరిత్రలను సప్రమాణంగా వివరించారు. సవరభాష ఆస్ట్రో- ఆసియాటిక్ భాషా కుటుంబంలోని ముండా ఉప కుటుంబానికి చెందిన భాష, నేటి సంతాలి, కొర్కు, ముండా, గుటొబ్, ముండారీ మొదలైనవి దాని సోదర భాషలనీ వాటిని మాట్లాడే ప్రజలే ఆదివాసులుగా ఉన్నారనీ సవర - శబర పదాలకు ఉన్న సంబంధాన్నీ అనేక ఆధారాలతో గిడుగు వారు రాసిన సమాచారాన్ని వెల్లడించారు. ఈ సందర్భంలో గిడుగువారి పరిశోధనా పటిమ వెల్లడి అవుతోంది.

మూడవ అధ్యాయంలో వ్యావహారిక భాషోద్యమానికి ఉన్న పూర్వరంగాన్ని వివరణాత్మకంగానూ, గుణాత్మకంగాను వివరించారు. దీనిలో కర్జన్ విద్యావిధానంలోని అంశాలనూ, ప్రభుత్వ తీర్మానాలనూ విశదంచేస్తూ 1904లోనే వ్యాసరచనలోనూ అనువాదంలోనూ విద్యార్థులు ప్రాచీన కవుల శైలిని అనుసరించాలా? లేదా సులభశైలిని అనుసరించాలా? అనే మీమాంస వచ్చిందనీ, వ్యావహారిక భాషావాదం అప్పుడే మొదలైందనీ చంద్రశేఖరరావుగారు పేర్కొనడం ఈ అధ్యాయంలోని ఆసక్తికరమైన అంశం. ఈ అధ్యాయంలోనే భాషాతత్వంపై చర్చిస్తూ శకటరేఫ, అర్ధానుస్వారం, విసంధిగా రాయటం మొదలైనవాటి గురించీ భాషాశాస్త్ర దృష్టితో చేసిన గిడుగువారి నిశిత పరిశీలనను ముచ్చటించారు. నాలుగో అధ్యాయంలో గిడుగువారి రచనలను పరిచయం చేశారు. దీనిలో గిడుగువారి ప్రతిభను పూసగుచ్చినట్లు వివరించారు. గిడుగువారి వాచక నిర్మాణాన్ని, నిఘంటు నిర్మాణాన్నీ అందులోని మెళకువలనూ ఎత్తి చూపారు. ఈ అధ్యాయాన్ని

తరువాయి....40వ పుటలో

ఆచార్య వెలమల సిమ్మన్న
94406 41617

పరిశోదక సార్వబౌముడు ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి

"సంస్కృతాంధ్ర ఆంగ్ల భాషలలో వారు గొప్ప పండితులు. సుప్రసిద్ధ నాటక రచయితలు. నాటక రచయితగా వారి స్థానం సమున్నతమైనది. శ్రీనాథుడు, నన్నెచోడుడు, మొదలగు పూర్వాంధ్ర కవుల గూర్చి వారు సమగ్రంగా పరిశోధించినారు. తెలుగు సారస్వతములో నిష్ణాతులైన పండితులు. సాధారణ పండితులెవ్వరికిని అవగాహన కాని, నూతన విషయాలను వారు శ్రమపడి, వెలికిదీసి, ప్రకటించి, భాషా సారస్వతాలకు మహోపకారం గావించినారు. మన పండితులలో వారిది విశిష్టమైన స్థానం. ఆంధ్ర సారస్వతంలో వారితో సమానమైన పండితులు మిక్కిలి తక్కువ."

– శ్రీ దేవులపల్లి రామానుజరావు

తెలుగు పరిశోధన రంగంలో మొట్టమొదటి డి.లిట్ పట్టాగ్రహీత ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తిగారు.

పరిశోధకుడుగా, విమర్శకుడుగా, అధ్యాపకుడుగా, ఆచార్యుడుగా, కవిగా, నవలాకారుడుగా, కథకుడుగా, నాటకకర్తగా, నాటికల రచయితగా, పండితుడుగా, వ్యాసకర్తగా, సంపాదకుడుగా, పరిష్కర్తగా, అనువాదకుడిగా, నటుడిగా, దర్శకుడుగా, మేధావిగా మహోన్నతమైన వ్యక్తిత్వం కలవాడిగా, ఎనలేని కీర్తిప్రతిష్ఠలు సంపాదించిన బహుముఖ సాహితీ సంపన్నులు, సాహితీమూర్తి, సమతామూర్తి, ప్రతిభామూర్తి, "పరిశోధక సార్వభౌముడు" కొర్లపాటి శ్రీరామమూర్తి.

"పరిశోధన" అనగానే "కొర్లపాటి శ్రీరామమూర్తి", "కొర్లపాటి శ్రీరామమూర్తి" అనగానే "పరిశోధన" గుర్తుకు రాని తెలుగు పరిశోధకులుండరు. పరిశోధనరంగంలో కనీవినీ ఎరుగని విధంగా విస్తృత, విశిష్ట పరిశోధన చేసి, మంచి పేరు తెచ్చుకొన్న మహనీయమూర్తి శ్రీరామమూర్తి.

శ్రీనాథునికి అంతా "శివమయం". శ్రీరామమూర్తికి అంతా "శ్రీనాథమయం". శ్రీనాథుడు "కవి సార్వభౌముడు". శ్రీరామమూర్తి "పరిశోధక సార్వభౌముడు".

శ్రీనాథుడు తన ప్రతిభా వ్యుత్పత్తులతో గౌడడిండిమ భట్టు కంచుఢక్కాను పగలగొట్టి, "కవి సార్వభౌముడు" అయినట్లే, పరిశోధనలో పరాకాష్ఠకు చేరుకొని, తెలుగులో మొట్టమొదటి డి.లిట్ పట్టా పొంది, "పరిశోధక సార్వభౌముడు" అయ్యారు కొర్లపాటి శ్రీరామమూర్తి.

కొర్లపాటి, "శ్రీనాథుడు" రచనలపై పిహెచ్.డి. చేశారు. "ఈశ్వరార్చన కళాశీలుడు" అనే అంశంపై డి.లిట్ చేశారు. రెండు డిగ్రీలు శ్రీనాథుని సాహిత్యంపై జరిగినవే. రెండు డిగ్రీలు ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లోనే చేశారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్, తెలుగుశాఖలో ఉద్యోగం చేశారు.

శ్రీరామమూర్తి గారు 17 అక్టోబర్ 1929 తేదీన (శుక్ల నామ సంవత్సర ఆశ్వీయుజ మాస శుక్ల చతుర్దశి) జన్మించారు. వీరి తల్లిదండ్రులె శ్రీమతి రత్నమణి, మణ్యం గార్లు. స్వగ్రామం కోనసీమలోని "కొర్లపాటి వారి పాలెం". గ్రామ నామమే ఇంటిపేరు అయింది.

కొర్లపాటి తాత, తండ్రి మంచి జ్యోతిష శాస్త్ర పండితులు. వీరి జ్ఞాతి పితామహులు ఒకరు "భిషగ్రాజ" బిరుదంకితులైన ఆయుర్వేద వైద్యులు. వీరి ప్రాథమిక విద్య "కొర్లపాటి వారి పాలెం"లో జరిగింది.

వీరి గురువులు కొల్లి అనంత పద్మనాభ శాస్త్రి, దర్భా సర్వేశ్వర శాస్త్రి, దిగుమర్తి, సీతారామ స్వామి, నందూరి రామకృష్ణమాచార్యులు. గురువుల దగ్గర కావ్య, నాటక, వ్యాకరణాలు మొదలైన అనేక అంశాలను చాలా చక్కగా నేర్చుకుని, సాహిత్యంపై అభిరుచి పెంచుకొని, కవి, పండిత, పరిశోధక, విమర్శకులయ్యారు కొర్లపాటి.

శ్రీరామమూర్తి గారు ప్రాథమిక దశ నుంచి విశిష్ట ప్రతిభను ప్రదర్శించేవారు. చిన్నతనం నుంచి అందరిలో ఒకడుగా కాకుండా, తనదైన ప్రత్యేకతను సంపాదించుకున్నారు. చదువులో అన్ని తరగతుల్లోనూ అగ్రస్థానంలో వుండేవారు. అందువల్ల అధ్యాపకులు కూడా కొర్లపాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. వాత్సల్యంతో, ప్రేమతో, ఆదరించేవారు. ప్రతీ విషయాన్ని లోతుగా, నిశితంగా పరిశీలించడం కొర్లపాటికి అలవాటు. అదే వారి జీవితానికి మరింత ముందుకు తీసికెళ్ళింది. దీనికి తోడు వారికి వున్న క్రమశిక్షణ కూడా.

1953లో భీమవరంలో బి.ఏ. చదువుకున్నారు. తెలుగును ప్రత్యేకంగా అధ్యయనం చేశారు. ఆంధ్ర విశ్వకళా పరిషత్ పరిధిలో సర్వప్రథములుగా, ఉత్తీర్ణులై బంగారు పతకాన్ని పొందారు. వీరు ప్రతీ తరగతిలోనూ అత్యుత్తమ ఫలితాల్ని సాధించి, గురువుల ప్రశంసలను అందుకున్నారు. బి.ఏ. పూర్తి కాగానే కొంతకాలం భీమవరంలోనూ, రాజమండ్రిలోనూ, "ట్యూటర్"గా (1953–1955) పని చేశారు.

1955లో ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లో బి.ఏ. ఆనర్సులో చేరారు. 1957లో పట్టా అందుకున్నారు. సర్వప్రథములుగా నిలచి, బంగారు

పతకంతో పాటు, అనేక బహుమతుల్ని ఆంధ్రవిశ్వకళాపరిషత్ నుంచి పొందారు. అందరూ శభాష్ అన్నారు. ప్రముఖులు ప్రశంసల వర్షం కురిపించారు. కొర్లపాటి ప్రతిభాపాండిత్యాలు చెప్పుకోదగ్గవి.

కొర్లపాటి విద్యార్థి దశలోనే సృజనాత్మక, పరిశోధనాత్మక, విమర్శనాత్మక రచనలు చేశారు. విద్యార్థిగా వున్నప్పుడే శ్రీరామమూర్తి గారు 1955లో "చిత్రశాల"నే చారిత్రక నవల రాసి, చరిత్ర సృష్టించారు. ఈ నవలకు ఆంధ్ర విశ్వకళా పరిషత్ బహుమతి కూడా లభించింది. పరిశోధక విద్యార్థిగా వున్నప్పుడు "నటన", "సమత" అనే నాటికలు రాశారు. బళ్ళారి రాఘవ నాటకోత్సవాల పోటీలోనూ, ఆంధ్ర విశ్వకళాపరిషత్ నాటకోత్సవాల స్వతంత్ర నాటక రచనల పోటీలో ఉత్తమ రచనలుగా బహుమతులందుకున్నారు.

కొర్లపాటి భార్యపేరు శ్రీమతి వెంకట రమణగారు. ఈ దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. సరస్వతి రావు, డా॥ సత్యగోపాల్ (ఐ.ఏ.ఎస్.), వేంకట రమణమూర్తి, దేవి గార్లు.

కొర్లపాటి ఉత్తమ అధ్యాపకులు. వీరు ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లో 1959లో లెక్చరర్‌గా చేరారు. 1959 నుంచి 1966 వరకు లెక్చరర్‌గా, తర్వాత 1966 నుంచి 1983 వరకు రీడర్‌గా, 1983 నుంచి 1989 వరకు ప్రొఫెసర్‌గా, ఆంధ్ర విశ్వకళాపరిషత్, తెలుగుశాఖలో బాధ్యతలు నిర్వర్తించారు. 1979-1982 మధ్యకాలంలో శాఖాధిపతిగా వ్యవహరించారు. 1989లో పదవీ విరమణ చేశారు. మహామహోపాధ్యాయులు కొర్లపాటి. 1990లో యు.జి.సి. ఎమిరిటస్‌ఫెల్‌గా నియమితులైనారు. అప్పుడే "తెలుగు సాహిత్య చరిత్ర"ను రాసిన ఆచార్య శిరోమణి శ్రీరామమూర్తి గారు.

"ప్రబంధసార శిరోమణి", "ప్రబంధ రత్నాకరం" అనే రెండు గ్రంథాల్ని పరిష్కరించి, ప్రచురింప చేశారు. "చారు చంద్రోదయం" అనే ప్రబంధాన్ని తెలుగులోకి తెచ్చారు.

1981లో ఆంధ్ర విశ్వకళాపరిషత్, తెలుగుశాఖ స్వర్ణోత్సవాలు జరుపుకొన్న సందర్భంగా వెలువడ్డ ప్రత్యేక సంచికకు సంపాదకత్వం వహించారు. శ్రీరామమూర్తి గారి సారథ్యంలో ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగుశాఖ పక్షాన, "పోతన సాహిత్య గోష్ఠి" జరిగింది. ఈ గోష్ఠిలోని పరిశోధక పత్రాలు ప్రత్యేక సంచికగా 1985లో వెలువడిన సందర్భంలో కొర్లపాటి సంపాదకత్వం వహించారు. 1986లో "తులనాత్మక సాహిత్యం" మీద, 1989లో "వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యం" మీద మంచి సెమినార్లు నిర్వహించారు శ్రీరామమూర్తి గారు.

వీరు అనేక సదస్సుల్లో పాల్గొని విలువైన, ప్రయోజనకరమైన, ప్రామాణికమైన, పరిశోధన పత్రాలను సమర్పించారు. ప్రముఖుల మన్ననలను పొందారు. శ్రీరామమూర్తి గారు ఆంధ్ర విశ్వకళాపరిషత్, తెలుగుశాఖ అభివృద్ధి కోసం నిరంతర నిర్విరామం కృషి చేశారు. తెలుగుశాఖలో ఉత్తమ పాఠ్యభాగాల్ని నిర్ణయించడంలో ప్రముఖ పాత్ర వహించారు. వీరి సాహిత్య సేవలు ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగుశాఖకు మాత్రమే పరిమితం కాలేదు, దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల బాగు కోసం శ్రమించారు. తన ప్రతిభా పాటవాలతో అనేక విద్యాసంస్థలకు, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్, మొదలైన రంగాలకు శ్రీరామమూర్తి గారు సేవలందించారు. అందరి మెప్పును పొందారు.

ఇంటర్మీడియేట్ పాఠ్య నిర్ణయ ప్రణాళిక సంఘంలో ప్రధాన పాత్ర పోషించారు. కామన్ కోరు సిలబస్ ఎక్సపర్ట్ కమిటీలో సభ్యులుగా వ్యవహరించారు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యునిగా పని చేశారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం సిండికేటు మెంబరుగా వుండి, ఆ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేశారు. ఇంకా అనేక కమిటీల్లో సభ్యులుగా వుండి సేవలందించారు.

శ్రీరామమూర్తి గారు గొప్ప రచయితగా, ఉత్తమ ఆచార్యులుగా, ఉత్తమోత్తమ పరిశోధకుడుగా, అత్యుత్తమ విమర్శకుడుగా మంచి పేరు తెచ్చుకున్నారు. వీరి క్లాసులు వింటే ప్రత్యేకంగా చదవవలసిన అవసరం లేదు. నేరుగా పరీక్షల్లో రాసుకోవచ్చు. అంత అద్భుతంగా కొర్లపాటి పాఠం చెప్పేవారు. కొర్లపాటి బోధనా విధానం అనన్య సామాన్యం. చేతులో పుస్తకం కాని, కాగితాలు కాని, లేదా ఎలాంటి సహాయం కాకుండానే అలవోకగా, సుస్పష్టంగా, విషయ నిర్దిష్టంగా, ప్రణాళికా బద్ధంగా, విద్యార్థుల మనసులను ఆకట్టుకొనే విధంగా, విద్యార్థుల హృదయాల్లో చెరిపోని రీతిలో, పాఠం చెప్పటంలో ఆయనకు ఆయనే సాటి. బోధనలో ఘనాపాటి కొర్లపాటి. ఆదర్శ అధ్యాపకులు వీరు.

వీరిలో పట్టుదల, క్రమశిక్షణ, కార్యదీక్ష ఎక్కువ. అనుకున్న పని సాధించడంలో వీరిని తర్వాత మరొకరిని చెప్పాలి. అందువల్లే పరిశోధకుల్లో మేటి కొర్లపాటి అయ్యారు. అనేక సాహిత్య ప్రక్రియలను చేపట్టి గొప్ప సాహిత్య వేత్త అయ్యారు కొర్లపాటి. సాహితీ సంపన్నులు వీరు. కొర్లపాటి సాహితీ ద్రష్ట, స్రష్ట. బహుముఖ ప్రజ్ఞా ధురీణులు. సాహిత్యరంగంలోనూ, పరిశోధన రంగంలోనూ, విమర్శరంగంలోనూ కొర్లపాటి మహోన్నత శిఖరాలను అందుకున్నారు. శ్రీరామమూర్తిగారు అగ్రశ్రేణి పరిశోధకులు విమర్శకాగ్రేసరులు. కొర్లపాటి పర్యవేక్షణలో 25 పరిశోధనా గ్రంథాలు వచ్చాయి. పశ్చిమ గోదావరి జిల్లా కళాశాల (భీమవరం-1953), అభ్యుదయ కళామందిర్ (అమలాపురం (1956), శ్రీనాథ జయంతి (నెల్లూరు-1972), లిటిల్ థియేటర్ (హైదరాబాద్-1977), ఎస్.కె.బి.ఆర్. కళాశాల (అమలాపురం), ఎర్రన సాహిత్య పీఠం (ఒంగోలు-1986), డాల్ఫిన్స్ ఆర్ట్స్ కల్చరల్ అకాడమి (విశాఖపట్నం), భువన విజయం సాహితీ సంస్థ (విజయవాడ-1987), శ్రీ చెన్న మల్లేశ్వర కళాపరిషత్ (అమలాపురం), కవిత్రయ జయంతి (నెల్లూరు -1989), వెలుగు సంస్థ (విజయనగరం - 1989), ఇలా ఎన్నో ప్రముఖ సంస్థలు కొర్లపాటిని ఘనంగా సత్కరించి గౌరవించాయి.

అప్పాజోష్యుల - విష్ణు భొట్ల ఫౌండేషన్ (యు.ఎస్.ఎ.) వారు (అజో-విభో ఫౌండేషన్) కొర్లపాటికి "ప్రతిభామూర్తి" పురస్కారం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సభ 5 జనవరి 2003లో విజయనగరంలో

జరిగింది. ఆ సందర్భంగా అజో–విభో వారు "ప్రతిభా వైజయంతి – 2003 – తెలుగు సాహిత్య విమర్శక వరేణ్యులు ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి" అనే సన్మాన సంచిక తెచ్చారు. ఈ సంచిక సంపాదకులు డాక్టర్ అక్కిరాజు రమాపతిరావు. నిర్వాహ సంపాదకులు అప్పాజోస్యుల సత్యనారాయణ గారు.

నేను ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లో శ్రీరామమూర్తి గారి పర్యవేక్షణలో "అడివి బాపిరాజు కథలు – కవిత్వం" అనే అంశంపై పిహెచ్.డి. చేశాను. పరిశోధన ఎలా చేయాలి? ప్రామాణికత ఎలా పాటించాలి? లాంటి విషయాలు గురువు గారి దగ్గర నేర్చుకున్నాను. కొర్లపాటి వారే నాకు దిశానిర్దేశకులు. పరిశోధనలో, బోధనలో, ఉత్తములు కొర్లపాటి. వీరి దగ్గర పరిశోధన చేయడం నా జీవితంలో గొప్ప పెద్ద మలుపు.

ఎం.ఏ. చదివే రోజుల్లో నేను ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి గారి బోధనా విధానానికి మిక్కిలి ఆకర్షితుడైనాను. గురువు గారిలా పాఠం చెప్పాలనీ, పరిశోధన చేయాలనీ, అపుడే నిర్ణయించుకున్నాను. గురువు గారి లాగే, అదే రీతిలో, పాఠ్యాంశ విశ్లేషణ, వివరణ ఇవ్వాలనే దీక్షతో, పట్టుదలతో, నిరంతర నిర్విరామం అధ్యయనం చేశాను.

గురువు గారు, కొర్లపాటి వారి మార్గంలో నడవడానికి ప్రయత్నించాను. గురువు గారి దారిలోనే నేను నడుచుకుంటూ మునుముందుకు సాగాను. నా జీవితంలో **"రోల్‌మోడల్"**గా, గురువు గారిని తీసుకున్నాను. చివరకు విజయం సాధించాను.

ఒక రోజు గురువు గారు ఒక పెద్ద సభలో **"సిమ్మన్న నా వారసుడు"** అని ప్రకటించారు. గురువు గారి దగ్గర పరిశోధన చేసిన శిష్యులందరూ ఆ సభలోనే వున్నారు. నా జీవితంలో ఇంతకన్నా గొప్ప విషయం మరొకటి లేదు. జీవితంలో మరపురాని పెద్ద సంఘటన అది.

వివిధ పత్రికల్లో నేను రాసిన వ్యాసాలు చూసి గురువు గారు నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. నేను రాసిన "తెలుగు భాషా చరిత్ర", "తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు", "ఆధునిక భాషా శాస్త్రం", ప్రపంచ భాషలు" మొదలైన గ్రంథాలు చూసి, గురువు గారు నన్ను మనస్ఫూర్తిగా అభినందించారు. నేను పైపైకి ఎదగడానికి ప్రేరకులు, కారకులు, మా గురువు గారే.

ఆంధ్ర విశ్వకళా పరిషత్‌లో నాకు ఉద్యోగం రావడానికి ప్రధాన కారకులు గురువు గారే. ఈ రోజు నేను సమాజంలోనూ, సాహిత్యరంగంలోనూ, గౌరవమర్యాదలతో వున్నాను అంటే అది అంతా గురువు గారి దయే. గురువు గారు నాకు దైవ సమానులు. గురువు గారికి పాదాభివందనాలు.

సాహిత్యమే జీవితంగా, జీవితమే సాహిత్యంగా బ్రతికిన మహామనిషి కొర్లపాటి. వీరు జూలై 26, 2011లో విశాఖపట్నంలో పరమపదించారు.

ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి రచనలు : శ్రీనాథుడు :

శ్రీరామమూర్తి గారు "శ్రీనాథుడు" అనే ప్రమాణికమైన పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని రాశారు. శ్రీనాథుడు రాసిన అన్ని రచనలపై సమగ్ర పరిశోధం ఇది. 1971లో ఇది వెలువడింది. ఈ గ్రంథాన్ని పూర్వ ప్రధానమంత్రి పాములపర్తి వేంకట నరసింహారావు గారికి అంకితం ఇచ్చారు. ఈ గ్రంథంలో చారిత్రక విభాగం, సంస్కృతీకరణం విభాగం, ఆంధ్రీకరణ విభాగం అనే మూడు భాగాలు చోటు చేసుకున్నాయి. ఈ గ్రంథం గూర్చి వెంపరాల సూర్యనారాయణ గారు **"కొర్లపాటి శ్రీనాథుడు సిద్ధాంత గ్రంథము ఐహంకాంధ్ర పరిశోధక ప్రపంచానికి మార్గదర్శి"** అని ప్రశంసించారు.

ఈశ్వరార్చన కళాశీలుడు :

తెలుగులో మొట్టమొదటి డి.లిట్ గ్రంథం ఇది. శ్రీనాథుడు సాహితీలోకంలో శృంగారిగా స్థిరపడిపోయాడు. ఆ అభిప్రాయాల్ని తన పరిశోధన ద్వారా పటాపంచలు చేసి, నిజాన్ని సహృదయ పాఠకులకు తెలియజేశారు కొర్లపాటి. పరిశోధనలో ఉన్నత ప్రమాణాన్ని నెలకొల్పిన ఉత్తమ పరిశోధకులు కొర్లపాటి. వీరు నిరంతర నిర్విరామ పరిశోధనా కృషి అనన్య సామాన్యమైంది. తెలుగు పరిశోధనా ప్రపంచంలో ఎనలేని కృషి చేసిన సాటిలేని మేటి, పరిశోధక పరమేష్ఠి కొర్లపాటి. పరిశోధనకు మారుపేరు కొర్లపాటి. శ్రీనాథుడు శృంగారి కాదు, ఈశ్వరార్చన కళాశీలుడు అని నిరూపించిన **"పరిశోధక శిఖరం"** కొర్లపాటి.

నన్నెచోడుని కుమార సంభవము ప్రాచీన గ్రంథమా? :

నన్నెచోడుడు శివకవి కాదు, నవకవి. కుమార సంభవం ప్రాచీన గ్రంథం కాదు. నవీన గ్రంథం. ఈ గ్రంథం మానవల్లి కూట సృష్టి అని నిర్ధారించారు. ఈ గ్రంథంలో కొర్లపాటి పరిశోధనా పటిమ, విమర్శనా నైపుణ్యం, తులనాత్మక అధ్యయనం ప్రతీ పుటలో కన్పిస్తుంది. తెలుగు గ్రంథాలనే కాక తమిళ, కర్ణాటక భాషల్లోని అనేక గ్రంథాలను బాగా లోతుగా పరిశీలించి, తుది తీర్పు ఇచ్చిన **"పరిశోధక సమ్రాట్"** కొర్లపాటి.

నాథయోగి మన వేమన :

వేమనపై కొర్లపాటి రాసిన విశిష్ట ప్రామాణిక గ్రంథం ఇది. ఈ గ్రంథంలో అనేక ప్రత్యేకతలున్నాయి. ఇందులో నిశితమైన చారిత్రక పరిశోధన చోటు చేసుకుంది. లోతైన అద్భుతమైన పరిశోధన, విమర్శన గ్రంథం ఇది. వేమన నాథ సంప్రదాయానికి సంబంధించిన యోగిగా చెప్పడమే, ఈ పరిశోధన గ్రంథ ప్రధాన లక్ష్యం. వేమన పద్యాల్లోని నాథ సంప్రదాయాన్ని గూర్చి తమదైన దృక్పథంతో పరిశోధన చేశారు **"పరిశోధక తపస్వి"** కొర్లపాటి.

విశిష్ట పరిశోధన వ్యాససంపుటాలు :

కొర్లపాటి వ్యాసాలు "కావ్య జ్యోత్స్న", "సాహిత్య సంపద", "చరిత్ర చర్చ", "సాహిత్య సమస్యలు", "వ్యాస మంజరి" అనే ఐదు సంపుటాలుగా వచ్చాయి. మొత్తం వ్యాసాలు 38. ఈ వ్యాసాలే కాక ఇంకా ఎన్నో పరిశోధన వ్యాసాలు వీరు రాశారు. ఈ వ్యాసాలన్నీ పరిశోధనాత్మకమైనవి. విమర్శనాత్మకమైనవి. తులనాత్మకమైనవి. చారిత్రకమైనవి. విలువైనవి. పరమ ప్రామాణికమైనవి.

ఈ వ్యాసాలు కొర్లపాటి పరిణత పరిశీలనకు ప్రజ్ఞా పాటవానికి నిదర్శనాలు. విషయ వివేచనా పరంగానూ, ఈ వ్యాసాలు ఉన్నతస్థాయికి చెందినవి. వీరి ఒక్కొక్క వ్యాసం ఒక్కొక్క ఎమ్‌ఫిల్ పరిశోధనా గ్రంథంతో సమానం. సత్యశోధనలో సత్యమూర్తి శ్రీరామమూర్తి. **"పరిశోధక పంచానన"** కొర్లపాటి.

తెలుగు సాహిత్య చరిత్ర : శ్రీరామమూర్తి గారు ప్రాచీన "తెలుగు సాహిత్య చరిత్ర"ను రాశారు. ప్రామాణిక పరిశోధనా ప్రతిభకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచే రచన, "తెలుగు సాహిత్య చరిత్ర ". వీరి జీవిత అనుభవ సారమంతా ఈ ఐదు సంపుటిల్లో వుంది. మొత్తం 2,410 పుటలు వుంది. ఈ గ్రంథాల్లో లోతైన పరిశీలన, పరిశోధనా పటిమ, విమర్శనా దృక్పథం, బోధనా నైపుణ్యం చాలా స్పష్టంగా కన్పిస్తున్నాయి. సాహితీమూర్తి శ్రీరామమూర్తి. ఈ సాహిత్య చరిత్రలో ఊహలకు ఏ మాత్రం తావులేదు. ప్రామాణికంగా, సరైన ఆధారాలతో రాయడం కొర్లపాటికి వెన్నతో పెట్టిన విద్య.

కొర్లపాటి సాహిత్య చరిత్రలో గొప్పతనం ఏమంటే ఇతర సాహిత్య చరిత్రలో లేనిది, ఈ గ్రంథంలో వుంది. అది ఏమంటే ఒకే మారు సహృదయ పాఠకుడు సాహిత్య చరిత్రను, కవితా సమీక్షను తెలుసుకోవడం. ఎవ్వరూ ఎప్పుడూ, ఎక్కడ, చెప్పని అనేక అంశాలను కొర్లపాటి తన సాహిత్య చరిత్రలో చెప్పారు. అందుకే కొర్లపాటి గురువు గారు, డాక్టర్ సందూరి కృష్ణమాచార్య గారు కొర్లపాటి సాహిత్య చరిత్ర గూర్చి చెప్తూతూ **"నీ చేతిలో వాఙ్మయ చరిత్ర పరాకాష్ఠ చెందింది"** అని అన్నారు. ఇది శతశతాంశం సత్యం. అటు పరిశోధనలోనూ ఇటు విమర్శలోనూ కొర్లపాటి సవ్యసాచి.

సృజనాత్మక రచనలు : కొర్లపాటి "ధర్మజ్యోతి", "పొందవుల మెట్ట", "పలనాటి వీరచరిత్ర", శ్రీకృష్ణదేవరాయలు" అనే గొప్ప చారిత్రక పరిశోధన నాటకాలు రాశారు. భువన విజయం అనే చారిత్రక నాటికను రాశారు. "పెద్దమనిషి", "పట్టుదల", "సమత", "పదవి", "నటన" అనే సాంఘిక నాటికలు రాశారు. వీరు చేసిన సంస్కృతానువాద నాటకం "ప్రతిజ్ఞ"కి మంచి పేరు వచ్చింది. "చిత్రశాల" అనే చారిత్రక నవలను రాశారు. "గుడి గోపురం", "వీణ" అనేవి కథాసంపుటాలు. "సువర్ణరేఖలు" అనే అద్భుతమైన కవితా సంపుటి రాశారు. సృజనాత్మక ప్రతిభాశాలి కొర్లపాటి.

అనువాదం :

"ది నార్త్ ఇండియన్ టెంపుల్స్" బై కృష్ణదేవ అనే ప్రసిద్ధ ఆంగ్ల పరిశోధన గ్రంథాన్ని అనువాదం చేశారు. (నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా).

అనేక సాహిత్య ప్రక్రియల్ని చేపట్టి, తెలుగు సాహిత్య ప్రపంచంలో పరిశోధన రంగంలో, తనకంటూ ప్రత్యేకమైన, విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి.

"పూర్వాచార్యులు, మా, మీ, సమకాలికులు ఎవళ్లూ చేయని, సాధించని, ఆంధ్ర సాహిత్యేతిహాస రచనను సమగ్రంగా, సప్రమాణంగా, వ్రాసిన మీకు మా అందరి నమోవాకములు. వినయభూషితులైన మీరు ఇది అంగీకరించ పోవచ్చును గాని, సత్యాన్ని దాచలేము గదా!".

- ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు

'శ్రీనాథుడే వచ్చి తన్ను గూర్చి విమర్శకులు చేసిన వాద ప్రతివాదనలనన్నింటిని చదివినచో నాయనా నాయాత్మ స్వరూపమును, శివతాదాత్మ్యమును, ఆధ్యాత్మిక చింతనను అని శ్రీరామమూర్తిని ఆశీర్వదించి యుండునని నా విశ్వాసము."

- ఆచార్య గంటి జోగి సోమయాజి

గిడుగు దర్శనం.....35 పుట కొనసాగింపు

ఇక అనుబంధం-1లో చంద్రశేఖర రావు గారు రాసిన నాలుగు వ్యాసాలు ఉన్నాయి. గిడుగువారి రచనలు, వాటిపై పండితులు వ్యక్తం చేసిన అభిప్రాయాల ఆధారంగా గిడుగువారి భాషపై వెల్లడి చేసిన విధానం పాఠకులను ఆలోచింప చేస్తుంది. గిడుగువారి జీవిత ఘట్టాల ఆధారంగా వారి అంతరంగాన్ని ఆవిష్కరించిన తీరు అభినందనీయం. ఆచార్య చేకూరి రామారావుగారూ, ఆచార్య స్టాన్లీ స్టరోస్టా మొదలైనవారి వ్యాసాల ఆధారంగా విశిష్ట భాషా శాస్త్రవేత్తగా గిడుగు తెలియవచ్చారు. ఈ వ్యాసాలలో గిడుగు భాషాశాస్త్ర పాండిత్య ప్రకర్షను విశదం చేసిన తీరు శ్లాఘనీయం. గిడుగువారి భాషా బోధన పద్ధతులూ నిఘంటుకారుడుగా గిడుగు ప్రతిభను పట్టిచూపారు. వ్యాసంలా కాకుండా కథలా చెప్పడం ఈ రచన ప్రత్యేకత.

అనుబంధం 2: గిడుగువారు రచించిన సవరవాచకాలు, వారు సేకరించిన సవరల పాటలకు చంద్రశేఖరరావుగారి అనువాదాలు ఉన్నాయి. అనుబంధం 3: లో ఉన్న సవర మాన్యుయల్ పై చేసిన విశ్లేషణ చంద్రశేఖరరావుగారికి మాత్రమే సాధ్యమైనది. ఇంగ్లీషులో అంతర్జాతీయ ధ్వని లిపిలో ఉన్న గిడుగువారి సవర మాన్యుయల్‌ని చంద్రశేఖరరావుగారు తెలుగులో విశ్లేషించిన తీరు ఆలోచింపదగినది. ఈ విధంగా గిడుగువారి జీవితాన్ని, చరిత్ర పరిశోధననూ, సవరభాష పరిశోధననూ, వ్యావహారిక భాషోద్యమ నిర్వహణనూ చంద్రశేఖరరావుగారు దర్శించి మనకు ఈ రచనా రూపంలో ప్రదర్శించిన తీరు అభినందనీయం.

కొత్త పుస్తకాలు ....35వ పుట కొనసాగింపు.

వెలువడింది. ఇది ఎనిమిది ప్రధాన వ్యాసాలతో, ప్రముఖుల అభిప్రాయాలనూ రచయితల పరిచయాలనూ చిన్నయసూరిగారి చేతివ్రాతనూ వంశవృక్షాన్నీ, ఆధారగ్రంథ సూచికనూ కలుపుకొని మొత్తం నూట అరవై ఎనిమిది పుటల పుస్తకం. ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేసే విద్యార్థులకు, పరిశోధకులకు, అధ్యాపకులకు ఈ గ్రంథం ఎంతగానో ఉపయోగపడుతుంది.

రచయిత, ఆంధ్రలొయోల కళాశాలలో
తెలుగు ఉపన్యాసకుడు

మధురాంతకం నరేంద్ర
9866243659

విశ్వమానవుడు వాకాటి

వాకాటి పాండురంగారావుగారిని తలచుకుంటేనే గుర్తుకొచ్చే కథలు మూడు: సృష్టిలో తీయనిది, ఆర్. చక్రారావు, అపరాజిత. ఆ మూడు కథలూ నేను ఆయన్ని కలవకముందే చదివాను. 1990 ప్రాంతాల్లో ఆయనను తొలిసారిగా కలిశాక కూడా ఆయన చాలా కథలు రాశాడు. వాటిలోనూ చాలా మంచి కథలు గుర్తుకొస్తుంటాయి గానీ, చిన్ననాటి నా మనసు పైన ఆ మూడు కథలు ఛిన్నగా, బలంగా ముద్రవేసుకున్నాయి.

'సృష్టిలో తీయనిది' కథను మొదటిసారిగా చదివినప్పుడు నా వయస్సు యిరవయ్యేళ్లయినా వుండదు. యిప్పుడు ఆ కథేమిటో జ్ఞాపకం లేదు. కానీ టేబుల్ ఫాన్ తిరుగుతోంది అనే వాక్యంతో ఆ కథ ముగుస్తుందని మాత్రం బాగా గుర్తుంది.

మా నాన్నగారికి బాగా ఇష్టమైన తెలుగు కథల్లో ఆర్ చక్రారావు ముఖ్యమైనది. దాన్ని ఆయన ఎన్ని వ్యాసాల్లో పేర్కొన్నారో లెక్కలేదు. ఆర్ చక్రారావు కిందిమధ్యతరగతి వాళ్లకి ఓ ప్రతినిధి. అతను గొడుగు కొనుక్కుందాం అనుకుంటుండగానే వర్షాకాలం వెళ్ళిపోతుంది. ఇక గొడుగెందుకులే అనుకుంటాడు. అతను శాలువాలు కొనాలనుకుంటూ ఉండగానే చలికాలం వెళ్ళిపోతుంది. ఏ ఋతువుకు తగ్గట్టు ఆ ఋతువులో బతకలేని ఆ బడుగు జీవి అసలు పేరు ఋతు చక్రారావు.

అపరాజిత అనే పేరంటేనే తనకెంతో ఇష్టమని వాకాటిగారే చెప్పుకున్నారు. అవసరమైన ఆపత్కాలంలో కుటుంబాన్నంతా ఆదుకున్న సబల కథ ఇది. వాకాటిగారు తమ పెద్దమ్మాయికి అపరాజిత అనే పేరు పెట్టుకున్నారు.

సమకాలీనులైన తోటి రచయితలపైన గౌరవమూ, స్నేహమూ వుండిన మంచి కాలానికి చెందినవాళ్ళు వాకాటిగారూ, మా నాన్నగారూ. వాళ్లిద్దరికీ మధ్య వుండిన స్నేహం చాలా విశిష్టమైంది. ఉద్యోగ రీత్యా వాకాటిగారు ఢిల్లీ, విశాఖపట్నం, హైదరాబాదు లాంటి ఊర్లన్నీ తిరిగారు. ఆయన విశాఖపోర్టు ఉద్యోగిగా వున్నప్పుడు, ఏదో సాహిత్య సభలో పాల్గొనడం కోసం మా నాన్నగారు విశాఖకు వెళ్లారు. అంతవరకూ ఉత్తరాల ద్వారా కొనసాగిన వాళ్ళ స్నేహం ఆ తర్వాత వ్యక్తిగత స్నేహంగా మారి ప్రగాఢమైపోయింది.

వాకాటిగారు ఆంధ్రప్రభ వారపత్రికకు సంపాదకుడైన తర్వాత దాన్ని తెలుగు కథకు, నవలకు పెద్ద ఆలంబనగా తీర్చిదిద్దారు. కథాప్రభ పేరుతో ప్రతి వారమూ మంచి కథలు ఎన్నో ప్రచురించారు. ఆ శీర్షిక కింద మా నాన్న గారి కథలతో బాటూ, నేను రాసిన కథలూ, మా తమ్ముడు రాసిన కథలూ చాలా వచ్చాయి. ఆంధ్రప్రభలో మిత్రవాక్యం పేరుతో ఆయన రాసిన సంపాదకీయాలు బాగా ప్రాచుర్యంలోకి వచ్చాయి.

ఆ సమయం లోనే వాకాటిగారు తిరుమల తిరుపతి దేవస్థానాల పనిపైన తిరుపతికి వచ్చా రు. అప్పుడు మా నాన్న గారిని కలవడానికి ఆయనతో బాటూ, తిరుమల రామచంద్రగారూ, మంజుశ్రీ గారూ మా ఇంటికి వచ్చారు. ఒక రోజున వాకాటిగారు అప్పలాయగుంటకు వెళ్లాలన్నారు. ఇప్పటిలా అప్పుడు ఆ ఊరికి మంచి రోడ్డు లేదు. మిట్టలూ, పల్లాలూ ఉండే ఆ గతుకుల రోడ్డు పైన నా బజాజ్ కబ్ వాహనం పైన నేను ఆయనను జాగ్రత్తగానే తీసుకెళ్లగలిగాను. అప్పలాయగుంటలో వెంకటేశ్వరుడి గుడి పెద్దది ఉంది. తిరుమలలో, శ్రీనివాస మంగాపురం లో లాగే అప్పలాయిగుంట గుడిలో కూడా వెంకటేశ్వరుడి విగ్రహం పెద్దగా అందంగా ఉంటుంది. ఆ గుడిలోకి వెళ్లాక వాకాటిగారు ఆలయ ముఖ్య పూరోహితుడిని కలిశారు. ఆయన కూడా వాకాటివాడే! వాకాటిగారికి బంధువు గూడా! వాకాటిగారి పూర్వీకులది ఆ ఊరేనని అప్పుడు గానీ నాకు తెలియలేదు. యిప్పటికీ వాకాటిగారు చిత్తూరు జిల్లావాడేనన్న సంగతి చాలా మందికి తెలియదు. ఆయన మద్రాసు లోనే పుట్టాడు. ఆయన రాసిన చాలా కథలు మదరాసు నేపథ్యంలోనే సాగుతాయి. ఆయన తండ్రి బహుశా అప్పలాయగుంట ప్రాంతంనుంచీ మదరాసుకు వెళ్ళి వుండవచ్చు . వాకాటిగారి బాల్యమూ, యవ్వనమూ మదరాసులోనే జరిగినట్టు ఆయన కథలు నిరూపిస్తాయి. ఆయన రాతల్లో ఎక్కడా ఏ ప్రాంతీయ మాండలిక వాసనలూ కనిపించక పోవడంతో ఆయన ఏ ప్రాంతంవాడో చెప్పడం కష్టమైపోయింది.

ఆంధ్రప్రభ నుంచీ వాకాటిగారు ఆంధ్రప్రదేశ్ టైమ్స్ అనే ఇంగ్లీషు పత్రికకు సంపాదకుడిగా వెళ్లారు. తెలుగు సాహిత్యానికి ఆ పత్రికలో పెద్దపీట వేశారు. ఆ పత్రిక కోసం ప్రతి నెలా ఒక తెలుగు కథను ఇంగ్లీషులోకి అనువాదం చేసి పంపమని చెప్పారు. నేను చిలుకూరి దేవపుత్రగారి కథ బందీని అనువదించి పంపితే ప్రచురించారు. ఇంతలోనే ఆయన ఆ పత్రికనుంచీ బయటికి వచ్చేశారు. లేకపోతే ఆయన నా చేత మరికొన్ని అనువాదాలు చేయించి వుండేవాడు.

వాకాటిగారు నిరంతర అధ్యయన శీలి. మన సంప్రదాయ సాహిత్యంతో బాటూ పాశ్చాత్య సాహిత్యాన్ని కూడా బాగా చదువుకున్నవాడు. ఆయనకు హిందూమతం పైనా, దాని సిద్ధాంతాలపైనా చాలా నమ్మకం ఉండేది. అందుకే ఆయన అప్పటి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు దగ్గరయ్యాడు. వాళ్ళ సిద్ధాంతాల వ్యాప్తికోసం చాలా చోట్లకు వెళ్ళి ఉపన్యాసాలు ఇచ్చేవాడు. అలా తిరుపతికి కూడా వచ్చి వెంకటేశ్వరా యూనివర్సిటీలో కొన్ని ప్రసంగాలు చేశారు. నేనే తీసుకెళ్ళి ఆ సభాప్రాంగణాల్లో విడిచిపెట్టి వచ్చేవాడ్ని. నేను ఆ సిద్ధాంతాలకు దూరమని తెలిసినా ఆయన నాతో ఆ ప్రసక్తి తెచ్చేవాడు కాదు.

ఆయనంతగా సైన్సును చదువుకున్నవాళ్ళు బాగా అరుదు.

ఆయనలా సైన్సు, తాత్విక, ఆధ్యాత్మిక విషయాల గురించి నిరంతర అన్వేషణలా అధ్యయనాన్ని కొనసాగిస్తూ జీవించిన ఆలోచనా జీవులు అరుదుగా ఉంటారు. ఓ వ్యక్తికి చికిత్స చేయకపోయినా, తనకు చికిత్స అందినట్టు భావించినప్పుడు, అతడు ఆ అనారోగ్య పరిస్థితి నుంచి బయటపడతాడనే ప్లేసిబో ఎఫెక్ట్ గురించి కథ రాసేందుకు ఆయన ఆర్థర్ షేపిరో, హెన్రీ బీచ స్టూవర్ట్ ఫుల్స్, లూయీ లాసాగ్నా వోల్టర్ బి కానన్ బ్లాక్ వెల్‌ల వంటి శాస్త్రజ్ఞుల రచనలు చదివాడని తెలిసినప్పుడు ఆశ్చర్యపోతాం. అయితే భౌతిక శాస్త్రాలకూ అధిభౌతిక విషయాలకూ మధ్య ఆయనదే అయిన తార్కిక విశ్లేషణలూ, నమ్మకాలూ చాలా ఉండేవి. ఎదుటి వ్యక్తిని శాస్త్రీయమైన చర్చతోనే తన నమ్మకాలపైన విశ్వాసం కుదిరేలా చేయడానికి ఆయన ప్రయత్నించేవాడు. తాను నమ్మినవాటిని స్పష్టంగా బాహాటంగా చెప్పటానికి ఆయన ఎప్పుడూ వెనుదీసింది లేదు. పునర్జన్మను గురించిన నమ్మకాల్ని గురించి ఆయన రాసిన నిమరణం ఒక కామ్నా పుస్తకం శాస్త్రీయమైన చర్చగా మారి భౌతిక శాస్త్రజ్ఞులకు కూడా ఆలోచింప చేసేలా ఉంటుంది.

దేవుడున్నాడా లేడా అనే విషయాన్ని గురించి ఆయన శివాన్విత అనే కథలో చేసే విచికిత్స ఎంత ఆలోచనాత్మకంగా ఉంటుందో గమనించండి: 'కనబడేది పదార్థం. ప్రత్యక్షంగా కనపడనిది శక్తి. కానీ అవి రెండూ ఒకటేనని నేటి సైన్సు చెబుతూంది. సూక్ష్మాణు లోకంలో జరిగే సృష్టి సంహారాలను చూస్తుంటే పదార్థం అనేది శక్తి కెరటాల మధ్య అతి తాత్కాలికంగా ఉండే సంబంధం మాత్రమే అని తేలుతుంది. కనుక నమ్మడానికి ప్రమాణం ఏది? ఇంద్రియాలా? లేక వాటికి అతీతమైన ఇంకోటి ఏదైనానా?... నన్ను నేను నమ్ము తున్నాను, అంటే సిల్లీగా ఉంటుంది. దాన్ని నమ్మను అంటే అబద్ధం అవుతుంది. కనుక నాలో నేను ఎప్పుడూ ఉంటాను అని చెబితే కొంత బాగుంటుందేమో- దేవుడన్నా, శక్తిఅన్నా, ఇన్ అన్నా నేనే గనుక మల్లెల వాసనను మల్లెలు తెలుసుకుంటాయా, ఆనందిస్తాయా అన్న దానికి అవునంటే మీ ప్రశ్నకు జౌననే చెప్పాలి.' అని చెపుతూ క్లాసికల్ ఫిజిక్స్ , క్వాంటమ్ మెకానిక్స్ లను గుర్తు చేసి, కాంతి వేగం కన్నా ఎక్కువ వేగంగా సమాచారం అందే ప్రయోగాన్ని వివరించి, సైకాలజీ లోని కలెక్టివ్ అన్కాన్స్ దాకా తీసుకొస్తాడాయన.

కోణార్క లోని మైథున శిల్పాలను ఛీఛీడీటీవున్న భార్యకు చూపెడుతూ ఆమె భర్త వివరించే పద్ధతిని చూడండి: 'జీవితాన్ని దోసిళ్ళ నిండా ఎత్తి తాగిన జాతి మాత్రమే సృష్టించగలవు ఈ శిల్పాలు. జీవితానికి నాలుగు గమ్యాలని నిర్ణయించి , అందులో కామం ఒకటిగా గుర్తించి, అన్నిటితో బాటు దానినీ నిండుగా నీతిబద్ధంగా పరిపూర్ణంగా అనుభవించాక, ఈ శరీరపు పరిధి నుండి ఎగరడానికి, హారిజాంటల్ ప్లేనులో అత్యంత వేగం పుంజుకున్నాక వర్టికల్ టేకాఫ్ కు ఒక ప్రయత్నం చేయమని వానప్రస్థం అంటూ ఒక దశను నిర్దేశించిన వివేకవంతమైన నాగరికత యొక్క యవ్వనపు పండు వెన్నెల ఇది. ఈ శిల్పాలను మన ఈనాటి మూసుకుపోయిన దృష్టితో, నీరసపడిపోయిన జవసత్వాలతో, మేడిపండులాంటి నీతి కళ్ళద్దాలతో చూస్తే అర్థం కావు. మనిషి అంతరాంతరాల్లోకి వెళ్ళి దర్శించిన ద్రష్టలు సృష్టించిన వ్యవస్థలో శరీరానికి తగు ప్రాధాన్యం ఇచ్చారు. శరీరాన్ని తోసిరాజన లేదు- అలాగని అవసరానికి మించి ఆరాధించనూ లేదు. భోగాన్ని , యోగాన్ని, ఒకే ఏకాగ్రతతో చూసి, దాని నుండి దీనికి క్వాంటమ్ లీప్ చేసిన మహామనీషులు వదలి వెళ్ళిన గుర్తులు ఇవి' (శివాన్విత).

భారతీయమైన ఆధ్యాత్మికత లోని శాస్త్రీయతల్ని చాటిచెప్పడమూ, పాశ్చాత్య శాస్త్రీయత లోంచి అవసరమైన జ్ఞానాన్ని అందిపుచ్చుకోవడమూ లక్ష్యంగా ఆయన తన సృజనాత్మక, శాస్త్రీయ రచనలను ఆయనదే అయిన విశిష్టమైన పద్ధతిలో చివరివరకూ అదొక ఉద్యమంలా కొనసాగించాడు. అభిప్రాయాలను గుర్తించినా వాటిలోని సామంజస్యాలను తెలుసుకో బూనటమూ, సహించడమూ ఆయన వ్యక్తిత్వంలోని విశిష్టత. సంప్రదాయంలో మంచి ఉంటే దాన్ని నిలుపుకోవడం, ఎప్పటికప్పుడు శాస్త్రీయంగా జీవితాన్ని మలచుకోవడం అయిన వ్యక్తిత్వం లోని విశిష్టత. మౌలికంగా వాకాటిగారు గొప్ప మానవతావాది, నాగరికుడు.

ఇన్నాళ్ళ తర్వాత యిప్పుడు వాకాటిగారిని గురించి నాలుగు మాటలు రాయదలచుకుంటే మళ్ళీ ఆయన 'సృష్టిలో తీయనిది కథే' గుర్తుకొస్తోంది. ఇంతకూ ఆ కథలో జరిగిందేమిటో తెలుసుకోవాలన్న కుతూహలంతో దాన్ని సంపాదించి చదువుకున్నాను. అది ఎమెస్కో సంస్థ అప్పుడు ఇంటింటా తెలుగు గ్రంథాలయం స్కీములో ప్రచురించిన అపరాజిత కథల సంపుటంలో వుంది. అందులో వాకాటిగారు ప్రతి కథకూ దాని పుట్టుక, పెంపుదలలను గురించి ఆసక్తికరమైన ఉపోద్ఘాతాలు రాశారు. 'సృష్టిలో తీయనిది' గురించి చెబుతూ, 'తాను యెంతో చక్కటి అపూర్వమైన చమత్కారాన్నో అందాన్నో, కల్పననో, వర్ణననో, మలుపునో తన రచనలో ఒక చోట రత్నంలా పొదిగి, పాఠకుడు ఆ రచనను అలా చదువుతూ వస్తూ, వస్తూ, హటాత్తుగా ఈ మిరుమిట్లు గొలిపే రత్నం ఎదుట పడి, ఆశ్చర్యపడి భళీ అంటాడు కదా అని ఎదురు చూస్తాడు ప్రతి రచయితా. కానీ సాధారణంగా ఆ రత్నం పాఠకుడి దృష్టికి ఆనకుండానే పోతుంది. పైపెచ్చు రచయిత అతి సామాన్యంగా భావించిన ఒక భాగాన్ని ఎత్తి చూపి ఆహా! ఏమి రాసారండీ! అంటాడు పాఠకుడు. సంస్కార సూచకంగా నవ్వి వూరుకుంటాడు రచయిత. ఇది అందరూ రచయితలకూ ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడు అనుభవంలోకి వస్తుందని నా ఊహ' అని రాశారు. నేను మొదటిసారిగా చిన్నప్పుడెప్పుడో ఈ మాటల్ని చదివానో గుర్తులేదుగానీ వాకాటిగారు ఇలా అన్నారని ఎన్ని సార్లు ఎందరితో చెప్పానో లెక్కలేదు. అంతేకాదు 'సృష్టిలో తీయనిది కథ' చివరి వాక్యంలో అలాంటి రత్నం దాచిపెట్టాననీ అది పాఠకుడు గుర్తించగలిగితే తాను ధన్యుడననీ వాకాటిగారు ఆ ఉపోద్ఘాతంలో రాశారు. ఆ కథను చదివిన నాలుగు దశాబ్దాల తర్వాతకూడా నన్ను ఆ వాక్యం వెంటాడుతూనే ఉందంటే వాకాటిగారి ధన్యతకు వచ్చిన అనుమానమేదీలేదు. 'సృష్టిలో తీయనిది' లోని కథ సంగతికేం గానీ ఆ కథ చిత్తూరు జిల్లా తమిళనాడు సరిహద్దుల్లోని నగరి, పల్లిపట్టు లాంటి చిన్న గ్రామాలకు చేరడం చూసినప్పుడు విశ్వమానవుడుగా ఎదిగిన వాకాటిగారు మా తొండనాడువాడేనని అనుకోవడం ఆనందంగానూ, గర్వం గానూ ఉంటుంది.

రచయిత, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో
ఆంగ్ల భాషాచార్యులు

అంకే శ్రీనివాస్, జి.పేరిందేవి,
9652471652, 9966088201

రేనాటి చోళుల శాసనాలలో ప్రాదేశిక నామాల పదవ్యుత్పత్తి - పరిణామం

తెలుగు భాషలో మొదటిసారి శాసనాలు వేయించినది రేనాటి చోళులు. వీరికన్నా ముందు పాలించిన అనేకమైన రాజవంశాల శాసనాలలో విస్తృతంగా తెలుగుపదాలు ఉన్నట్లు పరిశోధకులు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే స్వచ్ఛమైన తెలుగుభాషలో తొలిసారిగా శాసనాలు వేయించినది మాత్రం రేనాటిచోళులే! రేనాడులో ఏడువేల గ్రామాలున్నట్లు అనేక శాసనాలు తెలియజేస్తాయి. ప్రస్తుత రాయలసీమలోని సింహభాగం క్రీ.శ. ఆరు, తొమ్మిది శతాబ్దాల మధ్య వారి పాలనలో ఉండేది. వీరి శాసనాల అధ్యయనం వల్ల ఆనాటి తెలుగుభాషా స్థితిగతులు అవగతమవుతాయి. వీరి శాసనాలలో ప్రస్తావిదితమైన ప్రాంతాలు, గ్రామనామాలు నేటికి ఏవిధంగా పరిణామం చెందినాయో గమనిస్తే, చారిత్రకంగా ఏవిధంగా తెలుగుభాషా పరిణామం జరిగిన విధానం అర్థమవుతుంది.

1. చిఱుంబూరు

అ) "…. రేనాణ్డు ఏళన్ చిఱుంబూరి రేవణకాలు
(ధనంజయుని కలమల్ల శాసనం క్రీ.శ. 575)

ఆ) "…. సా - మస్తకముళ్ చిఱుంబురు ఏళన్ …"
(విక్రమాదిత్యచోళుని చిలంకూరు శాసనం 7వ శతాబ్దం)

ఇ) "…. ఇచ్చిన చిఱుంబూరి ఉత్తర …"
(సత్యాదిత్యచోళుని మాలేపాడు శాసనం, 8వ శతాబ్దం)

ఈ) "….పిదెలాకు చిఱువూ - రాన తమకటి.
(కొర్రపాడు శాసనం - 8వ శతాబ్దం)

శకటరేఫ ర, ల, డ, ళ అక్షరాలుగా పరిణామం చెందింది. చిఱుంబు, చిఱ, చిఱు అంటే చిన్న. చిన్నవూరు చిఱువూరు. జనవాసాల్ని ఊర్, ఊరుగా వ్యవహరించడం మూలద్రావిడ సాంప్రదాయం. చిఱుంబూరు చిలంకూరుగా మార్పు చెందింది తొమ్మిదో శతాబ్దంలో 'సిఱమకూరు'గా కూడా పిలిచేవారు. చింఱుంబూరు, చిఱువూరు, ముత్యాలచిల్కుకూరు, చిరమకూరుగా రూపాంతం చెందుతూ వచ్చి చిలంకూరు/చిలమకూరు/చెలమకూరుగా స్థిరపడింది.

2. విరిపఱితి

అ) "….వారికి విరిపఱితి పులంబున రెణ్డుతో … టకు..
(పుణ్యకుమారుని రామేశ్వర స్తంభశాసనం - 7వ శతాబ్దం)

ఆ) "…. విరిపఱితి కమ్మఱి విని - యఱ వ్రాసె (పై శాసనం)

విరిపఱితిని ప్రస్తుతం విప్పర్తిగా వ్యవహరిస్తారు. ఇందులోని ద్వితీయావయవమైన పఱితి శబ్దం వర్ణవ్యత్యయంగా పర్తి, పత్రిగా కూడా కనిపిస్తోంది. ఇది భౌగోళిక నైసర్గిక విషయాన్ని వివరిస్తోంది. 'పఱ్' శబ్దం నది లేక వాగు ఒరుసుకొని ప్రవహించే ప్రాంతాన్ని సూచిస్తుంది. ఉదా: విప్పర్తి, పుట్టపర్తి, బొమ్మేపర్తి, తాడిపత్రి మొ. ఇందులో క్రమంగా శకటరేఫ అంతరించి వ ద్విత్వమై స్థిరపడి విప్పర్తి అయ్యింది.

3.చెఞ్గలేరు

"…. చెఞ్గలేరు తొఱు…(చాగలేరు శాసనం - 8వ శతాబ్దం)

ఇది వృక్షసూచితం. కలబంద సంబంధమైన పేరు. ప్రాచీన కాలంలో రాజవంశాల పేర్లు కూడా వృక్ష సూచితంగా ఉండేవి. ఉదా: ఇక్ష్వాకు, పల్లవ, నొలంబ! గ్రామ నామాలలో ప్రథమ ద్వితీయావయాలలో వృక్షవాచకాలు విస్తృతంగా కనిపిస్తాయి. ఉదా: నేరెళ్ళవంక, పెండ్లిమర్రి. ఈ విధంగానే 'చెఞ్గలేరు'నామం ఆవిర్భవించింది. అనునాసికం అంతమై సరళాక్షరం నిలబడిరది. ఏరు జలసూచితం ఏరు. చిన్నచిన్న వాగులు వంకల్ని 'ఏరు' అనేవారు ఈ గ్రామం కడప జిల్లా వేముల మండలంలో చాగలేరుగా పరివేష్టితమైవుంది.

4.కఞ్గకూరు

అ) "….ముత్తురాజు ఏళ కఞ్గలేరు ఏళ."

ఎఱికల్ ముత్తురాజు నల్లచెఱువుపల్లి శాసనం - (7వ శతాబ్దం)

ఆ) "…. ఖటరలు కం గ లూరి పలం."

(పుణ్యకుమారుని రామేశ్వర స్తంభశాసనం - (7వ శతాబ్దం)

రెండవ శాసనంలోని లుప్తాక్షరాలను శాసన పరిశోధకులు పూరించారు. చాఞ్గలేరు శబ్దం లాగా వర్గ అనునాసికాంతం జరిగింది. అంతేకాక వర్గ ప్రథమాక్షరం కూడా లుప్తమయి ప్రస్తుతం 'నగూరు' గా వ్యవహారంలో ఉంది. ఈ గ్రామంలో లభించిన ఎనిమిదవ శతాబ్దంనాటి శాసనంలో 'కారుంగి'లో విసయ్యరేదు అనే వ్యక్తి గురించిన ప్రస్తావన ఉంది. కారుంగ్ని, కఞ్గలూరు రూపాలు నగూరుగా మారాయి. ఈ గ్రామం కడపజిల్లా వేంపల్లి మండలంలో ఉంది.

5. వేళ్పు చెఱువు

"వ్రేంగు వేళ్పు చెఱువున పొజల్కిమి.." (వేల్పుచెర్ల శాసనం)

ప్రథమావయవం 'వేల్పు' దైవసూచితం. చెఱ అనగా బంధించడం. చెఱసాల, చెఱబట్టడం వంటి పదాలు బంధించడాన్ని సూచిస్తాయి. నీటిని బంధించేది చెఱువు చెఱశబ్దానికి తెలుగు ప్రథమా ప్రత్యయం చేరి చెఱవు అయ్యింది. కెఱ / కెఱయ్ గ చెఱువు. శకటరేఫ ప్రభావం వల్ల అంత్యస్వాక్షర ఆదేశం జరిగి ప్రత్యయం లుప్తమయ్యింది. ఇది ముద్దనూరు మండల గ్రామం.

చెఱువు గ చెర్ల, వెళ్పు చెఱువు గ వెల్పుచెర్ల / చర్ల

6. పోఱి/ పోఱ్టి

నేటి తెలంగాణా మాండలికంలో ' పోరి' అని అమ్మాయిని, 'పోరడు' అని కుర్రాడిని పిలిచే విధానం వాడుకలో వుంది. ఇవి దేశ్యపదాలు. కన్నడంలో పోరి(స్త్రీలింగం) పోర(పుంలింగం) పదాలు నేటికీ వ్యవహారంలో నిలిచే వున్నాయి. 'డు' ప్రత్యయం భాషాచారంగా వచ్చి చేరింది. ఈ పోరి, పోర రూపాలు రాయలసీమ మాండలికంలో పోలి,

పోలగా వాడుకలో స్థిరపడ్డాయి. వీటిని నైఘంటికకారులూ గుర్తించే వున్నారు. రాయలసీమకు మాత్రమే ప్రత్యేకమైనది. పాలేగాళ్ళవ్యవస్థ! ఈ వ్యవస్థకు చెందిన ఒక ప్రసిద్ధ సామెత 'ఒక ఊరిపాలేగాడు, ఇంకొకూరికి పసల పోలిగాడు' పోలడు, పోలిగాడు పోరడు, పోరగాడు శబ్దాలు ఒకే కుదురులో పురుడు పోసుకున్నవి! కడపజిల్లా రాజంపేట సమీపంలో 'పొలి' అనే గ్రామం వుంది. ఆ గ్రామ నామానికి, ఈ ఊరిచెఋవుకి సంబంధించిన చారిత్రకాంశాలు చాలా అపురూపమైనవి. ఈ గ్రామానికి చెందిన క్రీ.శ 10,11 శతాబ్దాలకు చె1ందిన ఒక అసాధారణ సంఘటనను మెకంజీ కైఫీయత్తులు- కడపజిల్లా- ఆరోభాగంలోని'పొలి' కైఫీయత్తు వివరిస్తోంది. శత్రువుల బారి నుండీ తన యజమాని కుమారుణ్ణి రక్షించడం కోసం తన కొడుకునే ఫణంగా పెట్టిన'పొలి' అనే వంటగత్తె త్యాగాన్ని గుఱించి ఆ కైఫీయత్తు తెలియజేస్తోంది. అంటే నన్నయకాలం నాటికే' పొఱి' శబ్దం రాయలసీమలో'పొలి'గా రూపాంతరం చెందింది. అదేవిధంగా శ్రీకృష్ణదేవరాయలకు (1509-1529) ఛత్రం పట్టే 'గొడుగు పోలడు' అనే వ్యక్తి గురించీ ఆధారాలున్నాయి.

'పోరి' అనే శబ్దానికి 'పశుపక్ష్యాదులలో స్త్రీ జాతి' అని నైఘంటికార్థం. దీనికి సమాన పర్యాయపదాలుగా 'పెట్ట, పెంటీ, పదాలు కూడా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వ్యవహారంలో ఉన్నాయి. ఆడకోడిని పెట్ట అని పిలిచే పద్ధతీ వుంది. పెట్ట అనే మాటకు సమానార్థకంగా తమిళంలో 'పెట్టై' అంటారు.'పోరి అనే విశేషణ ప్రాతిపదిక నుండి పెట్ట, పెంటి పదాల పరిణామం జరిగి వుందా? 'పెట్ట' అనే విశేష్యశబ్దానికి కావ్య ప్రయోగాలు 15వ శతాబ్దంనుండీ లభిస్తున్నాయి. శ్రీనాథుడు (బెట్టంబోతుం....కాశీ-6-297), చేమకూరి వెంకటకవి (పెట్టయనిగమకించి....సారంగ..1-22), పాలవేకరి కదిరీపతి (శుక-2-33) మొదలైనవారు 'పెట్ట' మాటను ప్రయోగించివున్నారు.

'పెంటి' అనే విశేష్యానికి కూడా పశుపక్ష్యాలలో స్త్రీజాతి అని నైఘంటికార్థం! ఈ మాటను నన్నయ (పఱవ..పెంటిఁ బెనగియున్న.. ఆది-5-53), తిక్కన (విపుల...బెంట్లకు బాటియగుచు.. స్త్రీ 1-102) లు వాడి వున్నారు. కావ్య ప్రయోగాల ఆధారంగా వ్యాఖ్యానిస్తే 'పెట్ట' రూపం మరీ ప్రాచీనమైనది కాదు 'పెంటి' రూపమే ప్రాచీనమైనదిగా కనపిస్తోంది.

'పోతు' శబ్దానికి పశుపక్ష్యాలలో పురుషజాతి అని అర్థం. దీన్ని తమిళ మలయాళ భాషలో 'పోత్తు' గా వ్యవహరిస్తారు. తెలుగులోనే 'పుంజు' అని మగకోడిని పిలుస్తారు కదా! దీనికి కన్నడంలో 'ఉంజ శబ్దం సమానార్థకంగా వుంది. 'పొతకి' అంటే ఆడ పిచ్చుకలలో ఆడజాతి అని శబ్దరత్నాకరం చెబుతోంది కాని, కావ్యప్రయోగాలు కనిపించడంలేదు. అమహద్వాచకాల్లో 'పోతు' రూపానికి జనవ్యవహారంలో విస్తృత ప్రచారం వుంది. ఆబోతు, ఎనుబోతు, దున్నపోతు, మేకపోతు, యిఱ్ఱిపోతు, పోతీగ వంటివన్నీ పుంలింగ అమహత్తులు. జనవ్యవహారంలోని తిండిపోతు, నిద్రపోతు శబ్దాలు పులింగ రూపావిర్భావాలే! ఇవి అతిశయించే లక్షణమాధారంగా క్రమంగా సాధారణీకరణ జరిగాయి. ఇంకో విషయాన్నీ ఇక్కడ జ్ఞాపకం చేసుకోవాలి. మగగొఱ్ఱెను పిలిచే పొట్లి, పొట్టేలు శబ్దాలూ పోతుశబ్దభవాలే! 'పోతు' మాటను మొదట ప్రయోగించినవాడు నన్నెచోడుడు (..పోతుమీద నడ్డంబుబడి.. కుమార-2-206)! పోతు శబ్దాన్ని ఆ తర్వాత శ్రీనాథుడు (బెట్టంబోతుల... కాశీ 6-297), పెద్దన (పోతరించినయిఱ్ఱిపోతులచట...మను 4-22) వంటి ప్రముఖ కవులే వాడి వున్నారు. పుంజు, పోతు రూపాలు ఉకారాంతాలు. తెలుగుభాషకు ఉకారాంతం సహజం. అయితే వీటి మూల ద్రావిడ రూపాలు ఉకారాంతమయ్యే అవకాశం తక్కువ. మూల ద్రావిడ భాష అజంతం కాదు.

కడపజిల్లా ప్రొద్దుటూరు రామేశ్వరస్తంభశాసనంలోని ఈ మాటలను చదవండి..."..విజయరాజ్య సంవత్సరంబుల్ యేనగునాణ్డు వసన్తపోఱి" ఈ శాసనం క్రీ.శ610 నాటిది. అదేవిధంగా 7వ శతాబ్దినాటి నల్లచెరువుపల్లి శాసనంలోకూడా 'పోఱ్ఱి' శబ్దం వుంది. (... మహారాజుల తేవుళ్ మఞ్చు పోఱి...) వసంతపోఱి రేనాటి చోళరాజు పుణ్య కుమారుని భార్య! ఈమె బాదామిచాళుక్యుల ఆడపడచు. పల్లవ, చోళ రాజవంశాల్లోని పడుచులకు 'పోఱి' అనే పేర్లు లేవు. బాదామి చాళుక్య రాజ్యస్థాపకుడై న రెండవ పులకేశి కుమారుడు చంద్రాదిత్యుని భార్య విజయ మహాదేవిపోఱి. తూర్పుచాళుక్య మంగిరాజు కూతురు పృథివిపోఱి. బాదామి చాళుక్యలతో రేనాడు చోళులకు ఏర్పడిన బాంధవ్యాన్ని పోఱి శబ్దం వివరిస్తోంది.

ఈ పేర్లన్నీ సంస్కృత ద్రావిడ సంకీర్ణ రూపాలు. 'వసంతపోఱి' శబ్దం వ్యక్తినామ పరంగా దుష్టసమాసం కాదు. కాని ఋతువాచకంగా వ్యాఖ్యానిస్తే దుష్టసమాసమే! పోలి, పోల, పోరి, పోర, పోఱి శబ్దాలకు మూలం పోఱి (zhi)).

zhi కారం ల,ళ,డ,ర,ద శబ్దాలుగా వర్ణభంగం చెందిందని పరిశోధకులు తేల్చిన విషయమే! మూర్ధన్య ళకారం(ళ) సాధు లకారంగా, శకటరేఫ సాధురేఫగా, మూర్ధన్య 'ట' వర్ణం దంత్య 'త' వర్ణంగా పరిణమించడం అనాదిగా వున్నది. వీటిమధ్య యతిసామ్యమూ వుంది. దీనికి వర్ణసామ్యం, వ్యక్తీకరణసామ్యమూ వుండటమే కారణం. పోఱి, పోఱు, పోరి, పోర, పోలి, పోల, పోతు, పోతకి, పుంజు, పెట్ట, పెంటి శబ్దాలన్నీ ఒక కుదురునుండీ ఆవిర్భవించినవి! అయితే రాయలసీమలోని ప్రొద్దుటూరి శాసనం, నల్లచెఱువుపల్లి శాసనాల్లోని 'పొఱి' వాడుక 10వ శతాబ్దానికే పోలిగా రాయలసీమలోనే రూపాంతరం చెందింది. తెలంగాణలో మాత్రం నేటికీ మార్పు చెందకుండా వాడుకలో వుండటం అద్భుతం, ఆశ్చర్యం! అయితే పోఱు, పోఱి శబ్దాలకు కావ్య ప్రయోగాలు నాకు లభించలేదు. భావి పరిశోధనల ద్వారా వెలుగులోకి వస్తే సంతోషం. zhi రూపం సాధురేఫకు కొంతముందుగాగాని, ఆ తర్వాత గానీ మూర్ధన్యలకారంగానూ పరిణమించి వుండవచ్చు. అయితే ఆ రూపాలు కాల గర్భంలో కనుమరుగై వుండవచ్చు.

'పోరు' అంటే పోరాటం, యుద్ధం అని అర్థం. దీని అధారంగా పోరాడు, పోరితమాడు, పోరించు, పోరితము, పోరాటము, పోరామి, పోరాని వంటి రూపాలు వ్యవహారంలో, కావ్య ప్రయోగాల్లో వున్నాయి. ఈ 'పోరు' అనే మాట' పోరు' (zha)శబ్ద జన్యమా అని అనుమానం! భయస్థుణ్ణి పిరికివాడు, పెట్టవాడు, పెట్టోడు అని ఎద్దేవా చేయడం రాయలసీమ మాండలికంలో వుంది. అంటే ఆడవారితో సమానమని అర్థం. పురుషాధిపత్య ప్రాచీన ఫ్యూడల్ వ్యవస్థలో స్త్రీని అబలగా చూడటం జరిగింది! అందుకే అలా పౌరుషహీనుల్ని పిలిచేవారు. కాని

పోరు, పిరికి, బీరువు పదాలు (zha) శబ్దజన్యాలూ అని నిరూపించడానికి అధారాలు లేవు.

పై చర్చవల్ల 10వ శతాబ్దం నాటికే రాయలసీమ మాండలికం విలక్షణంగా పరిణమిస్తోందని అర్థమవుతోంది. 6,7 శతాబ్దాలనాటి తెలుగుశాసనాలన్నీ రాయలసీమలో లభించినవే! మిగిలిన ఆంధ్రదేశంలో 6,7 శతాబ్దాలకు చెందిన తెలుగు శాసనాలు లభించలేదు. అందువల్ల తొలినాటి తెలుగుభాష పరిణామ స్వరూపాలను చర్చించడానికి అవకాశమే లేకుండా పోయింది.

7. తిర్పులూరు

"కత్తిశమ్మ తిర్పులూరు పనాశ..." (పుణ్యకుమారుని తిప్పలూరు శాసనం - 7వ శతాబ్దం)

ప్రస్తుతం యర్రగుంట్ల మండలంలో ఈ గ్రామం వుంది. తిప్పలూరులో కత్తిశర్మ అనే వ్యక్తికి ఉన్న పన్నులేని భూమి గురించి వివరిస్తోంది. 16వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయలు అష్టదిగ్గజాలకు దానం చేసిన దాన శాసనం కూడా ఈ గ్రామంలోనే లభించింది. పుణ్యకుమారుని శాసనంలోని వలపలగిలక పదవ శతాబ్దానికే లుప్తమయ్యింది. ఓష్ఠ్యం ద్విత్వమై తిప్పలూరుగా స్థిరపడింది. తిర్పులూరు

8. చెపలియ

"ఉత్తమోత్తము - యిన వాంతు చెపలియ పటుకాను రేనాణ్డుళచు..

పుణ్యకుమారుని తిప్పలూరు శాసనంలోని ఈ వాక్యం ప్రకారం రేనాటిచోళుల రాజధాని చెప్పలి."ఉత్తమోత్తమమైన "చెప్పలి" పట్టుగా (ఆధారంగా) రేనాడును ఏలుతూ.." అని పై శాసన వాక్యానికి అర్థం. ఈ గ్రామం నొలంబుల కాలంలో కూడా చాలా ప్రఖ్యాతి గాంచింది. ఇక్కడ ఘటికలు కూడా ఉన్నట్లు వారిశాసనాలు తెలియజేస్తున్నాయి. చెఱువు + పల్లె చెర్పలియగా వర్ణసమీకరణం జరిగిందని కేతు విశ్వనాథ రెడ్డి చెప్పారు. చెర్పలియ > చెర్పలి > చెప్పలి.

విప్పర్తి, తిప్పలూరు, చెప్పలి గ్రామనామాల శబ్దపరిణామం ఒకేవిధంగా జరగడం గమనార్హం. రేఫ, శకటరేఫ, వలపలగిలకలు లోపించడమే గాక 'ప' ద్విత్వమవుతోంది.

తిర్పలూరు > తిప్పలూరు; విరి పఱితి > విప్పర్తి

చెర్పలియ > చెప్పలి

ఉచ్ఛారణ సౌకర్యమే ధ్వని పరిణామానికి మూలమని మరొక్కసారి ఋజువయ్యింది. కమలాపురం మండలంలో పెద్దచెప్పలి, చిన్నచెప్పలి గ్రామాలున్నాయి.

9. బీరపాఱు

"...హిరణ్య రాష్ట్రే సుప్రయోగ నద్యా దక్షిణ తీరే బీరపాఱు గ్రామ నామ:

(పుణ్యకుమారుని మాలేపాడు శాసనం 7వ శతాబ్దం), సస్య సంబంధమైన వృక్షవిశేషం. పాఱు శబ్దం పత్ నుండి జన్మించినది. సాధురేఫ క్రమంగా లకారంగా పరిణమించింది. ద్వితీయావయాలలోని పాఱ్ఱు రూపం పాడుగా మారడం జైనమత ఉత్థానపతనాలను సూచిస్తోందా అనే ఒక అనుమానం ఉంది. స్థావరం, గ్రామం, వంటి అర్థాలతో పాటి, పాటం రూపాలున్నట్లు ద్రా.వ్యు.ప. వివరిస్తోంది. ఉచ్ఛారణ సామీప్యత కూడా పాఱు శబ్దం పాడు గా రూపాంతరం చెందడానికి మరొక కారణం! బిల్లుపాడు ప్రస్తుతం నెల్లూరు జిల్లా ఆత్మకూరు సమీపగ్రామం.

10. అఱితిరేవుల

అ)"... బిల్లియ చో ((zha) మహారజుల ఉత్తరాయన నిమిత్తంబున నఱితిరేవుల సహా .."

(మద్రాసు మ్యూజియంలోకి బిల్లియచోళుని తామ్ర శాసనం
- 8వ శతాబ్దం.)

ఆ)"..దక్షిణాయన సంక్రాన్తి నిమిత్తమ్మున నఱితిరేవుల"

(మద్రాసు మ్యూజియంలోని వైదంబ త్రినేత్రుని శాసనం
- 9వ శతాబ్దం)

"ఆత్తి" వృక్ష నామ సూచితం (మేడి). అత్తి, అత్తీ, అత మొదలైనవి. ద్రావిడ వ్యుత్పత్తి పదకోశం (DEDR) 144 లేక 317, 321)- ప్రకారం "ఆర్తి" అని కేవలం తుళుభాషలోనే ఉంది. వృక్షసూచితమైన మద్దిరాల, ఎప్పిరాల, వేపరాల, వద్దిరాల లాగా ప్రథమావయవం ఇక్కడ కూడా వృక్షసూచితం. తేవు > రేవు/ రాళ్ళ. తేవు జలసూచితం. కేతు విశ్వనాథ రెడ్డి గారన్నట్లు హత్యరాల అత్తిరాలగా రూపాంతరమై లోక నిరుక్తిగా, కృతక ప్రామాణికంగా ఉన్నదని చెప్పిన మాటవాస్తవమే! ఇది రాజంపేట సమీపంలో ఉంది.

ఇప్పుళోలు, ఇనుంబ్రోలు అనే గ్రామ నామం రేనాటి చోళుల శాసనాలలో కనిపిస్తోంది. ఇది ప్రస్తుతం "ఇనుప్రోలు"గా మారే అవకాశం వుంది. అయితే ఈ గ్రామాన్ని ప్రస్తుతం గుర్తించడం సాధ్యం కావడం లేదు. క్రీ.శ. తొమ్మిదవ శతాబ్దం నాటి పులపుత్తూరు శాసనంలో ఉన్న "సిద్ధవటం"గ్రామ నామం నేటికీ ఏవిధమైన మార్పు లేకపోవడం విశేషం.

ఆరవ శతాబ్దం నాటి ప్రాదేశిక భౌగోళిక నైసర్గిక నామాలను విస్తృతంగా సంస్కృతీకరణ చేయడం జరిగింది. రేనాడును హిరణ్య రాష్ట్రంగా, పెన్నానదిని "సుప్రయోగ" గా సంస్కృతీకరించారు. సంస్కృత మహాభారతం. వాయు మార్కండేయ పురాణాలు, పుణ్యకుమారుని మాలెపాడు తామ్రశాసనం, పల్లవ విష్ణుగోపుని ఉప్పరపల్లి శాసనాలలో పెన్నానదిని సుప్రయోగ గానే పిలిచారు. అదేవిధంగా రాజంపేట సమీపంలోని చెయ్యేరుని బాహుద / మహాబాహు అని సంస్కృతీకరణ చేశారు.

ఈ విషయంపై, ఇప్పటికే ఇలాంటి వివరాలను ఎన్నింటినో ఇంతకు మునుపు, వెంకటరమణయ్య, పివిపి శాస్త్రి, బూదరాజు రాధాకృష్ణ, మల్లంపల్లి సోమశేఖర శర్మ, కె. శ్రీనివాసులు, ఏ. ఉమామహేశ్వర శాస్త్రి, ఈమని శివనాగిరెడ్డి గార్ల కడప జిల్లా శాసనాల చరిత్ర పుటలలో పేర్కొనడం వారి పేర్లను ఈ చివరిమాటలో పేర్కొనడం జరిగింది.

రచయితలు, అధ్యాపకులు ప్రభుత్వ కళాశాల
అం.ప్ర. మోడల్ స్కూల్-జూనియర్ కళాశాల, అనంతపురం.

నేలా, నింగీ, నీరూ గాలి వలెనే అమ్మనుడి కూడా! మాతృభాషలో మాట్లాడటం మన హృదయ స్పందనకు రూపం ఇవ్వడమే!

గాదేపల్లి దివాకర దత్
99632 45144

'సాహిత్య సంకీర్తకుడు' గ్రంథావిష్కరణ సభ



"అవును (ఔను)
నేను రైతుగురించి వ్రాస్తాను.
ఎందుకా?
అన్నం తినేవాణ్ణి కనుక!" (24, 25 అక్షరాల మినీ కవిత)

ఈ మినికవిత చదివాక పాఠకుడు మన భారతదేశం గురించి, రైతు దురవస్థ గురించి ఆలోచించకుండా ఉండలేడు.

ఇల్లాంటి కవితారచన అల్పాక్షరాలలో అనల్పార్థ రచన మహాకవులకు తప్ప మామూలు కవులకు సాధ్యం కాదు. 'ప్రాణహిత' కవితాసంహిత సన్నిధానం నరసింహశర్మ కవి సృష్టి, ఈ కవితాసంహితలో ఆలోచనాత్మక మినీకవితను నిక్షిప్తం చేసి నవభారతానికి దశ, దిశా నిర్దేశిస్తారు సన్నిధానం.

సన్నిధానం నరసింహశర్మ పశ్చిమ గోదావరిలోని కోవ్వూరు సమీపగ్రామం కుమారదేవంలో (గోదావరి తీరగ్రామం) 1945 డిసెంబరు 7న పుట్టారు. చిన్నతనంలోనే రాజమహేంద్రవరం చేరుకుని 15 ఏళ్ళ చిరుప్రాయంలో గౌతమీ గ్రంథాలయంలో పుస్తకాలు సర్దే చిన్న ఉద్యోగంలో చేరారు. మల్లంపల్లి సోమశేఖరశర్మగారి లాగానే 'డిగ్రీలులేని పాండిత్యం వన్నెకు రాని పాడు కాలంలో పుట్టి గ్రంథాలయోద్యోగిగా అంచెలంచెలుగా పుస్తకాల లోగుట్టు తెలుసుకుంటూ స్వయంకృషితో సుప్రసిద్ధ సాహిత్యవేత్తగా ఎదిగిన శర్మ జీవితం అందరికీ ఆదర్శప్రాయం.

సుప్రసిద్ధ సాహితీ విమర్శకుడు వాడ్రేవు చిన వీరభద్రుడుగారి మాటల్లో "సన్నిధానం నరసింహశర్మ అంటే నడిచే రాజమండ్రి, పాంటూ, చొక్కా తొడుక్కున్న గోదావరి పాయ్, మాట్లాడే గౌతమీ గ్రంథాలయం".

నేదునూరి గంగాధరం, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, మల్లంపల్లి శరభయ్య, ఆరుద్రలను గురుస్థానంలో నిలుపుకుని వారి రచనలను, వేలకొలది పద్యాలను సభలలో గానంచేస్తూ, విశ్లేషిస్తూ వారికి ఉడుగరగా రచనలు చేసి అంకితమిస్తూ గురువుల ఋణం తీర్చుకున్న అదృష్టవంతులు సన్నిధానం నరసింహశర్మ.


రాజమహేంద్రవరంలో గోదావరీ తీరంలోని గౌతమీ గ్రంథాలయంలో సన్నిధానం ఓ మంచినీటి చెలమగా అవతరించి సంప్రదాయ కవులకూ అభ్యుదయకవులకూ పరిశోధకులకూ నిత్యం జ్ఞానతృష్ణ అనే కవితాదాహాన్ని తీరుస్తూ వెయ్యేళ్ళుగా ఆంధ్రుల సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లిన రాజమహేంద్రవరాన్ని సాహితీ సుసంపన్నం చేస్తూనే ఉన్నారు.

సి.పి.బ్రౌన్‌ను హృదయస్థానంలో నిలుపుకుని, స్వగృహాన్ని బ్రౌన్ మందిరంగా మార్చుకుని బ్రౌన్ ఉదాహరణ కావ్యం రచించి ఆరుద్రకు అంకిత మిచ్చిన బ్రౌన్ భక్తుడు సన్నిధానం. కాటన్‌ను కీర్తించేటప్పుడు వీరి కవితలు వీరావేశంతోనూ, భక్తితోనూ తొణికిసలాడతాయి.

2024 డిసెంబరు 7న సన్నిధానం నరసింహశర్మ పుట్టినరోజు వేడుకలను నిత్యసాహితీవ్రతులు, లబ్ధప్రతిష్ఠులు అయిన సాహితీవేత్తల సమక్షంలో కుటుంబసభ్యులు హైదరాబాదులోని వారి స్వగృహంలో తమ్ముడు సన్నిధానం శాస్త్రి నేతృత్వంలో ఘనంగా జరుపుకున్నారు.

సన్నిధానంకు ప్రాణహితుడైన ప్రముఖ సాహితీవేత్త సతీష్ చందర్ సభకు అధ్యక్షత వహించి రాజమండ్రి మధురస్మృతులను స్ఫురణకు

తెచ్చుకున్నారు. అమ్మనుడి సంపాదకులు సామల రమేష్ బాబు సభాప్రారంభం చేసి 'ప్రేమను కురిపించే ఆత్మీయ వ్యక్తిత్వం సన్నిధానంది' అన్నారు. సాహితీమూర్తులు నామాడి శ్రీధర్, ఒమ్మి రమేష్ బాబుల సంపాదకత్వంలో సన్నిధానం నరసింహాశర్మ జన్మదిన విశేషసంచిక 'సాహితీ సంకీర్తకుడు' అందంగా ముస్తాబయ్యింది. ఆచార్య జయధీర్ తిరుమలరావు సభలో 'సాహితీ సంకీర్తకుడు' గ్రంథాన్ని ఆవిష్కరించారు. పరిశోధకులకు దశ, దిశా నిర్దేశం చేసే సన్నిధానం ప్రతిభ అసమానమని కొనియాడారు. ఈ సభలో పునర్ముద్రణ భాగ్యానికి నోచుకున్న 'బ్రౌన్ ఉదాహరణ' కావ్యాన్ని విశిష్ట అతిథి ఆచార్య అనుమాండ్ల భూమయ్య ఆవిష్కరించి పద్యకవిగా సన్నిధానం విశిష్ట స్థానాన్ని నిగ్గుదేల్చారు. ఆంధ్రజ్యోతి సంపాదకులు డా.కె. శ్రీనివాస్ పునర్ముద్రితమైన 'ఆరుద్ర లేఖలు' రచనను ఆవిష్కరించి, విమర్శకులుగా సన్నిధానం నరసింహాశర్మను కొన్ని దశాబ్దాలుగా ఎరుగుదునని అన్నారు. ఆత్మీయ అతిథి శ్రీ కల్లూరి భాస్కరం మాట్లాడుతూ మహోన్నత వ్యక్తిత్వంతో అందరినీ బేషరతుగా ప్రేమించే సన్నిధానం విశ్వమానవు డన్నారు. 'సాహితీ సంకీర్తకుడు' గ్రంథాన్ని సమీక్ష చేసిన కొప్పర్తి వెంకట రమణమూర్తి 54 కలాలనుంచి జాలువారిన వ్యాసాలన్నీ చిన్నపాటి వైరుధ్యంకూడా లేకుండా సన్నిధానంను, వారి రచనలను ఆత్మీయంగా ఆవిష్కరించాయన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన యాకూబ్ నిఖార్సైన, నిండైన వ్యక్తిత్వంతో అలరారే మానవతావాది సన్నిధానం తనకు ఆరాధ్యులని అంటూ 'జయహో సన్నిధానం' అంటూ చిరు ఉపన్యాసాన్ని ముగించారు.



"సాహిత్య సంకీర్తకుడు" గ్రంథంలోని వ్యాసాలలోని కొందరు ప్రముఖుల ఉటంకింపులు మచ్చుకు కొన్ని :

అఫర్ వ్యాసం 'ఆయన లోపలే ఒక గౌతమి': "సన్నిధానంగారిని కలవడం అంటే ఒకేసారి వివిధ యుగాల సమ్మేళనం. ఎన్ని వందల పద్యాలు అనర్గళంగా ప్రవహిస్తాయో, అన్నేసి వందల వచన కవితలూ అంతే వేగంగా దూసుకొస్తాయి. అంతకంటే ఎక్కువగా పూర్వ, మధ్యకాలీన, ఆధునిక సాహిత్యవేత్తల గురించి అంత కళ్ళకి కట్టినట్టు చెప్పేవాళ్ళు మనకి తక్కువ."

నిఖిలేశ్వర్ వ్యాసం 'సహృదయ సాహితీవేత్త' :"సన్నిధానంవారు స్వయంగా కవి, రచయిత. సాహిత్యంలోని ఆయా అంశాలపై జనరంజకంగా మాట్లాడే నైపుణ్యం వారికున్నది. ప్రబంధ సాహిత్యంతోపాటు ఆధునిక రచనల లోతుపాతులు తెలుసు. రాజమండ్రిలోని పండిత ప్రకాండులు, కవిసమ్రాట్టులతోపాటు ఆధునిక తెలుగు సాహిత్యంలోని ప్రముఖులతో శర్మగారికి సాన్నిహిత్యం ఉంది."

శిఖామణి వ్యాసం 'సంప్రదాయంలో వెలిగిన ఆధునికతా దీపం' :"సన్నిధానంగారికి అభిమాన విషయాలు చాలా ఉన్నప్పటికీ నాలుగు అంశాలు ఆయనకు ప్రాణప్రదం అని నేను అనుకుంటాను. ఒకటి, తాను పుట్టి పెరిగిన రాజమహేంద్రవరం. రెండు, గోదావరి నది. మూడు గ్రంథాలయ పాలన. నాలుగు, కాటన్ దొర, బ్రౌన్ దొర. ఈ చతుర్విధ ముఖాలతో ఆయన ఒకరకంగా సాహిత్య బ్రహ్మ."

శిలాలోలిత వ్యాసం 'ఆయన ఒక గోదావరి' :"సన్నిధానంగారే రాజమండ్రిగా, రాజమండ్రే సన్నిధానంగారిలా మా మనసుల్లో ముద్ర వేసిన మహావ్యక్తిత్వం సన్నిధానంగారిది. వారి పరిచయం జీవితంలో గొప్ప కానుక."

వాడ్రేవు చిన వీరభద్రుడు, శిఖామణి, ఎమ్మెస్, సూర్యనారాయణ, అందెశ్రీ, శిలాలోలిత, కె. సజయ, కె. వరలక్ష్మి, గౌరీచందర్, ఉద్దరాజు బాచిరాజు, యాదగిరి, కె.జయబాబు, పాలకోడేటి సత్యనారాయణ వంటి సాహిత్య ప్రముఖులు ఎందరో నాటి సభలో పాల్గొన్నారు.

సన్నిధానం నరసింహాశర్మ 80 వసంతాల వేడుక సన్నిధానం శాస్త్రి సభాస్వనంతో ప్రారంభమై గాడేపల్లి దివాకర దత్ వందన సమర్పణతో ముగిసింది. సన్నిధానం వంశీ, సన్నిధానం రవితేజ కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించడంలో సహకరించారు.

రావిశాస్త్రి... 27 పుట కొనసాగింపు

దాని మానాన దాన్ని బతకనివ్వక (లేదా చావనివ్వక) ఆ రాసినవాడు దాన్ని సాకుతో సంరక్షించుకుంటూ సమర్థించుకుంటూ నెత్తిని పెట్టుకుని తిరగడం నాకు ఇష్టం లేదు. నిజానికి దగ్గరగా ఉంటే కథ కొన్నాళ్ళు ఉండవచ్చు. సత్తువుంటే ఉంటుంది లేకపోతే పోతుంది,' " (https://kolimi.org అన్నారు. ఈ 'వేతనశర్మ' కథలోని వస్తువుకు, ఆ వస్తువును చెప్పడానికి ఎంచుకున్న కథనానికీ, కథాంగాలకూ ఆ సత్తా ఉంది. కాబట్టే ఇప్పటికీ నిలిచి ఉంది. దోపిడీ వ్యవస్థ పోయేంతవరకూ నిలిచే ఉంటుంది.

తెలంగాణ వైతాళికుడు కాళోజీ.....21 పుట కొనసాగింపు

అందుకే తెలుగు భాషను గురించి చెబుతూ భాష రెండు రకాలని ఒకటి బడిపలుకులభాష అనీ, రెండవది పలుకుబడులభాష అనీ అంటాడు. బడిపలుకుల భాష అంటే కృత్రిమమైన భాష అని. అది గ్రాంథిక భాష అనీ అంటాడు. పలుకుబడులూ, సామెతలూ, పొడుపు కథలూ మొదలైనవాటివల్ల ఇంటిలో, సమాజంలో నేర్చుకొనే భాష జీవ చైతన్యంతో తొణికిసలాడుతందనీ, అదే పలుకుబడుల భాష అనీ, ఇదే జీవితానికి దగ్గరగా, విజ్ఞానదాయకంగా ఉంటుందనీ కాళోజీ వాదం. ఏ ప్రాంతం వారికైనా తమ ప్రాంతపు పలుకుబడులలో రాసే భాష లేదా మాట్లాడే భాష ఆత్మీయంగా ఉంటుందని గిడుగు, గురజాడలు కూడా చెప్పింది ఇదేనని కాళోజీ విశ్వాసం. అయితే సినిమా వంటి వివిధ రంగాలలోని వారు మానవ వనరు అయిన సహజ భాషపై ఆధిపత్యం చలాయించారని కాళోజీ అంటాడు.

కాళోజీ తెలంగాణ ఊపిరి. ప్రాంతీయ తత్వాన్ని అణువణువున జీర్ణించుకొన్న విశ్వమానవుడు. సామాజిక భాషా సాహిత్య చైతన్యవంతుడు. చైతన్యవంతమైన వక్తృత్వ శక్తి ఉన్న వైజ్ఞానిక వ్యక్తి కాళోజీ. అన్నపురాసులు ఒకచోట, ఆకలి మంటలు ఒకచోట అంటూ కవిత్వీకరించిన కాళోజీది అంతా ప్రజాకవిత్వం. కొంత గేయలక్షణం, కొంత జానపదరీతి, మరికొంత వ్యంగ్యం, వీటన్నింటితోపాటు తెలంగాణ మాండలిక తేజస్సు, రాజకీయలను ప్రజాకీయాలుగా మార్చే గాంధీ తపస్సు వీటన్నింటి సమాహారమే కాళోజీ కవిత్వం. 'కాళోజీ ప్రజలందరి ఆత్మ, తెలంగాణ అంతరాత్మ' అని పి.వి. నరసింహారావుగారు అన్నారు.

పాఠ్యగ్రంథాలలో, పత్రికలలో, ప్రసార, ప్రచార మాధ్యమాలలో, ప్రభుత్వ సమాచార వ్యవస్థలో, కోర్టు తీర్పులలో, తెలంగాణ తెలుగు భాషా సాహిత్య సాంస్కృతిక విషయాలలో తెలంగాణ తెలుగు భాషకు ప్రాధాన్యమివ్వడం అనేది తెలంగాణ వైతాళికుడు అయిన కాళోజీ నారాయణరావుకు ఇచ్చే నిజమైన నివాళి.

తెలుగుకు పాతర ... 28పుట కొనసాగింపు

మారుతున్న ఉపాధి చిత్రంతో పాటు తెలుగులో కొత్త కోర్సులను పరిచయం చేయవలసిన అవసరం ఉంది. ఆంగ్ల భాషలోని అనంత విజ్ఞానాన్ని, శాస్త్ర గ్రంథాలను మన భాషలోకి అనువదించే అనువాదకులను తయారుచేయాలి. ఈ పని చేస్తే ఒకవైపు మన భాషను కాపాడుకుంటూనే ఉపాధి అవకాశాలను కల్పించగలుగుతాం. తెలుగు సాహిత్య అధ్యయనం, జర్నలిస్టులుగా రాణించగలిగే అవకాశం ఒకే కోర్స్ ద్వారా కల్పించగలిగితే విలువలతో కూడిన జర్నలిస్టులు తయారవుతారు. టి.వి ఛానల్స్, సామాజిక మాధ్యమాలు విపరీతంగా పెరిగిపోవటం వల్ల విలేఖరులకు (journalists), విషయ రచయితలకు (content writers), వ్యాఖ్యాతలకు (anchors) చక్కని ఉపాధి అవకాశాలున్నాయి. అయితే ప్రయోజనాత్మక తెలుగుతో పాటు మానవీయ, నైతిక విలువలను నేర్పే తెలుగు సాహిత్యాన్ని మేళవించి కొత్త కోర్సులను తయారుచేయటం మీద భాషాభిమానులు, సాహిత్యాభిమానులు దృష్టి పెట్టాలి.

నాయకత్వ విద్య (Leaderhip Education) పేరుతో ఆం.ప్ర.రా.ఉ.వి.స. (APSCHE) వారు ఒక నైపుణ్య విషయాన్ని (skill course) విద్యార్థులకు తప్పనిసరి కోర్సు గా పెట్టటం మనం చూశాం. పాశ్చాత్య మేధావుల సిద్ధంతాలను వివరించే ఆంగ్ల పారిభాషిక పదాలు కష్టంగా ఉండటం వల్ల విద్యార్థులకు ఆ నైపుణ్యాలను అలవరచుకోవటం తలనొప్పిగా మారింది. విద్యార్థులలో నాయకత్వ నైపుణ్యాలు పెంచే క్రమంలో మన సాహిత్యం నుంచి చక్కని ఉదాహరణలతో ఆయా భావనలను హృదయానికి హత్తుకునేలా చేసే అవకాశం ఉంది. తెలుగులో అటువంటి నైపుణ్యాలను అందించవచ్చు కదా!

ఇంతకూ ఉద్యోగాల కోసం మన తెలుగువారు ఆంగ్ల ప్రాంతాలకు వలస వెళ్ళవలసిందేనా? తెలుగులో వైద్యవిద్యను, సాంకేతిక విద్యను, న్యాయవిద్యను అందించి మన తెలుగువారు మన ప్రాంతంలోనే పని చేసేలా అవకాశాలు కల్పించలేమా? ఈ విషయంలో చైనా, జపాను, కొరియా, రష్యాలను ఆదర్శంగా తీసుకోలేమా? కనీసం మన రాష్ట్రంలో కూడా మన తెలుగువారికి ఉద్యోగాలే లేవా? కల్పించే అవకాశం లేదా? అటు ఆంగ్లానికీ, ఇటు తెలుగుకీ కొరగాని విద్యావంతులను తయారుచేసే విద్యావిధానం వల్ల మనం ఏమి సాధించబోతున్నాం? ప్రశ్నించుకోవలసిన సమయం ఇది. సమాధానాలు వెతకవలసిన సమయం ఇది. తెలుగు భాషను చిరంజీవిని చేసే అమృతం కోసం మేధోమథనం జరగవలసిన సమయం ఇది.

రచయిత్రి, తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ మహిళా కళాశాల, గుంటూరు

ఆరని కాగడా ....34 పుట కొనసాగింపు

తెలుగు దేశం వ్యవసాయ ప్రధానంగా ఉంది. అలాటి సందర్భంలో ఎంత పారిశ్రామికీకరణ జరిగి, కొత్త వర్గాలు పుట్టి సామాజిక దశల్లో పరిణామాలు వస్తున్నా శిథిలమయ్యే ఫ్యూడలిజం దశకు సంబంధించిన అవశేషాలు పూర్తిగా నశించడం కష్టం. సామాజిక పరిణామ దశల్లో ఇవన్నీ అంచెలు. ధర్మారావు ఆశించిన మహోన్నత దశకు చేరుకోవాలంటే ఈ అంచెలను చేరకుండా అడ్డుదారి లేదు. ఉండదు. అథవా ఉందని కొందరు భ్రమించినా, అది లక్ష్యానికి చేర్చబోదన్నది ప్రపంచ ప్రజాపోరాటాల చరిత్ర విప్పిచెప్తోంది. కనుక ఈ మార్గంలో ప్రయాణం అనివార్యం. అయినప్పుడు చీకివికిపోతున్న గతకాలపు దుర్లక్షణాలు ఈ సమాజంలో కూడా కనిపిస్తాయి. అవి ఉన్నంత కాలం, తన పూర్వీకుల దగ్గర మార్గమాధ్యంలో ధర్మారావు అందుకున్న కాగడా ఆగదు. దాన్ని ధర్మారావు వారసులమైన మనం అందుకోక తప్పదు. ధర్మపథంలో, నిత్యం జరిగే ఈ భావవిప్లవ పోరాట క్రమంలో - మనమందుకున్న ఈ మండే కాగడా ఆరదు.

రచయిత, సంపాదకులు నవచేతన ప్రచురణలు

2024లో నిర్మించిన తెలుగు సినిమాలు షుమారు 200. వాటిలో ఇంగ్లీషు పేర్లు 70, ఉర్దూ, హిందీ పేర్లు 15, తమిళంవి కొన్ని, అర్థం కానివి కొన్ని, పేర్లేనా అనిపించేవి కొన్ని.. ఇదీ మన తెలుగువారి పరిస్థితి.

జి.వి.పూర్ణచందు
9848598446

తెరువు-తెరువరి

> 'ఒక ముసలి పులి స్నానముచేసి దర్భలు చేతఁబట్టుకొని కొలను గట్టుననుండి యోయి తెరువరి, యీ పయిడి కంకణము వచ్చి పుచ్చుకొమ్మని పిలిచి చెప్పెను. ఒక పాంథుడా మాట విని యిది నా భాగ్యము చేతనే వచ్చుచున్నది. ఏల సంచేహపడవలె నని చింతించి యేదీ కంకణము చూపుమని యడిగెను. పులిచేయి చాచి యిదిగో హేమకంకణము చూడుమని చూపెను.'

చిన్నయసూరి గారి నీతిచంద్రిక పూర్వార్థంలో ఒక పులి ఒక తెరువరి మధ్య సంవాదం ఇది. ఇందులో తెరువరి, పాంథుడు అనే రెండు పదాలను సూరి ప్రయోగించాడు. రెండింటికీ బాటసారి అనే అర్థం. కొలనులో స్నానం చేసి ఒక పులి దర్భలు చేత్తో పుచ్చుకుని మునిలా కూర్చుంది. ఆ కొలనులో స్నానానికి ఓ తెరువరి అక్కడకు వచ్చాడు. పాతవాళ్లకి పులి ఎత్తులు తెలుసు కాబట్టి ఈ కొత్తవాణ్ణి పులి ఎంచుకుంది. బంగారు కంకణం ఇస్తాను వచ్చి తీసుకో అంది. ఆశపడ్డాడు బాటసారి. అయినా సందేహంగా ఏదీ కంకణం చూపించు అన్నాడు. తన చెయ్యి చాచి కంకణం చూపించింది పులి.

పెద్ద రోడ్డుని తెరువు లేదా తెరవు అంటారు. తెరువున పోయేవాడు తెరువరి. త్రోవ, దారి, బాట, తెన్ను, తెరువు ఈ ఐదూ మార్గం అనే పదానికి తెలుగు పేర్లని ఆంధ్రనామసంగ్రహం పేర్కొంది. ఈ ఐదింటినీ ఐదు స్థాయిల్లో ఉన్న రోడ్లకు పేర్లుగా మనం వాడుకోవచ్చు. ఇప్పుడు రోడ్లని ఆర్టీరియల్ రోడ్లు, కలెక్టర్ రోడ్లు, ఫ్రీవేస్ ఇలా కొత్త పేర్లతో పిలుస్తున్నారు. దారివత్తిడిని (ట్రాఫిక్) ఇతర మార్గాలకు మళ్ళించటానికి ఇవి ఉపయోగిస్తాయి. ఉపరహదారులు ఏర్పడితే, ప్రధాన రహదారులపై వత్తిడి తగ్గుతుంది.

హిందీ వాళ్లు ఆర్టీరియల్ రోడ్డుని 'ధమనీ సడక్' అని అనువదించుకున్నారు. కానీ, తెలుగులో ధమనిదారులు అంటే, కృతకంగా ఉంటుంది. అలాగని మనకు పదాలు లేవని మౌనంగా కూర్చోవలసిన అవసరం లేదు. జాతీయ రహదారుల్ని 'తెరవు' అనీ, జిల్లా రహదారుల్ని 'తెన్ను'లని, ఊళ్లలో ఉండే రోడ్లని బాటలని, ఊరినీ ఊరినీ కలిపేవాటిని 'దారు' లని ఊరినీ ఊరిబయట పొలాలు వగైరాల్ని కలిపే వాటిని 'త్రోవ' లని కొత్త అర్థాల్లో మనం పిలుచుకోవచ్చు. కొత్త అవసరాలకు వాడుకో గలగటం వలన భాష కొత్తదనాన్ని పొందుతుంది. 'విజయవాడ హైదరాబాద్ తెరవు 247 కి. మీ. పొడవున 6 వరుసల్లో ఉంటుంది' అని చక్కగా తెలుగులో చెప్పవచ్చు. మరుగున పడిపోతున్న మన పదాల్ని వదిలేసి ఇంగ్లీషుకి సమానార్థకాల్ని సృష్టించాలని చూస్తే ఈ కృతకాలు అయోమయానికే దారి తీస్తాయి.

'ఊరికిఁ' బోయెడి వోతఁడ కడు/ చేరువ తెరువేఁగి చెలఁగుమీ' అనే కీర్తనలో అన్నమాచార్యులవారు దారిన పోయే తెరువరిని చాలా దగ్గరగా ఉన్న తెరవున వెళ్ళమన్నాడు. కుడి ఎడమల కడు దొంగలున్నారు. భక్తి పేరు చెప్పి నిలువుదోపిడీ చేస్తారు. నడిమి తెరువులో వెడితే శ్రీ వెంకటేశ్వరుడి కరుణ లభిస్తుందంటాడు ఈ కీర్తనలో. ఆరు వరుసల తెరవు (హైవే)లో వచ్చేందుకు పోయేందుకు మూడేసి వరుసలు ఉంటాయి. కుడివైపు భారీ వాహనాలు ఎడమ వైపు చిన్న వాహనాలు రయిరయిన పోతుంటే, మధ్య తెరువులో పోవటాన్నే ఎంచుకుంటాం కదా! 'అడ్డదారుల్లో మోక్షాన్ని పొందవచ్చంటూ నిన్ను చాలా మంది తమవైపు లాగాలని చూస్తారు. అలాంటి ఇరుకుసందుల్లో తిరుగుతో వృథాప్రయాస పడకు. 'దొడ్డతెరువు' (ఎక్స్‌ప్రెస్ హైవే) వైపు పద అంటున్నాడు. అండ నుండే పరమాత్ముడి తిరుమలకొండ తెరువుకి ఆకలిగొన్నవాడిలా వెళ్ళమన్నాడు.

లైవ్‌లీహుడ్' అనే పదానికన్నా 'బతుకుతెరువు' అనే తెలుగు మాటలో ఎక్కువ లోతు ఉంది. జీవితం అనే ప్రయాణం సుఖంగా జరగాలంటే చక్కని తెరువు ఉండాలి! తిక్కనగారు 'కడుంజెడు తెరువు' అన్నాడు. గుంటలు పడిన రోడ్డు లాగా జీవితం ఉండకూడదని!


తెరువు మనకి కొత్త మాట కాదు. సరకు రవాణా చేసే 'హైవేలని' చరిత్ర యుగాలలో తెరువులనే పిలిచారు. ప్రాపెడ్డ తెరువు, చిపూండి తెరువు, బడవాటి తెరువు, భండితెరువు, దొండపాటి తెరువు లాంటి పేర్లు కొన్ని శాసనాల్లో కనిపిస్తాయి. ప్రాపెడ్డ తెరువంటే ఎడ్లబండి వెళ్ళగలిగేంత దారి అనీ, దొండపాటి తెరువు అంటే దొండపాడు వెళ్లే దారి అనీ అర్థాలు కావచ్చు. ఈ హైవేలు వెళ్లే దారికి దగ్గరగా ఉండే గ్రామాల్లో సంతలు జరిగేవి. వ్యాపారులు బళ్లు దింపుకుని కొంత అమ్మకాలు చేసుకునేవాళ్లు. తెరువులు ఏర్పరిచి తెరువుసుంకం(టోల్ టాక్స్) విధించే వాళ్లు కూడా!

"...బ్రజవివాదము లెడ' బక్షముడిగి/విని ధన వాంఛమై ధనికుందెస వ్రాలి తీర్పక ధర్మంబు తెరువు దప్ప/కుండఁబాడి దీర్చి దండింపఁదగునెడ ననుగుణంపు దండ మాచరింపు... ధనవంతులవైపు మొగ్గకుండా ధర్మపు తెరువు తప్పకుండా తీర్పు ఇవ్వమని ఆంధ్రమహాభారతం శాంతిపర్వంలో తిక్కనగారి సూచన. జుడిషియరీని 'ధర్మపు తెరువు' (ధర్మానికిదారి) అన్నాడు తిక్కన 'కాని తెరువు'న పోయేవాళ్లు కౌరవులు,'ధర్మతెరువున పోయేవాళ్లు పాండవులు. అన్ని తెరువులూ అరసిన తెరువరులు కురువృద్ధులు. ఎవరు ఎంత చెప్పినా వినని'తెంపరితెరువరి' దుర్యోధనుడు. సింహం పైకి ఏనుగు పోతానంటే ఎవరేం చెయ్యగలరు?

తెరువున పోయే వారంతా తెరువరులు. తెరువరుల్లో కౌరవులూ ఉంటారు, పాండవులూ ఉంటారు. తెంపరులూ (దుస్సాహసం చేసే వాళ్లు) ఉంటారు. తెరువు(హైవే)ల మీద ప్రమాదాలు జరగటానికి ఈ తెంపరి తెరువరులే కారణం!




ఒక అస్పృశ్యుని యుద్ధగాథ (మూడో భాగం)
రచన: డా. కత్తి పద్మారావు.
పుటలు: 582, వెల: రూ 600/-
ప్రతులకు: కత్తి స్వర్ణకుమారి,
లోకాయుత ప్రచురణలు
లుంబినీవనం, అంబేద్కర్ కాలనీ,
పొన్నూరు - 522124
గుంటూరు జిల్లా,
ఫోన్ నెంబర్: 9849741695




భారతదేశ చరిత్ర (మూడవ భాగం)
అక్బర్. శ్రీకృష్ణదేవరాయలు
రచన : డా. కత్తి పద్మారావు
పుటలు: 479, వెల: రూ 500/-
ప్రతులకు: కత్తి స్వర్ణకుమారి,
అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్
లోకాయత ప్రచురణాలు, లుంబినీవనం,
అంబేద్కర్ కాలనీ,పొన్నూరు - 522124,
గుంటూరు జిల్లా, ఫోను నెంబర్: 9849741695.




కులం ప్రత్యామ్నాయ సంస్కృతి
రచన: డాక్టర్ కత్తి పద్మారావు
పుటలు: 176 వెల: రూ 100/-
ప్రతులకు: లోకాయుత ప్రచురణలు,
లుంబినీవనం, అంబేద్కర్ కాలనీ,
పొన్నూరు - 522 124
గుంటూరు జిల్లా,
ఫోన్ నెంబర్: 9849741695




మూడు దశాబ్దాలు 1994-2024
రచన : టి. రవిచంద్
పుటలు: 31, వెల: రూ 25/-
ప్రతులకు: టి. రవిచంద్, మిళింద ప్రచురణలు
భారతతత్వ అధ్యయన వేదిక,
ఇంటి నెంబరు: 11-5-4బి నాళంవారి వీధి,
గవర్నమెంట్ హాస్పిటల్ ఏరియా
బాపట్ల - 522101,
ఫోన్ నెంబర్: 95566134406



ఇంద్రధనస్సు (పద్య కావ్యం)
రచన: ఎస్. ఆర్ పృథ్వి
పుటలు: 68, వెల: రూ 100/-
ప్రతులకు: శ్రీమతి పి ఉషారాణి,
ఇంటి నెంబర్ 104-6-140,
యం.జి. స్ట్రీట్, రామకృష్ణ నగర్,
రాజమహేంద్రవరం - 533 101,
ఫోన్ నెంబర్: 9989223245




వ్యక్తిత్వ నిర్మాణం
రచన : డా. కత్తి పద్మారావు
పుటలు: 468, వెల: రూ 500/-
ప్రతులకు: కత్తి స్వర్ణకుమారి,
అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్,
లోకాయత ప్రచురణలు,
లుంబినీవనం, అంబేద్కర్ కాలనీ,
పొన్నూరు - 522124, గుంటూరు జిల్లా,
ఫోను నెంబర్: 9 8 4 9 7 4 1 6 9 5.



నానీల కమ్మలు
రచన: డా. మడత భాస్కర్
పుటలు: 136, వెల: 150/-
ప్రతులకు: శ్రీమతి మడత సంధ్య,
ఇంటి నెంబర్: 33-5-305/7,
శ్రీ వినాయక కాలనీ, రోడ్ నెంబర్ 1,
నాయుడు పెట్రోల్ పంపు,
వరంగల్ - 506 005,
ఫోన్ నెంబర్: 8919328582




వ్యాసాలు,(సాహిత్య, సామాజిక, సాంస్కృతిక,
పరిశోధక వ్యాసావళి)
రచన: ఆప్కారి సూర్య ప్రకాశ్
పుటలు: 184, వెల: రూ 200/-
ప్రతులకు: ఆప్కారి సూర్య ప్రకాశ్,
సూర్య వీణ ఫ్లాట్ నెం: 33,
ఇంటి నెం: 8-7-195.
పి. పి. ఎన్క్లేవ్, సమతా నగర్, ఓల్డ్ బోయినపల్లి,
సికింద్రాబాద్, 500011,
ఫోను నెంబర్: 9848506964




జక్కదొన (కథా సంపుటి)
రచన: ఆర్.సి. కృష్ణస్వామి రాజు
పుటలు: 167, వెల: రూ 140/-
ప్రతులకు: ఆర్ సి కృష్ణస్వామి రాజు,
ఇంటి నెంబర్: 22-4-71,
బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ, అక్కంపల్లి పోస్ట్,
తిరుపతి - 517 507,
ఫోన్ నెంబర్: 9393662821



ఎరుపు (అసి కవితలు)
రచన: సింగంపల్లి అశోక్ కుమార్
పుటలు: 87, వెల: రూ 90/-
ప్రతులకు: ఆలోచన, 305,
ప్రగతి టవర్స్, వీరయ్య స్ట్రీట్,
మారుతీ నగర్, విజయవాడ, 520004
నెంబర్ ఫోను: 9246277375.



విజయ కథ!
(ఒక నవలికా, ఒక పెద్ద వ్యాసమూ,
9 చిన్న వ్యాసాలు, కలిసిన సంపుటం.)
రచన : రంగనాయకమ్మ
పుటలు: 160, వెల: రూ 80/-
ప్రతులకు: అరుణా పబ్లిషింగ్ హౌస్,
ఏలూరు రోడ్డు,
విజయవాడ- 520002, ఫోను నెంబర్:
9440630378



విశ్వబ్రాహ్మణులు
(సంస్కృతి ఉ అనుకరణము)
రచయిత: డా. జి. జ్ఞానానంద
తెలుగు అనువాదము: డా. కపిలవాయి లింగమూర్తి
పుటలు: 420, రూ. 300
ప్రతులకు: డా. లాల్ కోట వెంకటాచారి,
ఇంటి నెంబర్: 3-64/బి/5/1, ఎండోమెంట్స్ కాలనీ,
రామంతపూర్, హైదరాబాద్, 500013
ఫోను: 9849908888.

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362


HP
Petrol
Diesel
విశాఖ ఫిల్లింగ్ స్టేషన్
VISAKHA FILLING STATION
నమ్మకమైన డీజిల్ పెట్రోల్; తక్కువ ఇంధనం, ఎక్కువ మైలేజి కోసం
మేనేజింగ్ డైరెక్టర్: తుమ్మల కోటేశ్వరరావు, ఫోన్: 0864 3296777
ప్రొప్రైటర్: తుమ్మల రాధిక
నిడుబ్రోలు, పొన్నూరు, గుంటూరు జిల్లా, ఆం.ప్ర. 522124

అమ్మనుడి తెలుగు జాతి పత్రిక
Ammanudi (Telugu monthly)

Date of publication : 1st of every month
Date of posting: 3rd & 6th of every month

RNI- APTEL /2015/62362
Postel Reg . TEN /14/2021-23

If not delivered please return to : The Publisher, AMMANUDI monthly,
8-386, Jivaka Bhavanam, ANGALAKUDURU (P.O), TENALI-522211, Guntur(dt) A.P Cell: 949298024